
ఇది మోదీ కథ

వినోద్ కె. జోస్



ప్రజాశక్తి బుక్‌హౌస్

ఇది మోదీ కథ

వినోద్ కె. జోస్

తెలుగు

వి.వి. జ్యోతి

ప్రజాశక్తి బుక్‌హౌస్

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర

హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

978-93-84162-21-4

98054

ప్రచురణ సంఖ్య : 1328

ప్రథమ ముద్రణ : మే, 2014

వెల : ₹ 25/-

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర
హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు, కరీంనగర్

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

విషయసూచిక

ముందుమాట

ప్రస్తుత ఎన్నికల్లో ఒకబలమైన ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందుకు వచ్చారు మోదీ. దాదాపుగా ప్రతిరోజూ జాతీయస్థాయిలోను, స్థానికంగాను ప్రధాన స్రవంతి పత్రికలలో మోదీ అనుకూల కథనాలను చూస్తూనే ఉన్నాం. ఇంటర్నెట్, సోషల్ మీడియాలోనూ అదే పరిస్థితి ఉంది. ఇవన్నీ చెబుతున్నట్లు మోదీ సమర్థతకు, అభివృద్ధి కాముకతకు ప్రతిబింబమేనా? మరి గుజరాత్‌లో 2002లో జరిగిన అత్యంత హేయమైన మత దాడుల్లో గాల్లో కలిసిపోయిన 1200 ప్రాణాల మాటేమిటి? ముఖ్యమంత్రిగా ఆ సమయంలో ఆయన నిర్వర్తించిన పాత్రేమిటి? వాద్‌నగర్‌లోని చాయ్‌వాలా నుంచి ప్రధాని అభ్యర్థి వరకు ఆయన ఎలా ఎదిగారు? కేవలం సమర్థత, స్వయంకృషితోనేనా? లేదా కుట్రలు, కుతంత్రాలు, జిత్తులు, బెదిరింపులతో పైకెగబాకారా? ఒకప్పుడు మోదీని జాతి హననానికి పాల్పడ్డావని నిలదీసిన అగ్ర పారిశ్రామిక వేత్తలు ఇప్పుడు మాట మార్చారెందుకని? వారి దృష్టిలో మోదీ ఇప్పుడు 'దార్శనికుడు' ఎలా అయ్యారు? గుజరాత్ మోదీ హయాంలో అభివృద్ధిలో అగ్రగామి రాష్ట్రంగా ఉందన్నది సత్యమేనా? ప్రభుత్వ గణాంకాలు అందుకు భిన్నమైన సమాచారాన్ని ఇస్తున్నా ప్రధాన స్రవంతి అభిప్రాయంలో వాటికి చోటే లేకుండా పోయిందెందుకని? అందుకు మోదీ అనుసరించిన ప్రచార వ్యూహమేమిటి? వీటన్నిటికి సమాధానం ఇచ్చే ప్రయత్నమే ఈ కథనం.

గుజరాత్‌లో విస్తృతంగా పర్యటించి అనేకమంది నాయకులను, అధికారులను మోదీ రాజకీయ సహచరులను, కుటుంబ సభ్యులను, చిన్ననాటి మిత్రులను కలుసుకుని సమాచారం సేకరించి ఒక సీనియర్ జర్నలిస్ట్ రాసిన కథనం ఇది. రెండేళ్ళ క్రితమే కారవాన్ మేగజైన్‌లో ప్రచురితమయింది. ఎనిమిదేళ్ళ వయస్సులో ఆర్‌ఎస్‌ఎస్ 'బాల స్వయం సేవక్' గా మారినప్పటి నుంచి ఇటీవలి వరకు మోదీ రాజకీయ జీవితాన్ని, అతని వ్యక్తిత్వాన్ని పట్టిచ్చే కథనం ఇది. చదివి మీరే ఒక నిర్ధారణకు రండి.

ఇది మోదీ కథ

అది 1498వ సంవత్సరం ఏప్రిల్ 22 మధ్యాహ్నం తూర్పు ఆఫ్రికాలోని మాలిండి ఓడరేవు ప్రాంతం. తీరప్రాంతానికి కొద్ది కిలోమీటర్ల అవతల సముద్రంలో నౌకను నడుపుతున్న కెప్టెన్ వాస్కోడిగామా ముఖంలో అంతులేని ఆనందం. ఇండియా తీరప్రాంతాన్ని చేరడం కోసం అప్పటికి నాలుగు నెలలుగా మొజాంబిక్ నుంచి మొంబాస తీరప్రాంతమంతా గాలించాడు. అది ఆఫ్రికా ఖండపు ఆగ్నేయ తీరప్రాంతం. స్థానిక పాలకులు, అరబ్, ఆఫ్రికా పాలకులు పెట్టే అడ్డంకులను ఎదుర్కొంటూ సాగినా ఫలితం దక్కలేదు.

భారతదేశపు తీరపాంత్రం అందని ద్రాక్షలా ఊరిస్తూనేఉంది. నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్న ఆ తరుణంలో వాస్కోడిగామాకు ఎట్టకేలకు దారిచూపగల ఓ వ్యక్తి దొరికాడు. నౌకాయానం చేస్తున్న వాస్కోడిగామాను కాలికట్ (కేరళ) తీరప్రాంతానికి చేర్చిన ఆ వ్యక్తిపేరు కంజీమాలాం. అతను గుజరాతీయుడు. కచ్ ప్రాంతానికి చెందిన వర్తకుడు.ఆఫ్రికా తీరప్రాంతానికి గుజరాత్ నుంచి పత్తి, నీలి పంటలను తీసుకువెళ్ళి వస్తుమార్పిడి వర్తకం ద్వారా అక్కడినుంచి బంగారం, ఏనుగుదంతాలు భారతదేశానికి తెచ్చుకునేవాడు.

అలా వాస్కోడిగామాకు సముద్ర మార్గాన్ని చూపించిన వ్యక్తి ఓ గుజరాతీ కావడం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. గుజరాతీయుల వర్తక నైపుణ్యం, సముద్ర యానాల పట్ల వారికున్న ఆసక్తి గురించిన కథనాలు అప్పటికే బాగా ప్రచారంలో ఉన్నాయి. పర్షియన్ తీరం నుంచి నేటి మలేషియా, ఇండోనేషియా దేశాల వరకు గుజరాతీ వర్తకులు అప్పటికే వర్తక మార్గాలను ఏర్పరిచారు.

పోర్చుగీస్ దేశస్థులు భారతదేశంలో అడుగుపెట్టడానికి రెండు శతాబ్దాల క్రితమే గుజరాత్ రెండు ప్రధాన అంతర్జాతీయ వర్తక మార్గాలకు కూడలిగా ఉంది. అరబ్, ఆఫ్రికా, ఆసియా ఓడరేవులనుంచి గుజరాత్ తీరానికి వస్తువులు, దినుసులు వచ్చిపడేవి. అక్కడి నుంచి భూమార్గాన తూర్పున బీహార్, దక్షిణాన మరట్వాడా ఉత్తరాన మధుర వరకు ఈ వస్తువులు చేరేవి. గ్రీస్, అరేబియా, పర్షియా, ఆఫ్రికా, చైనా తదితర దేశాలను వర్తకులు గుజరాత్‌కి వచ్చి వ్యాపార లావాదేవీలు సాగించేవారు.

ఒకటవ భాగం

అది 2011 జనవరి రెండోవారం గాంధీనగర్ (గుజరాత్‌లోని ఒక నగరం) 100 దేశాలనుంచి వచ్చిన 10,000 మంది వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలతో కళకళలాడుతోంది. వారంతా రెండేళ్ళకోసారి జరిగే "వైబ్రెంట్ గుజరాత్" సదస్సుకు తరలివచ్చారు.



2011లో జరిగిన వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్‌కు హాజరయిన ప్రతినిధుల్లో కొందరు. 100 దేశాల నుండి 10,000 మంది వాణిజ్యవేత్తలు హాజరయిన ఈ సభలో 45000 కోట్ల డాలర్ల పెట్టుబడులకు వాగ్దానాలు లభించాయి.

గుజరాత్ రాష్ట్రానికి పెద్దఎత్తున పారిశ్రామికవేత్తల నుంచి పెట్టుబడుల హామీలు పొందడం, వీలైనన్ని ఒప్పందపత్రాల మీద సంతకాలు చేయించుకోవడం, పనిలోపనిగా వీటన్నింటి వివరాలు పూసగుచ్చినట్లు పత్రికల పతాక శీర్షికలకు ఎక్కేలా చూసుకోవడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.

ఒక జాతరలా, ఉత్సవంలా జరిగిన ఈ సదస్సు నిర్వాహకులను ఏమాత్రం నిరుత్సాహ పరచలేదని చెప్పాలి. అది ముగిసేనాటికి వ్యాపారవేత్తలు 45వేలకోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులను రాష్ట్రానికి తెస్తామని హామీ ఇచ్చారు.

ఒక్కసారే అదీ ఒకేచోట జరిగిన కార్యక్రమంలో అంత పెట్టుబడికి హామీరావడం దేశచరిత్రలోనే ప్రథమం. ప్రసారమాద్యమాలు తమవంతుగా ఇంత పెట్టుబడిని రాష్ట్రంలోకి రప్పిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కొనియాడాయి. కార్పొరేట్ దిగ్గజాలు పోటీలుపడి గుజరాత్ ముఖ్యమంత్రి మోదీని కీర్తిస్తుంటే వారికి వార్తాపత్రికలు, న్యూస్ ఛానళ్ళు వంతపాడాయి.(వాటిని ప్రజల మనస్సుల్లో ముద్రించుకుపోయేంతగా ప్రసారం చేయడంలోనూ పోటీపడ్డాయి. ఆ సంఖ్య (45వేల కోట్లు రూపాయలు) పదేపదే పత్రికల, ఛానళ్ళ కథనాల్లో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది)

సదస్సు తొలిరోజు ప్రారంభోత్సవ కార్యక్రమంలో వేదిక కిక్కిరిసిపోయింది. మూడు వరుసలలో 80మంది వేదికమీద కూర్చున్నారు. కాని అందరి కళ్ళు వేదిక మధ్యలో కూర్చున్న వ్యక్తి మీదే ఉన్నాయి. అతను ఈ ఉత్సవ నిర్వాహకుడు, ప్రధాన ఆకర్షకుడు. పేరు నరేంద్రమోదీ. దంతపురంగు సూట్ బుల్గారీ కళ్ళద్దాలు, చక్కగా కత్తిరించిన నెరిసిన గడ్డం... ఈ ఆహార్యంతో ఆసీనుడైన మోదీ అణువణువునా క్రియాశీలత నింపుకున్న వ్యక్తిలా కనిపించాడు. వేదికపైనున్న ప్రతివ్యక్తి ఉపన్యాసాన్ని అత్యంత శ్రద్ధగా ఆలకించాడు. అతనికి ఒకపక్కన కెనడా హైకమిషనర్, జపాన్ రాయబారి కూర్చుని ఉన్నారు. ఆ రెండుదేశాలు ఈ సదస్సుకు అధికారిక భాగస్వాములు. వాళ్ళపక్కన మన భారతదేశపు పారిశ్రామిక ప్రపంచపు ముఖ్య ప్రతినిధులనదగ్గ రతన్‌టాటా, ముఖేష్ అంబానీ కూర్చున్నారు రువాండా దేశ ప్రధానమంత్రి, మూడు డజన్ల కార్పొరేట్ సంస్థల సిఇఒలు, చైర్మన్లు కూడా వేదికమీద ఉన్నారు. ఇంకా భారత్ - అమెరికా వ్యాపార మండలి అధ్యక్షుడు కూడా ఉన్నాడు. ఆయనైతే రాబోయే సదస్సుకు అమెరికా కూడా భాగస్వామ్య దేశం కావాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు ప్రకటించాడు.

వైబ్రెంట్ గుజరాత్ సదస్సును ప్రపంచంలోనే ఒక అతిపెద్ద వ్యాపార కార్యక్రమంగా ప్రదర్శించగలిగారు. అలా చేసేందుకు దీనికి మోదీకి APCO worldwide అనే అమెరికా లాబీయింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ సంస్థ సేవలందించింది. ఈ ప్రాజెక్టులను అత్యంత విజయవంతంగా మార్కెట్ చేయగలిగినందుకు ఆ సంస్థ రెండు అంతర్జాతీయఅవార్డులను గెలుచుకుంది. ఇక 2003 నుంచి ఇప్పటివరకు జరిగిన ఐదు 'వైబ్రెంట్ గుజరాత్' సదస్సుల్లో మొత్తం 92వేల కోట్ల రూపాయల పెట్టుబడుల హామీలు వచ్చాయి. ఇవి మోదీకి సాధించిపెట్టిన ఫలితాలు అమూల్యమైనవి. దానిని ఇలా అంకెల్లో కొలవలేం. అయితే ఆ అంకెలు కూడా నిజానికి మనల్ని తప్పుదారి పటించేలా ఉన్నాయి.వచ్చిన హామీల్లో 60 శాతం ఆచరణలోకి వచ్చాయని అదేం తక్కువ కాదని మోదీ చెప్పుకున్నాడు. కానీ గుజరాత్ రాష్ట్ర పరిశ్రమల శాఖ దగ్గరున్న సమాచారాన్ని విశ్లేషిస్తే ఆ హామీల్లో కేవలం 25శాతం మాత్రమే అచరణలోకి వచ్చినట్లు అర్థమవుతుంది. అంకెల్లో చూస్తే అదికూడా మరీ తక్కువేమీ కాకపోవచ్చు. కానీ ఇక్కడ మనం గమనించాల్సింది ఒకటుంది. ఈ సదస్సులో బయటి ప్రపంచానికి చూపించినదానికి, వాస్తవానికి మధ్యనున్న బేధం చాలా ఎక్కువ. అయినా ఈ సదస్సులు అత్యంత విజయవంతమైనవిగా దేశ ప్రజల మనస్సుల్లో ముద్రించుకుపోయాయంటే అందుకు కారణం వాటిని నిర్వహించిన వ్యక్తి వ్యూహరచనా సామర్థ్యమే.

మోదీ పాలనలోకి రాకముందే ఎన్నో దశాబ్దాలుగా ఇంకా చెప్పాలంటే కొన్ని శతాబ్దాలుగా గుజరాత్ వ్యాపార, పారిశ్రామిక అనుకూల ప్రాంతంగా ఉంది. ప్రతీఏటా పెట్టుబడులు వస్తూనే ఉన్నాయి. ఇతర దేశాలతో వ్యాపార లావాదేవీలు జరుగుతూనే ఉన్నాయి. కానీ వాటన్నింటిని గుదిగుచ్చి ఒకేసారి వెల్లడించి తను సాధించిన ఘనతగా ప్రకటించుకుంటున్నాడు మోదీ. అందుకు సదస్సులను వేదికగా చేసుకుని వాటిని ఆడంబరమైన వేడుకలుగా ప్రజల కళ్ళ ముందుంచుతున్నాడు. ఎన్నో దశాబ్దాలుగా గుజరాత్ సమాజం సమకూర్చుకున్న వర్తక శక్తి సామర్థ్యాల్ని ప్రదర్శనకు పెట్టి తద్వారా దానిని తనను తాను ఒక కొత్త అవతారంలో ప్రజలముందుకు తెచ్చుకోవడానికి అత్యంత తెలివిగా వినియోగించుకున్నాడు. ఇలా ఒక వ్యక్తి తనను తాను పున:ప్రతిష్టించుకున్న వైనం భారత రాజకీయాల్లోనే అసాధారణమైంది.

తన పాలనలో జరిగిన గోద్రా ముస్లిం వ్యతిరేక మత దాడులలో 1200 మందికి పైగా గుజరాతీయులు హత్యకు గురైన పదేళ్ళ తర్వాత మోదీ ఆ గతాన్ని పూడ్చిపెట్టగలిగాడు. అడుగంటిపోయిన తన రాజకీయ ఎదుగుదల అవకాశాల్ని పునరుద్ధరించుకున్నాడు.

గోద్రా అనంతర హత్యలతో మూటకట్టుకున్న 'ఫాసిస్టు' 'జనహంతకుడు' 'హిందుమతోన్మాది' వంటి నిందాపూర్వక విశేషణాల్ని మరుగుపర్చి వాటి స్థానంలో తాను ఎంచుకున్న 'వికాస్ పురుష్' (అభివృద్ధి సాధకుడు) ను ప్రతిష్ఠించుకోగలిగాడు. ఇక భారతదేశపు అగ్ర పారిశ్రామిక సంస్థల అధినేతలకైతే అతనిప్పుడు 'దేశాన్ని నడిపించబోయే నాయకుడు' 'దార్శనికుడు" 'ఈ దేశానికి నేతృత్వం వహించగల సిఇఒ' ఎదురేలేని రేసుగుర్రం. ఇవి మోదీ పై రతన్‌టాటా, అంబానీ, మిట్టల్ లాంటివాళ్ళు ఉప్పొంగుతున్న అభిమానంతో కురిపించిన ప్రశంసల జల్లుల్లో మచ్చుకు కొన్ని.

అయితే మన అగ్ర పారిశ్రామికవేత్తలతో మోదీ స్నేహబంధం తొలినుంచి ఇలానే ఉందనుకుంటే పొరపాటే. 2003 ఫిబ్రవరిలో మోదీ ప్రత్యేక అభ్యర్థనపై కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండయన్ ఇండస్ట్రీ (సిఐఐ) ప్రత్యేక సమావేశాల్ని ఏర్పాటు చేసింది. అప్పటికి గోద్రా మతదాడుల నేపథ్యంలో జరిగిన గుజరాత్ ఎన్నికల్లో మోదీ ఘనవిజయం సాధించి ఉన్నాడు. కానీ హింస కారణంగా కుంటుపడిన ఆర్థిక వ్యవస్థ అతనికి ఒక సవాలుగా నిలిచింది. జాతీయ పారిశ్రామికవేత్తల, వ్యాపారవేత్తల నుంచి బహిరంగ వ్యతిరేకత ఎదుర్కొంటున్నాడు.

గుజరాత్ వీధుల్లో వీరంగం వేసిన అల్లరిమూకలు కేవలం ముస్లింలపై దాడులు, హత్యలకే పరిమితం కాలేదు. వెయ్యికి పైగా ట్రక్కులకు నిప్పంటించాయి. జనరల్ మోటర్స్ ఫ్యాక్టరీలో తయారై వచ్చిన ఒపెల్ ఎస్ట్రా కార్లను కాల్చేశారు. ఇది అంతర్జాతీయ పత్రికల్లో కూడా పతాకశీర్షికలకు ఎక్కింది. ఒక అంచనా ప్రకారం గుజరాత్‌లో మతదాడులు, హత్యకాండల వల్ల పారిశ్రామికరంగం 20వేల కోట్ల రూపాయల్ని నష్టపోయింది. ఈ స్థాయి మతపరమైన హింస జరగడం అంతర్జాతీయ పెట్టుబడిదారుల్ని బెంబేలెత్తించింది. సెప్టెంబర్ 2002నాటికి కొత్తగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడం పూర్తిగా ఆగిపోయింది.

ముందే చెప్పుకున్నట్లు మన భారతదేశపు పెట్టుబడిదారులకు గుజరాత్ మోదీ అధికారంలోకి రావడానికి ఎంతోముందు కాలంనుంచే తమ వ్యాపార కార్యకలాపాలు, లావాదేవీలు సాగిస్తున్న అతిముఖ్యమైన రాష్ట్రంగా ఉన్నది. అలాంటి చోట ఇకపై ఎలాంటి అనిశ్చితి గందరగోళం నెలకొంటాయోనని వారు బహిరంగంగానే తమ భయాందోళనలు వ్యక్తం చేశారు. ఒక లౌకిక దేశంగా భారతదేశానికి ఉన్న ప్రతిష్ట దిగజారిపోయిందని, గుజరాత్‌లో జరిగిన మారణకాండకు తాను సిగ్గుపడుతున్నానని హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ సిఇఒ దీపక్ ఫరాక్ అన్నారు. ఎ.ఎఫ్.ఎల్. అనే ఒక ఎగుమతుల కంపెనీకి సిఎం.డిగా

ఉన్న సైరస్ గుజార్ గుజరాత్ హత్యలను ముస్లింలకు ఉనికేలేకుండా చేయడానికి జరిగిన జాతిహననంగా అభివర్ణించారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, విప్రోప్రేమ్‌జీలు గుజరాత్ హత్యాకాండను తీవ్రంగా నిరసిస్తూ బహిరంగ పత్రికా ప్రకటనలు చేశారు.

2002 ఏప్రిల్ నెలలో సిఐఐ జాతీయ సమావేశం జరిగింది. అందులో థర్మాక్స్ సంస్థ చైర్‌పర్సన్ అనూ ఆగా చేసిన ప్రసంగం అందరి హృదయాలను తాకింది. గుజరాత్‌లో ముస్లింలు అనుభవిస్తున్న కష్టాలు, పడుతున్న ఇబ్బందులు, వాళ్ళకు జరిగిన అన్యాయం గురించి ఆమె నిష్పాక్షికంగా వివరిస్తున్నప్పుడు అందరూ లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

తన చర్యలపట్ల సర్వత్రా తీవ్ర వ్యతిరేకత ఉందని, తనపై ఒత్తిడి ఉందని మోదీకి తెలుసు. కానీ తనను సొంత రాష్ట్రంలో ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించారనీ తెలుసు. అంతేకాదు మత దాడులతో నిమిత్తం లేకుండా దేశంలోని బడా వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలకు తన రాష్ట్రం ఎంతో ముఖ్యమైందన్న విషయం అతనికి ఎరుకే. అందుకే పారిశ్రామికవేత్తలను మంచి చేసుకుని, వారికి తనపై సద్భావం కలిగేలా చూసుకునేందుకు ఢిల్లీ వచ్చాడు. కానీ అతనేంచేసినా అది తనకు నచ్చిన పద్ధతుల్లోనే తన షరతులకు లోబడే జరగాలనుకుంటాడు. అలా జరిగేలా పాచికలు కదుపుతాడు. మోదీ ప్రత్యేక అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సిఐఐ, మోదీతోపాటు వేదికమీద రెండు ప్రముఖ వ్యాపార కుటుంబాల అధినేతలు రాహుల్ బజాజ్, జెమ్‌షెడ్ గోద్రెజ్, సిఐఐ డైరెక్టర్ జనరల్ తరుణదాస్ ఉన్నారు. మోదీ బజాజ్, గోద్రెజ్‌ల నుండి సాదర స్వాగతాన్ని ఆశించినట్లున్నాడు. కానీ అందుకు విరుద్ధంగా ప్రారంభమైంది ఆ సమావేశం. మోదీ విజయోత్సవ సభలో జరిగిన ఒక సంఘటనను ప్రస్తావిస్తూ తన ఉపన్యాసాన్ని జెమ్‌షెడ్ గోద్రెజ్ ప్రారంభించాడు. ముంబాయిలో జరిగిన ఆ సభలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఒకరు మోదీని హేళన చేశారు. అది గుర్తు చేస్తూ ప్రజలు ఇచ్చిన తీర్పును గుజరాతీయులందరికీ రక్షణ, భద్రత కల్పించడానికి వినియోగించమని మోదీకి గోద్రెజ్ పిలుపునిచ్చారు.

బజాజ్ అయితే కుండబద్దలు గొట్టినట్లే మాట్లాడారు. గుజరాత్‌కు 2002 పూర్తిగా నష్టదాయకమైన సంవత్సరమని ప్రకటించాడు. మోదీ వైపుకు చూస్తూ 'కాశ్మీర్‌లో కానీ, ఈశాన్య రాష్ట్రాలలో కానీ బీహార్‌లో కానీ ఎవరూ ఎందుకు పెట్టుబడులు పెట్టడంలేదు?' అని ప్రశ్నించారు. ఆ తర్వాత 'మౌలిక సదుపాయాల కొరత వల్ల మాత్రమే అనుకుంటే పొరపాటు. అక్కడ ఉన్న అభద్రతవల్ల కూడా వెనకడుగు వేస్తున్నారు. గుజరాత్‌కు అలాంటి

స్థితి భవిష్యత్‌లో ఉండదని ఆశిస్తున్నాను. గత సంవత్సరం జరిగిన దురదృష్టకరమైన సంఘటనల నేపథ్యంలో నాకీ ఆలోచనలు వస్తున్నాయి' అని వివరించారు మరోసారి మోదీ వైపుకు తిరగి 'మీరే విలువలను నమ్ముతున్నారో దేనికోసం నిలబడతారో తెలుసుకోవాలనుకుంటున్నాం. మీ పార్టీలో మీరొక తిరుగులేని పెద్ద నాయకుడు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్నారు. అందుకే మీ గురించి మాకింకా మెరుగైన అవగాహన కావాలి. మేము అన్ని రకాల (భావజాలపరంగా) ప్రభుత్వాలతోను కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ సమాజానికి ఏది మంచి చేస్తుంది? పాలన ఎలా ఉంటే సాఫీగా సాగుతుంది అన్న దాని మీద మాకుంటూ సొంత అభిప్రాయాలున్నాయి' అంటూ స్పష్టంగా తన అభిప్రాయాలను తెలిపారు.

ఇలా ప్రశ్నలు, సందేహాలు, అభిప్రాయాల రూపంలో తనపై పారిశ్రామిక వేత్తలు విమర్శనాస్త్రాలను సంధిస్తున్నంత సేపు మోదీ వేదిక మీదే కూర్చుని అత్యంత సహనంగా విన్నాడు. పైకి మౌనంగా ఉన్నా లోలోపల క్రోధంతో రగిలిపోయాడు. తన వంతు వచ్చినపుడు "మీరు, మీ కుహనా లౌకికవాద స్నేహితులు గుజరాత్‌కి వచ్చి చూసుకోవచ్చు. మా ప్రజలతో మాట్లాడండి. గుజరాత్ దేశంలోకెల్లా అత్యంత ప్రశాంతంగా ఉండే రాష్ట్రం" అని ఆగ్రహంగా బదులిచ్చాడు. ఒక్కసారిగా ఆ గదిలో ఉద్రిక్తత నెలకొంది. మోదీ తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు. గోద్రెజ్, బజాజ్‌ల వైపుకి తిరిగి "గుజరాత్‌ని అపఖ్యాతి పాల్జేయడం వెనక ఇతరులకు కొన్ని కుటిల ప్రయోజనాలున్నాయి. మీకేం ఉన్నాయి"అని ప్రశ్నించాడు.

తనతోపాటు మోదీ ఆ క్రోధాన్ని ఢిల్లీ నుంచి గుజరాత్‌కు మోసుకువెళ్ళాడు. సిఐఐకి ఎవరిది పై చేయో తెలపాలనుకున్నాడు. వెంటనే కార్యాచరణకు దిగాడు. కొద్ది రోజుల్లోనే మోదీకి సన్నిహితులైన గుజరాతీ వ్యాపారవేత్తలు గౌతమ్ అదానీ, (ఆదానీ గ్రూప్) ఇంద్రవదన్ మోదీ (కాడిలా ఫార్మస్యూటికల్స్) కార్సన్ పటేల్(నిర్మా గ్రూప్), అనిల్ బకారీ(బకారీ ఇంజనీర్) తదితరులు స్థానిక వ్యాపారస్థులందర్నీ కూడగట్టి రిసర్జెంట్ గ్రూప్ ఆఫ్ గుజరాత్(ఆర్‌జిజి) పేరుతో వేరే సంస్థను ఏర్పాటు చేశారు. మోదీని, గుజరాతీయులందరినీ అవమానించినందుకు నిరసనగా తన సంస్థ సభ్యులందరూ సిఐఐ సభ్యత్వాన్ని ఉపసంహరించుకుంటామని బెదిరించారు. గుజరాత్ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో విఫలమైనందుకు సిఐఐ రాష్ట్ర విభాగం రాజీనామా చేయాలని ఒక పత్రికా ప్రకటనలో ఆర్‌జిజి డిమాండ్ చేసింది.

వ్యాపార ప్రయోజనాలపరంగా తమకి అత్యంత ప్రధానమైన రాష్ట్రం నుంచి ఈ తిరుగుబాటు రావటం సిఐఐ డైరెక్టర్ జనరల్ తరుణ్‌దాస్‌ని అత్యంత కలవరపర్చింది. వందకు పైగా కంపెనీలు సిఐఐని వదిలి ఆర్‌జిజితోనే ఉంటామని బెదిరించాయి.

అదే జరిగితే పశ్చిమ భారతంలో సిఐఐ ఉనికే లేకుండా పోవచ్చు. మరోపక్క ఢిల్లీలోనూ మోదీ పావులు కదిపాడు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా సహాయ నిరాకరణ మొదలుపెట్టింది. సిఐఐ ప్రతినిధులు తమ మంత్రుల్ని కలిసే అవకాశాల్ని పరిమితం చేసేసింది. లాబీయింగ్, తమ ప్రయోజనాల్ని నెరవేర్చుకోవడం కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం సిఐఐ ప్రధాన లక్ష్యం. దాన్నీ సాధించలేని పరిస్థితి ఏర్పడిందన్న మాట.

సర్దుబాటు చేసుకోవటం కోసం తరుణ్‌దాస్ కేంద్రంలో న్యాయ శాఖామంత్రి, మోదీ సన్నిహిత మిత్రుడు అయిన అరుణ్‌జైట్లీని కలిశాడు. జైట్లీ ఇంట్లో ఇద్దరి మధ్య దాదాపు రెండు గంటలపాటు సంభాషణ జరిగింది. జైట్లీ రకరకాల ప్రశ్నలడుగుతూ ఇలా వ్యవహరించడంలో మీ సిఐఐ ఉద్దేశ్యమేమిటో వివరించమని దాస్‌ని నిలదీశాడు. ఆ తర్వాత కొద్ది రోజుల్లో మోదీ తన ఇంటికి భోజనానికి రానున్నాడని, అప్పుడు తను ఈ విషయాన్ని అతనితో చర్చిస్తానని జైట్లీ హామీ ఇచ్చాడు.

కొద్ది రోజులయ్యాక జైట్లీ మీ సమస్య పరిష్కారమైపోతుందని దాస్‌కి చెప్పారు. అయితే మోదీ లిఖితపూర్వకమైన క్షమాపణ అడిగాడు. కొంత సంకోచంగానే అయినప్పటికీ అందుకు సిద్ధపడ్డారు తరుణ్‌దాస్.

పదవీ విరమణ చేసిన తర్వాత బిజినెస్ టుడేకి ఇచ్చిన ఒక సుదీర్ఘ ఇంటర్వ్యూలో తరుణ్‌దాస్ అప్పటి సంఘటనల గురించి ఇలా వివరించారు. "ఆ సాయంత్రం నేను మోదీని కలవడానికి బయలుదేరుతున్నాను. (క్షమాపణ లేఖ అందజేయడానికి) నా భార్యకు అది ఇష్టంలేదు. 'నువ్వలా చేయకూడదు' అని స్పష్టంగా చెప్పింది.

అనూ అగా, అజీంప్రేమ్‌జీ, జెమ్‌షెడ్ గోద్రెజ్ మాకు అత్యంత సన్నిహితులు. వారే కాదు, ఇంకా అనేకమంది పార్శీ, ముస్లిం స్నేహితులున్నారు. కాని నా ముందు రెండే మార్గాలున్నాయి. ఒకటి సిఐఐ నుంచి తప్పుకోవడం, ఆ పని నేను చెయ్యలేను. ఇక నా సభ్యుల బాగోగులు చూసుకోవడం కోసం నాకు ఇది తప్పదని నా భార్యకు చెప్పాను."

దాస్ తాను ఇచ్చింది వివరణే కానీ క్షమాపణ కాదని, కానీ మీడియా దానిని క్షమాపణలానే చూపిస్తుందని చెప్పుకున్నారు. కానీ మోడీకి ఆయన అందజేసిన లేఖ చూస్తే అదేమిటో అందరికీ అర్థమవుతుంది. 'జరిగిన సంఘటనలవల్ల మీకు వేదన కలిగినందుకు, మీ మనసు గాయపడినందుకు సిఐఐ సభ్యులుగా మేము చాలా విచారిస్తున్నాం. ఢిల్లీలో ఫిబ్రవరి ఆరున మనం కలిసినప్పటి నుంచీ ఏర్పడిన అపార్థాలకు నేను పశ్చాత్తాపపడుతున్నాను' అని ఆ లేఖలో ఉంది. మూడు నెలల తర్వాత మోదీతో మరింత సర్దుబాటు చేసుకోవడానికి సిఐఐ మరొక అడుగు ముందుకేసింది. వరల్డ్ ఎకనిమిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో జ్యూరిచ్‌లో జరుగుతున్న సమావేశాల్లో అంతర్జాతీయ పెట్టుబడిదారులను మోదీ కలవడానికి సిఐఐ సాయపడింది.

కొన్నేళ్ళలోనే ఒకరి తర్వాత ఒకరుగా మొత్తం వ్యాపారస్థులందరినీ మోదీ తనవైపు తిప్పుకున్నాడు. ఒక మాజీ సీనియర్ సిఐఐ అధికారి నాతో ఇలా అన్నారు. "మొదటగా వ్యాపార వర్గాల్లో మత దాడులకు వ్యతిరేకంగా అను అగా, బజాజ్, గోద్రెజ్ తదితరులు మాట్లాడారు. వారిలో అత్యధికులు పార్శీలే కావడాన్ని ప్రజలు గమనించారు. మైనారిటీలుగా వారిలో ఏర్పడిన అభద్రత వల్లే వాళ్ళలా స్పందించారని ప్రజలనుకున్నారు. మోదీపట్ల వారు చూపిన వ్యతిరేకతకు మూలకారణం అదే అయి ఉంటుందని ప్రజలు భావించారు. మోదీ ఇది గ్రహించాడు. ఒక 'వైబ్రెంట్ గుజరాత్' సదస్సులో వాజ్‌పేయి చేతిమీదుగా అవార్డు అందుకోవడానికి రతన్‌టాటాను రప్పించారు. అదే మోదీ చాతుర్యం. అసాధారణమైన తెలివితేటలున్న మోదీ అతినెమ్మదిగా పావులు కదుపుతుంటాడు"

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి తరపు ప్రధానమంత్రి అభ్యర్థి మోదీనే. పార్టీలోని వైరి వర్గాన్ని పక్కకు నెట్టి తనను తాను జాతీయ రాజకీయాలలో ముందుకు తెచ్చుకునేందుకు ఢిల్లీకి మకాం మార్చవచ్చని, అవసరమైతే పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని కూడా పొందే ప్రయత్నం చేస్తారని పార్టీ ఆంతరింగికులు కొందరు చెబుతున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా జనవరి (2012)లో చేసిన సర్వేలో 24% మంది మోదీని ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నారని చెప్పారు.

రెండో భాగం

నరేంద్రమోదీ కథ అంటే ఒకరకంగా అది అతన్ని పెంచి పోషించిన, అతనికి తర్ఫీదునిచ్చిన సంస్థల కథ కూడా. గత ఐదు దశాబ్దాలుగా భారతదేశ రాజకీయాల్లో అవి ఎదిగిన వైనాన్ని కూడా ఆ కథ అద్దంపడుతుంది. వాటితోపాటుగా ఆ సంస్థ శ్రేణుల్లో నరేంద్రమోదీ ఎలా పైకెగబాకారో వివరిస్తుంది



2001 లో గుజరాత్ ముఖ్యమంత్రిగా నియమితులయిన తర్వాత బిజెపి మాజీ అధ్యక్షులు, తన గురువు అయిన కుష్‌భావ్ థాకరేకు పాదాభివందనం చేస్తున్న మోదీ.

మోదీకి ఓ ప్రాపంచిక దృక్పథాన్నిచ్చి అతన్ని తీర్చి దిద్దడంలో రాష్ట్రీయస్వయం సేవక్‌సంఘ్‌దే (ఆర్ఎస్ఎస్) ప్రధానపాత్ర అతనికి రాజకీయంగా ఎదగాలన్న లాలసను కలిగించింది కూడా అ సంస్థేనని చెప్పవచ్చు. ఆర్ఎస్ఎస్ ఆ తర్వాతి దశాబ్దాలలో హింసతో కూడిన మిలిటెంట్ హిందూత్వమే ప్రధానవైఖరిగా ముందుకు సాగింది. గాంధీ ప్రతిపాదించిన అహింసాత్మకమైన, పరమత సహనంతో కూడిన హిందూత్వను అది వ్యతిరేకించింది. జాతీయోద్యమకాలంలోనే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లౌకిక జాతీయ వాదాన్ని తన విధానంగా చేసుకుంది. అందుకు పూర్తి భిన్నంగా ఆర్ఎస్ఎస్ ఈ దేశాన్ని 'హిందురాష్ట్ర'గా నిర్వచించాలని, చేయాలని కోరుకునే మత జాతీయవాదాన్ని ప్రచారం చేసింది. దాన్ని వ్యాప్తి చెయ్యడమే లక్ష్యంగా సాగింది. మనకి స్వాతంత్ర్యం వచ్చి దేశ విభజన జరిగేనాటికి 'హిందురాష్ట్ర భావనలు' ఒంటబట్టించుకున్న వారిలో గాంధీపై ద్వేషం తీవ్రస్థాయికి చేరుకుంది. చివరకు అది ఆయన హత్యకు దారితీసింది.

అంతకుముందు ఆర్ఎస్ఎస్‌లో పనిచేసిన నాథూరం గాడ్సే 1948లో గాంధీని కాల్చి చంపాడు. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్ఎస్ఎస్‌ను నిషేధించారు. ఇరవైవేలమందికి పైగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను నిర్బంధించారు. ఒక్క సంవత్సరంలో ఆర్ఎస్ఎస్‌పై నిషేధం తొలగిపోయినా ఆ తర్వాత కొన్ని దశాబ్దాలపాటు అది అజ్ఞాతంగా పనిచేసే సంస్థకు ఉండే స్ఫూర్తితోనే పనిచేసింది. గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్‌కి సారథ్యం వహించిన వ్యక్తి లక్ష్మణరావ్ ఇమాందార్. ఆర్ఎస్ఎస్‌లో అందరూ వకీల్‌సాబ్ అని పిలుస్తారు. చడీ చప్పుడు లేకుండా ఊరూరా శాఖలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో కార్యకర్తల సైన్యాన్ని సమకూర్చాడు. ఆ శాఖల్లో ఒకటైన వాద్‌నగర్ పట్టణ శాఖలో ఒక ఎనిమిదేళ్ళ బాలుడు స్వచ్ఛంద సేవకుడిగా చేరాడు. అతనే నరేంద్రమోదీ.

వాద్‌నగర్ శాఖను 1944లో బాబూబాయ్ నాయక్ అనే మహారాష్ట్రీయుడు ఏర్పాటు చేశాడు. మహారాష్ట్ర నుంచి బాబూబాయ్ నాయక్ లాంటి అనేకమంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దేశ వ్యాప్తంగా పలుప్రాంతాలకు వెళ్ళి అక్కడి విద్యా సంస్థలలో చేరేవారు. ఆ సంస్థలలో చదువుకునే వారిని, ఇంకా ఆ ఊళ్ళల్లో ఉండే యువకులను, బాలురను ఆర్ఎస్ఎస్‌లోకి ఆకర్షించి శాఖలు ఏర్పాటు చేశారు. గాంధీ మరణం తర్వాత బాబూబాయ్ నాయక్ ఈ పనిని తగ్గించి ఉద్యోగం మీద శ్రద్ధ పెట్టాడు. అప్పుడప్పుడు వకీల్‌సాబ్‌ని పిలిచి కొత్తగా శాఖలలో చేర్చుకున్న వారికి ఆయనతో ప్రసంగాలు ఇప్పించేవాడు. అలాంటి

ఒక సందర్భంలో కచ్చితంగా చెప్పాలంటే 1958 దీపావళినాడు వకీల్‌సాబ్ సమక్షంలో 'బాల్ స్వయం సేవక్'గా ప్రమాణం చేశాడు నరేంద్రమోడీ.

'నరేంద్ర మాలా ఇంటిపని, బడికెళ్లడంతో సరిపెట్టుకోకుండా ఇంకా ఏదైనా ప్రత్యేకంగా చేయాలని కోరుకునేవాడు. ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ఆ కోరికను నెరవేర్చుకునే అవకాశం కల్పించింది' అని నరేంద్రమోడీ పెద్దన్న సోంబాయి మోడీ నాతో చెప్పాడు.

దామోదర్‌దాస్ మూల్‌చంద్‌మోదీ, హీరాబెన్ దంపతుల అరుగురి సంతానంలో మూడవవాడు నరేంద్రమోదీ. కుల దొంతరలో కింది స్థానంలోఉన్న ఘాంచీ కులానికి చెందిన ఈ కుటుంబం వాద్ నగర్‌లోని ఇక చిన్న వాడలో ఇరుకు వీధిలో కాపురముండేది. గాంచీ కులస్తులది సంప్రదాయకంగా వంట నూనె గానుగాడి అమ్మే వృత్తి. హీరాబాయి, పిల్లలు గానుగపని చూసుకుంటే మోదీ తండ్రి కుటుంబ పోషణ కోసం అదనంగా రైల్వే స్టేషన్‌లో టీ కొట్టు నడిపేవాడు. నరేంద్ర ఉదయం రైల్వే స్టేషన్‌లో వాళ్ళ నాన్నకు సాయం చేసి బడి గంట మోగగానే రైల్వే పట్టాలుదాటి తరగతిగదికి చేరుకునేవాడు అని అతనితో చిన్నప్పుడు కలిసి చదువుకుని, ఇప్పుడు వాద్ నగర్‌లో ఆయుర్వేద డాక్టర్‌గా పనిచేస్తున్న సుధీర్‌జోషి గుర్తుచేసుకున్నారు.

మోదీ భాగవతాచార్య నారాయణాచార్య హైస్కూల్‌లో చదువుకున్నాడు. అక్కడ అప్పుడు సంస్కృత టీచర్‌గా పనిచేసిన ప్రహ్లాద్ పటేల్ మోదీ చదువులో సగటు స్థాయిలోనే ఉండేవాడని చెప్పారు. నాటకాలు వేయడమన్నా, వక్తృత్వ పోటీల్లో పాల్గొనడమన్నా మోదీకి ఇష్టమట. స్కూల్‌లో ఏర్పాటుచేసిన డిబేట్‌క్లబ్ కార్యకలాపాల్లో క్రమం తప్పకుండా పాలుపంచుకునేవాడట.

'బడి వదలగానే పుస్తకాలు ఇంట్లో పడేసి, శాఖకు పరుగెత్తేవాళ్ళం. రోజూ మాకిదేపని' అని సుధీర్ నాతో చెప్పారు.

అమ్మకి నాన్నకి సాయం చెయ్యడం, బడికి వెళ్ళడం, శాఖ కార్యకలాపాలు ఈ మూడింటిలోనూ నరేంద్ర చివరి పనినే అత్యంత ప్రధానమైనదిగా భావించేవాడు.

"నరేంద్ర ఉప్పు, నూనె తినడం మానేశాడు. అన్ని వదిలేసి సన్యాసిలా మారేందుకు తనను తాను సిద్ధం చేసుకుంటున్నాడేమోననిపించింది"అని మోదీ పెద్దన్న నాతో చెప్పాడు.


రోజువారీ పనులకంటే ప్రత్యేకంగా ఏదో చేయాలన్న అన్వేషణలో ఉన్న ఒక యువకుడికి ఆర్ఎస్ఎస్ శాఖ ఒక లక్ష్యాన్ని, దిశను ఇచ్చింది. కానీ మోదీ ఒక స్వామీజి(మత బోధకుడి)లా జీవించాలా లేదా హిందుత్వను వ్యాప్తి చెయ్యడం కోసం పనిచెయ్యాలా అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడాడు. అతని ఆలోచనలు ఇలా ఉండగా మరోపక్క వాద్ నగర్‌లోని ఘాంచీ కుల ఆచారాల ప్రకారం నరేంద్రమోదీ తల్లిదండ్రులు అతనికి పెళ్ళి ఏర్పాట్లు చేశారు. ఆ కుల ఆచారం ప్రకారం మూడు, నాలుగేళ్ళ వయసులోనే పెళ్ళికి నిశ్చితార్థం చేస్తారు. బాలుడికి 13ఏళ్ళ వయసు వచ్చాక పెళ్ళి చేస్తారు. పద్దెనిమిది లేదా ఇరవై ఏళ్ళ వయసులో కోడల్ని కాపురానికి తీసుకొస్తారు. వాద్‌నగర్‌కి పక్కనే ఉన్న బ్రాహమన్ పట్టణానికి చెందిన జశోదాబెన్ చిమన్‌లాల్ అనే బాలికతో మోదీకి వివాహం నిశ్చయమైంది. అతనికి 13 ఏళ్ళు వచ్చాక పెళ్ళి కూడా చేశారని మోదీ పెద్దన్న నాతో చెప్పారు. కానీ పద్దెనిమిదేళ్ళు వచ్చేటప్పటికి మోదీ మనసక్కడ లేదు. ఏదో అన్వేషిస్తూ హిమాలయాలకు పయనమయ్యాడు.

భార్యను, ఇరువురి కుటుంబాలను ఒక రకమైన అనిశ్చితిలోకి నెట్టేశాడు. అతనెక్కడున్నాడో, ఎప్పుడొస్తాడో, అసలు తిరిగొస్తాడో రాడో అతని కుటుంబసభ్యులకు కూడా తెలీదు. “అమ్మ, మేమందరం తన కోసం చాలా ఆందోళన చెందాం. రెండేళ్ళ తర్వాత ఒక రోజు హఠాత్తుగా తిరిగొచ్చి ఇక సన్యాసాన్ని విడిచేశానని, అహ్మదాబాద్ వెళ్ళి మా మామ క్యాంటీన్‌లో పనిచేస్తానని చెప్పాడు” అని సోంబాయ్ ఆనాటి సంఘటనలను గుర్తు చేసుకుని వివరించారు. “వాళ్ళమ్మ ఈసారి నరేంద్రను ఒంటరిగా పంపదలచుకోలేదు. అందుకే జశోదా తల్లిదండ్రులకు ఆమెను కాపురానికి పంపమని కబురు పంపారు. ఒకరోజు జశోద మోదీ ఇంటికి కాపురానికి వచ్చింది. అది ఇష్టంలేని మోదీ తల్లిదండ్రులతో పోట్లాడి మరోసారి ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు” వాద్‌నగర్‌లో మోదీ కుటుంబానికి పొరుగున ఉండే ఒక వ్యక్తి అందించిన వివరాలివి.

అహ్మదాబాద్‌లో తన మామకు సిటీ బస్‌స్టాండులో ఉన్న టీ కొట్టు నిర్వహణలో సాయపడేవాడు. ఆ తర్వాత గీతామందిర్ దగ్గర స్వంతంగా టీ బండిపెట్టాడు. ఆ దశలోనే మోదీ మళ్ళీ ఆర్ఎస్ఎస్‌లోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నాడు. “కొంతమంది ప్రచారక్‌లు (ఆర్ఎస్ఎస్‌లో పూర్తి కాలం పనిచేస్తూ హిందూత్వ భావజాలాన్ని వ్యాప్తి చేసేవారు) రోజూ ఉదయం శాఖకు హాజరైన తర్వాత అతని బండి దగ్గర చాయ్ తాగేవారు.

వారిని మోదీ బాగా ఆకట్టుకున్నాడు. అందుకు అతని వాద్‌నగర్ ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం తోడ్పడింది. త్వరలోనే మోదీ టీ బండి ఎత్తేసి తన మకాంను ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కార్యలయానికి మార్చాడు. అక్కడ సహాయకుడుగా విధులు నిర్వహించాడు" అని ఒక సీనియర్ ప్రచారక్ నాతో చెప్పారు. ఈ కథనం కోసం నేను కలిసిన అనేక మందిలానే ఆయన కూడా తన పేరును రాయనన్న షరతుతోనే ఈ సమాచారాన్ని అందించారు. ముఖ్యమంత్రి ఆగ్రహాన్ని చవిచూడాల్సివస్తుందన్న ఆందోళన అందుకు కారణం.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో తన తొలి దినాల గురించి మోదీ అతని జీవితచరిత్ర రాసిన ఎమ్‌విఎస్ కామత్‌కు కొన్ని వివరాలందించారు. "హెగ్డేవార్ భవన్ (రాష్ట్ర కార్యాలయంలో) లో కలిసి ఉండేవాళ్ళం. సంఘ్ కార్యాలయంలో పనిచేస్తున్న నేను అదే నా కార్యక్షేత్రం అని నిర్ణయించేసుకున్నాను. ఉదయాన్నే ప్రచారక్‌లకు టిఫిన్, టీ తయారు చేయడంతో నా పని మొదలయ్యేది. ఆ తరువాత ఎనిమిది తొమ్మిది గదులుండే ఆ భవనం మొత్తాన్ని ఊడ్చి, తడిబట్టతో తుడిచి శుభ్రం చేసేవాడిని. వకీల్ సాబ్‌వి, నావి బట్టలు తికేవాడిని. ఒక సంవత్సరం పాటు నా దినచర్య ఇలాగే గడిచింది. ఆ కాలంలోనే అనేకమందిని కలిశాను" అని మోదీ చెప్పుకున్నాడు.



1980 చివర్లో గుజరాత్‌లో బిజెపి సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి పదవి నిర్వహిస్తున్న నరేంద్రమోదీ

మోదీ హెగ్డేవార్ భవన్‌లో ఉన్న ఆ కాలం ఆర్‌ఎస్‌ఎస్‌కు రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగానూ చాలా కీలకమైన దశ. అది మత మౌఢ్యంతోకూడిన అజ్ఞాత

సంస్థగా తనకున్న ఇమేజ్‌ను వదుల్చుకుని చట్టబద్ధమైన, బలమైన రాజకీయ శక్తిగా ముందుకొచ్చిన తరుణం అది.

అహ్మదాబాద్‌కు చెందిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త త్రిదిప్ సుహృద్ గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్‌కి బహిరంగ కార్యకలాపాలు చేస్తూ విస్తరించడానికి నాలుగు అంశాలు దోహదపడ్డాయంటారు. ఆయన విశ్లేషణ ప్రకారం.... "మొదటిది నవ నిర్మాణ్ ఉద్యమం. అది1974లో మొదలయ్యింది. హాస్టళ్ళలో మెస్ బిల్లులు పెంచినందుకు నిరసనగా ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యమించారు. త్వరలోనే అది అవినీతి వ్యతిరేక ఉద్యమంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ప్రభుత్వ అణచివేత వైఖరిని, అవినీతిని నిరసిస్తూ తీవ్రమైన ఆందోళనలు చేశారు.

రెండవది అత్యవసర స్థితి. దేశంలో ఇందిరాగాంధీ విధించిన అత్యవసర స్థితికి వ్యతిరేకంగా పోరాడడానికి సోషలిస్టులు, గాంధేయులతో కలిసి ఏర్పడిన ఒక మహా కూటమిలో ఆర్ఎస్ఎస్ కూడా కీలకపాత్ర పోషించింది.



1974లో గుజరాత్‌లో విద్యార్థుల నవ నిర్మాణ్ ఉద్యమం. ఆర్ఎస్ఎస్ బహిరంగంగా పని చేసేందుకు ఇది దోహదపడింది.

మూడవది ఆర్ఎస్ఎస్ చేపట్టిన దాతృత్వ, సేవా కార్యక్రమాలు. గుజరాత్ రాష్ట్రంలో 1971లో భయంకరమైన కరువు నెలకొంది. మరో ఎనిమిదేళ్ళకు 1979లో మచు నది మీద వంతెన కూలిపోయి వేలాదిమంది మరణించారు. ఈ రెండు సందర్భాలలో ఆర్ఎస్ఎస్ తన వలంటీర్లను రంగంలోకి దించి ప్రజలకు తోడ్పాటునందించింది.

ఇక చివరిది, నాలుగవది. మాజీ సంస్థానాధిపతుల కుటుంబాలలో ఇందిరా గాంధీ పట్ల ఏర్పడిన వ్యతిరేకత. సంస్థానాధిపతులుగా అప్పటి వరకూ వారనుభవిస్తున్న ప్రత్యేక హోదాను, బిరుదులను ఇందిరాగాంధీ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. రాజభరణాలను రద్దు చేసింది. దీనితో కడుపుమండిన మాజీ సంస్థానాధిపతులు కాంగ్రెస్‌ను ఎదిరించగల బలమైన రాజకీయ శక్తి కోసం ఎదురు చూస్తున్నారు. వీటన్నింటివల్ల గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్ బలంగా వేళ్ళూనుకునిపోయింది.

గుజరాత్ ఆర్ఎస్ఎస్‌లో మోదీకి కొద్ది కాలానికే పెద్ద బాధ్యతలు అప్పగించారు. సంఘ్ నాయకులకు రిజర్వేషన్లు, ఇతర ప్రయాణ ఏర్పాట్లు చూసేవాడు. హెగ్డేవార్ భవన్‌కి వచ్చే ఉత్తరాలను తెరిచి సమాచారాన్ని సేకరించేవాడు. ఆ కాలంలోనే మోదీ ఆర్ఎస్ఎస్ నాగ్‌పూర్‌లో ఉండే జాతీయ ప్రధాన కార్యాలయంలో శిక్షణపొంది వచ్చారు. సంఘ్‌లో ఏదైనా అధికారిక బాధ్యత తీసుకోవడానికి ముందు ఆ శిక్షణ తప్పనిసరిగా పొందాలి. “ఆర్ఎస్ఎస్‌లో ఆ శిక్షణ పొందడం మొదటి మెట్టులాంటిది. కనీసం అది ఉంటే కానీ ముఖ్యమైన బాధ్యతలప్పగించరు. మోదీకి ఈ శిక్షణపొందేనాటికి 22 లేదా 23ఏళ్ళుంటాయి’ అని ఒక సీనియర్ ప్రచారక్ చెప్పారు.

ఆ తరువాత మోదీని ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి)కి సంఘ్ ప్రచారక్-ఇన్‌చార్జిగా నియమించారు. దేశంలో అత్యవసరస్థితి ఉన్నప్పుడు మోదీ ఆ బాధ్యతల్లోనే ఉన్నారు. ఎబివిపి లాంటి బహిరంగంగా పనిచేసే సంస్థకు సంఘ్ ప్రచారక్ ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తి అజ్ఞాతంగా సహకరించే మార్గదర్శిలా ఉండాలి. ప్రజల కంటపడకుండా తన అధికారాన్ని ఉపయోగించి బహిరంగ సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షించాలి. కానీ మోదీ వ్యవహారశైలి అందుకు పూర్తిగా భిన్నమైనది. అలాంటి పరిమితులకు లోబడి, తెరచాటున ఒదిగి ఉండి పనిచేసే తత్వం అతనికి లేదన్న విషయం అప్పుడప్పుడే బయటపడుతోంది. “మోదీకి చిన్న చిన్న విషయాలలో కూడా నిశ్చితాభిప్రాయాలు ఉంటాయి. సీనియర్ సంఘ్ నాయకులకేమో అతనికి అందరి

దృష్టిని తనవైపుకి తిప్పుకోవాలన్న ఆకాంక్ష ఉందన్న అభిప్రాయం కలిగింది. ఇది వారికి నచ్చలేదు" అని గుజరాత్‌లో 1970లలో ఏబివిపిలో పనిచేసిన ఇంకో సీనియర్ ప్రచారక్ నాతో చెప్పారు. ఎమర్జెన్సీ కాలంలో జరిగిన ఒక సంఘటనను ఆయన నాతో పంచుకున్నారు. "ఏబివిపిలో ఉన్న మాకు పట్టణంలోని వివిధ నివాస ప్రాంతాలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించమని చెప్పారు. దూషణలకు దిగకుండా, దూకుడుగా వ్యవహరించకుండా హుందాగా విమర్శలు చేయమని మాకు పై నుంచి సూచనలున్నాయి. సంఘ్ వ్యవహారశైలి అలానే ఉంటుంది. అహ్మదాబాద్‌లోని భుల్లాబాయ్ చార్‌రాస్తాలో ఆందోళన సభను నిర్వహిస్తున్నాం. సభ జరుగుతున్నప్పుడు నరేంద్రబాయ్ సైకిల్‌మీద అక్కడికి వచ్చాడు. సభ అంత శాంత గంభీరంగా సాగడం అతనికేమాత్రం నచ్చలేదు. ఒక్కసారిగా వేదికమీదకు దూకి వక్త చేతిలోనుంచి మైక్ లాక్కుని ప్రభుత్వాన్ని దుయ్యబట్టడం ప్రారంభించాడు. తిట్ల దండకాన్ని అందుకున్నాడు. తీవ్రమైన ఆగ్రహావేశాలను ప్రదర్శిస్తూ సాగిన ఆ ప్రసంగం శ్రోతలను బాగా ఆకట్టుకుంది. కానీ దాదాపుగా అజ్ఞాతంగా ఉండాల్సిన సంఘ్ ప్రచారక్ ఇలా బయటికి వచ్చినందుకు ఆ రాత్రి నరేంద్ర మోదీని సంఘ్ సీనియర్ నాయకులు మందలించారు. 'ప్రసంగం సంగతి తర్వాత. ముందసలు నీవక్కడికి వెళ్ళనే కూడదు. సభ విఫలమైనా పర్వాలేదు. ఒకరు నిర్వహించాల్సిన పాత్రకు లోబడి ఉండటం, క్రమశిక్షణతో వ్యవహరించడం అన్నిటికంటే ముఖ్యం" అని కుండ బద్దలుకొట్టినట్లు చెప్పారు.

సంఘ్‌కి దాని భావజాలానికి మోదీ వంద శాతం విధేయంగానే ఉండేవాడు. కానీ ఆ సంస్థ నిర్మాణం, పనితీరు, వ్యక్తి కంటే బృందానిదే పైచేయిగా ఉండడం, ఆగ్రహావేశాలను ప్రదర్శించకుండా ఉండడం, నాయకత్వం రూపొందించిన విధి విధానాలకు లోబడి వ్యవహరించడం... వీటికి మోదీ వ్యక్తిత్వానికి పొసగేదికాదు.

ఆర్ఎస్ఎస్‌లో మోదీకి సీనియర్ అయిన శంకర్‌సింహ్ వాఘేలా తర్వాతికాలంలో గుజరాత్‌కి ముఖ్యమంత్రి కూడా అయ్యారు. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం. మోదీ యువకుడిగా ఉన్నప్పటి నుంచే సంఘ్ నియమ నిబంధనలను ఉల్లంఘించేవాడంటారు శంకర్‌సింహ్ వాఘేలా. "ఆలస్యంగా నిద్ర లేవటంవల్ల సంఘ్ ఉదయపు శాఖను మోదీ తరచూ ఎగ్గొడుతూ ఉండేవాడు. అందరిలోనూ ప్రత్యేకంగా ఉండాలన్న తత్వం అతనిది. మేమందరం పొడుగుచేతుల కుర్తాలు వేసుకుంటే తను

కురచచేతుల కుర్తా వేసుకునేవాడు. మిగిలిన వారందరూ ఖాకీ నిక్కరు వేసుకుంటే అతను తెల్లది వేసుకొచ్చేవాడు. గోవాల్కర్ అహ్మదాబాద్ వచ్చినపుడు మోదీ చక్కగా కత్తిరించిన చిన్న గడ్డంతో కనిపించాడు. ఎందుకలా గడ్డం పెంచావని గోవాల్కర్ అందరి ముందూ మోదీని నిలదీశారు" అని అప్పటి సంగతులను గుర్తుకు తెచ్చుకుని చెప్పారు శంకర్ సింహ్ వాఘేలా.

అయితే సమర్థుడైన కార్యనిర్వహకుడిగా మోదీకి గుర్తింపు రావడంతో ఈ క్రమశిక్షణా రాహిత్యం అతని ఎదుగుదలకు అవరోధం కాలేదు. సీనియర్ నాయకులు అతనికేదైనా పని అప్పగిస్తే ఇక అది అయిపోయిందన్నంత నిశ్చింతగా ఉండేవారు. ఎమర్జెన్సీ కాలంలో సంఘ్ అనేక భాషల్లో పెద్ద మొత్తంలో రహస్యంగా సాహిత్యాన్ని ప్రచురించాల్సి వచ్చింది. అపుడు ఆ పనిని గుజరాత్ శాఖకు అప్పగించారు. మోదీ ఆ పనిని ఎంతో ఉత్సుకతతో స్వీకరించి విజయవంతంగా పూర్తి చేశాడు. లక్షల సంఖ్యలో కరపత్రాలను భిన్న భాషలలో ప్రచురించి వాటిని దేశవ్యాప్తంగా ఏయే శాఖలకు పంపించాలో అక్కడికి రహస్యంగా, భద్రంగా చేర్చాడు. ఈ వివరాలను నాకు రెండో సీనియర్ ప్రచారక్ అందించారు. ఇంకో సందర్భంలో సంఘ్ మరో బహిరంగ సంస్థ అయిన విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించాల్సి వచ్చింది. ఆ సదస్సు విజయవంతంగా పూర్తి కావడంలో ప్రధానపాత్ర మోదీదే. ఒక ప్రణాళిక వేసుకుని దాని ప్రకారం పని పూర్తి అయ్యేలా చూసే బాధ్యత తను తీసుకున్నాడు. అందుకు అవసరమైన ధనాన్ని రహస్యంగా జాగ్రత్త చేసే పని కూడా అందులో భాగమే. విహెచ్‌పి నాయకులు పెద్ద మొత్తంలో ఉన్న డబ్బును ఎలా దాయాలోనని ఆందోళనపడుతుంటే ఒక సాదాసీదా పరిష్కారంతో ముందుకొచ్చాడు మోదీ. నేలను తవ్వి అందులో డబ్బును పెట్టి పూడ్చి ఆపైన తన పక్కపరుచుకుని పడుకున్నాడు. అలా కొద్ది సంవత్సరాలలోనే కార్యనిర్వాహకుడిగా, కార్యకర్తగా అతనికున్న నైపుణ్యాలవల్ల గుజరాత్ ఆర్‌ఎస్‌ఎస్ విభాగంలో మోదీ ఒక విడదీయరాని భాగమైపోయాడు. కానీ సంఘ్ నాయకులకు మేనేజర్‌గా ఉన్న తాను సొంతంగా నాయకత్వ స్థాయికి ఎదగాలంటే అదిసరిపోదని అతను గ్రహించాడు. ఎమర్జెన్సీ కాలంలో సహాయకుడిగా అతని సేవలు పొందిన అనేకమంది సీనియర్లు లోక్‌సభకు, శాసనసభకు ఎన్నికయ్యారు. ఇంకొంతమంది గుజరాత్‌లో ఏర్పడ్డ జనతా ప్రభుత్వంలో మంత్రులయ్యారు. మోదీ మరోసారి నాగపూర్‌కి వెళ్ళి అక్కడి ప్రధాన కేంద్రంలో రెండు అదనపు శిక్షణా తరగతులకు హాజరయి

ఆ కోర్సును పూర్తి చేశాడు. "మోదీ త్వరితగతిన ఎదగాలన్న ధ్యాసలో ఉన్నాడు. ఈ రెండో మెట్టు, మూడో మెట్టు శిక్షణలను పూర్తి చేయకపోతే బిజెపిలోకి వెళ్ళలేనని, పెద్ద నాయకుడిని కాలేనని అతనికి తెలుసు" అన్నారు మొదటి సీనియర్ ప్రచారక్.

ఎమర్జెన్సీ ముగిసిన ఒక సంవత్సరానికి అంటే 1978లో మోదీని గుజరాత్ మధ్య భాగంలో ఆరు జిల్లాలకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్–ఇన్‌చార్జిగా నియమించారు. మరో మూడేళ్ళకే అంటే ముప్పై ఒక్క ఏళ్ళకే మోదీకి మరో పదోన్నతి కల్పించింది సంఘ్. గుజరాత్ రాష్ట్ర ఆర్‌ఎస్‌ఎస్‌కి దాని బహిరంగ సంస్థలకు మధ్య అనుసంధానం చేసే బాధ్యతలను అతనికి అప్పగించింది.

మూడవ భాగం

అలా మోదీ ఆర్‌ఎస్‌ఎస్‌లో కొద్ది కాలంలోనే పైకెగబాకాడు. కానీ నిజమైన రాజకీయ అధికారాన్ని సొంతం చేసుకోవాలంటే ఆర్‌ఎస్‌ఎస్ నుంచి దాని అనుబంధ రాజకీయ పార్టీ అయిన బిజెపిలోకి వెళ్ళాలి. దానికి పునాదులు 1987లో పడ్డాయి. ఆర్‌ఎస్‌ఎస్ గుజరాత్ విభాగం తరపున మోదీని సంస్థా కార్యదర్శి (ఆర్గనైజేషన్ సెక్రటరీ)గా



1991లో అప్పటి బిజెపి అధ్యక్షుడు మురళీమనోహర్ జోషి ఏకతా యాత్ర సందర్భంగా మోదీ

నియమించారు. అంటే ఆర్‌ఎస్‌ఎస్ తరఫునుంచి బిజెపి వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత అన్నమాట. బిజెపి రాష్ట్ర కార్యదర్శిలా ఈ బాధ్యుడు బహిరంగంగా పనిచేయకూడదు. తెర వెనుక నుంచి వ్యవహారాలు నడిపిస్తూ బిజెపి పార్టీకి మార్గ నిర్దేశం చేయాలి. ఆర్‌ఎస్‌ఎస్‌కి దాని అనుబంధ రాజకీయ సంస్థకు వారధిలా ఉండాలి.

గుజరాత్ రాష్ట్రంలో బిజెపి శరవేగంగా ఎదుగుతున్న కాలంలోనే మోదీ యాదృచ్ఛికంగా ఈ బాధ్యతలు చేపట్టారు. గుజరాత్ శాసనసభలో 1985 నాటికి బిజెపి శాసనసభ్యులు 11మంది ఉన్నారు. ఇంకో పదేళ్ళకు ఆ సంఖ్య 121కి చేరింది. బిజెపి రాష్ట్ర విభాగంలో ఇద్దరు సీనియర్ నాయకులు ఉండేవారు. వారే కేశూభాయ్ పటేల్, శంకర్‌సింహ్ వాఘేలాలు. ఇద్దరూ గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన వారే. వారితోపాటు ఇప్పుడు మోదీ మూడవ అధికార కేంద్రంగా మారాడు. రాష్ట్ర, జాతీయ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలోనూ, వివిధ పార్టీలతో పొత్తులు కుదర్చడంలోనూ మోదీ పార్టీ నిర్ణయాలను ప్రభావితం చేసేవాడు. ఆ కాలంలోనే గుజరాత్‌లో మూడు తీవ్రమైన మతపరమైన దాడులు జరిగాయి. ప్రతి దాడిలోనూ అంతకు ముందు కన్నా ఎక్కువ సంఖ్యలో హత్యలు జరిగాయి. 1985లో జరిగిన దాడిలో 208మంది చనిపోగా 1990లో 219మంది, 1992లో 441మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో మతపరమైన ఉద్రిక్తతలు పెరగడం బిజెపికి రాజకీయంగా ప్రయోజనాన్ని చేకూర్చిపెట్టింది. సంఘటితమయ్యే హిందువుల ఓట్ల శాతం నానాటికీ పెరగసాగింది. ఈ ఉద్రిక్త పరిస్థితుల నుంచి వీలైనంత అధిక ప్రయోజనం పొందడం కోసం బిజెపి వరుస రోడ్డు యాత్రలను చేపట్టింది. 1987లో న్యాయ యాత్ర పేరుతోనూ 1989లో లోక్‌శక్తి రథ యాత్ర పేరుతోనూ సాగిన ప్రచార యాత్రల నిర్వహణలో తెరవెనుక నుంచి మోదీ కీలకపాత్ర నిర్వహించారు. 1990లో బిజెపి జాతీయ అధ్యక్షుడు ఎల్‌కె. అద్వానీ అయోధ్య రథయాత్ర (ఆ తర్వాత బాబ్రీ మసీదు కూల్చివేతకు దారితీసింది)ను గుజరాత్‌లోని సోమ్‌నాథ్ దేవాలయం నుంచే ప్రారంభించారు. ఆ యాత్ర మొదటి భాగానికి మోదీనే ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత సంవత్సరంలో మోదీకి తొలిసారిగా ఒక జాతీయ స్థాయి కార్యక్రమ నిర్వహణ బాధ్యతను అప్పగించారు. బిజెపికి కొత్తగా జాతీయ అధ్యక్షుడైన మురళీమనోహర జోషి నేతృత్వంలో దేశం ఈ మూలనుంచి ఆ మూల వరకూ సాగే ఏక్తా యాత్ర నిర్వహణ బాధ్యతలను మోదీకి ఇచ్చారు. తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభమై కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయడంతో ఆ యాత్ర ముగిసింది. తొంబైయ్యవ దశాబ్దం తొలి సంవత్సరాలలో దేశవ్యాప్తంగా మత జాతీయవాదం ఒక

ప్రబలమైన రాజకీయ శక్తిగా తయారైంది. ఒకపక్క ఎన్నికలపరంగా చూస్తే బిజెపి సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో నిర్ణాయక శక్తిగా ఉండడానికి అవసరమైనన్ని సీట్లు గెలుచుకుంది. కొన్ని రాష్ట్రాల్లో సొంతంగా అధికారంలోకి వచ్చింది. ఇక వీధుల్లోనూ తన సత్తాను చాటే బల ప్రదర్శనకు దిగింది. బాబ్రీ మసీదు కూల్చివేత అందుకు ఒక ఉదాహరణ. మత దురభిమానాన్ని రెచ్చగొట్టి వేలాదిమందిని వీధుల్లోకి తెచ్చింది. జోషీ చేపట్టిన ఏక్తాయాత్రలోనూ యుద్ధోన్మాద జాతీయవాదాన్ని రెచ్చగొట్టారు.

ఏక్తాయాత్ర ఏ మార్గంలో వెళ్ళాలో, ఎక్కడ ఆగాలో, ఆగినచోట ఏ కార్యక్రమం జరగాలో ప్రణాళిక వేసింది మోదీనే. ఊహించినట్లుగానే ఆచరణలోనూ యాత్రను సమర్థంగా నిర్వహించాడు. అయితే అక్కడ కూడా పైవారి ఆదేశాలను బేఖాతరు చేసేవాడని "యాత్రలో పాల్గొన్న ఒక నాయకుడు నాతో చెప్పాడు. అలాంటి ఒక సంఘటనను నాకు వివరించారు. యాత్రకి నేతృత్వం వహిస్తున్న మురళీమనోహర జోషి తనతోపాటు ప్రయాణిస్తున్న జాతీయ స్థాయి నాయకుల నుంచి స్థానిక వలంటీరు వరకూ అందరూ ఒకేసారి ఒకేచోట కూర్చుని భోజనం చేయాలని కోరారు. కానీ తరచూ మోదీ మాయమయ్యేవాడు. యాత్ర బెంగుళూరు చేరుకునే సమయానికి స్థానిక నాయకుడు అనంతకుమార్‌తో కలిసి ఎక్కడికో మాయమయ్యాడు. మా అందరితో కలిసి కూర్చుని భోజనం చేయనందుకు మోదీపై జోషికి తీవ్రమైన కోపం వచ్చింది. మరుసటి రోజు ఉదయం అందరి ముందే మోదీని తిట్టారు. యాత్రను నిర్వహిస్తున్నంత మాత్రాన క్రమశిక్షణ తప్పకూడదని, ప్రవర్తనను సరిచేసుకోవాలని జోషి మోదీకి స్పష్టంగా చెప్పారు" అన్నారు ఆ నాయకుడు.

కానీ ఏక్తాయాత్ర ముగిసి గుజరాత్‌కి తిరిగొచ్చాక మోదీ మరింత స్వతంత్రంగా వ్యవహరించాడు. ఫలితంగా తనకంటే పదేళ్ళ సీనియర్ అయిన శంకర్‌సింహ్ వాఘేలాతో విభేదాలొచ్చాయి. అప్పట్లో వాఘేలా పార్టీలో శక్తివంతమైన నాయకుడు. పార్టీకి నిధులు సేకరించడంలో ఆయనదే ప్రధానపాత్ర. లౌకిక పార్టీలతో పొత్తులు కుదర్చడంలో ఆయన దిట్ట. వాఘేలా కంటే సీనియర్ అయిన కేశూభాయ్ పటేల్ బిజెపి అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి అయ్యే వ్యక్తి. ఆర్ఎస్ఎస్‌కి, బిజెపికి వారధిలా ఉండాల్సిన పాత్ర మోదీది. కానీ ఇతరులకు ఆదేశాలు జారీచేయడం, తను మాత్రం ఆదేశాలకు లోబడక స్వతంత్రంగా వ్యవహరించడం వల్ల మోదీకి బిజెపి నాయకులతో స్పర్థలు మొదలయ్యాయి. "అతను కష్టపడి పని చేసేవాడు. ఆర్గనైజేషన్ సెక్రటరీగా అతను కాస్త తగ్గి ఉండాలి. కానీ శంకర్ సింహ్ వాఘేలా, కేశూభాయ్ పటేల్‌తో సమానంగా కనిపించాలనుకునేవాడు" అంటారు

గోవిందాచార్య. ఆయన అప్పట్లో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి. పార్టీకి ప్రధాన సిద్ధాంతకర్త కూడా.

"మోదీ పార్టీ రోజువారీ కార్యక్రమాల్లో జోక్యం చేసుకునేవాడు. రాష్ట్ర కార్యదర్శిగా ఆ పని నాది. పార్టీ రాజ్యాంగం ప్రకారం ఆర్గనైజేషన్ సెక్రటరీ పార్టీకి సూచనలివ్వాలి, మార్గదర్శిగా ఉండాలే తప్ప నిర్ణయాలను సొంతంగా అమలు చేయకూడదు."అని నాతో చెప్పారు వాఘేలా. బిజెపి ప్రతిపక్షంగా ఉండగానే శంకర్‌సింహ్ వాఘేలా, కేశూభాయ్‌పటేల్, నరేంద్రమోదీల మధ్య మనస్పర్థలు పెరుగుతున్నా వాటిని తాత్కాలికంగా పక్కన పెట్టగలిగారు. పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తేవాలన్న ఉమ్మడి లక్ష్యం కోసం కలిసి పనిచేశారు. బిజెపి కార్యకర్తలు అప్పటికింకా ఓటర్లను కేంద్రాలకు రప్పించే కళలో ఆరితేరలేదు. ఓటరు రికార్డులను దగ్గరుంచుకోవడం, పెద్ద వారిని, జబ్బుపడ్డవారిని పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్ళడానికి రవాణా ఏర్పాటుచేయించడం, ఇంకా ఇలాంటి కొన్ని చిట్కాలు ఇతర రాజకీయ పార్టీలలోని అనుభవమున్న కార్యకర్తలకు అప్పటికే బాగా తెలుసు. ఈ లోటు పూడ్చుకోవడం కోసం నరేంద్రమోదీ, వాఘేలా, పటేల్‌లు రాష్ట్ర వ్యాప్తంగా తమ సంస్థలు(ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, ఎబివిపి) అన్నిటి నుంచి 1,50,000మంది కార్యకర్తలను సమీకరించి వారికి ఎన్నికలకు కొద్ది రోజుల ముందు (ఫిబ్రవరి 1995) శిక్షణ ఇప్పించారు. ఈ ప్రయత్నం ఫలించింది.

బిజెపికి అంతకు ముందు ఎన్నికలతో పోల్చితే దాదాపు రెట్టింపు సీట్లు వచ్చాయి. బిజెపికి 121సీట్లు వస్తే కాంగ్రెస్‌కి 45 సీట్లే దక్కాయి. పార్టీ కేశూభాయ్ పటేల్‌ని ముఖ్యమంత్రిగా ఎంపికచేసింది. నరేంద్రమోదీ అతనితో ఎక్కువ సమయం గడపడం ఆరంభించారు. అది వాఘేలాను పటేల్‌కు మరింత దూరమయ్యేలా చేసింది. వారిద్దరూ తనకు వ్యతిరేకంగా జట్టు కడుతున్నారని వాఘేలా గ్రహించాడు. "మోదీ రోజూ కేశూభాయ్‌తోనే పగలూ రాత్రి భోజనం చేసేవాడు. ఆ సమయంలో నేను ఆయనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నానని చెవిలో ఊదుతూ ఉండేవాడు. నన్ను, నా సన్నిహిత ఎమ్మెల్యేలను ఆమడ దూరంలో ఉంచమని సలహా ఇచ్చేవాడు" అని చెప్పారు వాఘేలా. కానీ వాఘేలాకు ముఖ్యమంత్రి కావాలన్న కోరిక బలంగా ఉంది. ఆ పదవి కేశూబాయ్‌కి దక్కడంతో అసహనానికి గురయ్యాడు. 1995లో సగం మంది ఎమ్మెల్యేలను తీసుకుపోయి మధ్య ప్రదేశ్‌లో ఒక రిసార్టులోఉంచాడు. పటేల్‌ని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించి తనకది ఇవ్వకపోతే ప్రభుత్వాన్ని పడగొడతానని బెదిరించాడు. బిజెపి కేంద్ర నాయకత్వం శాంతి దూతగా వాజ్‌పేయిని పంపించింది. మధ్యే మార్గంగా సురేష్ మెహతా అనే



1994లో సీనియర్ బిజెపి నాయకులు కన్షీరాం రాణా, కేశూభాయ్ పటేల్, శంకర్‌సింగ్ వాఘేలాలతో మోదీ.

మూడో వ్యక్తిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా చేశారు. కేశూబాయ్ తప్పుకోవలసి వచ్చింది. ఇద్దరిమధ్యా స్పర్థలను పెంచడంలో చురుకైన పాత్రను పోషించినందుకు శిక్షగా మోదీని ఢిల్లీకి పంపించారు. అక్కడ బిజెపి జాతీయ కార్యదర్శిగా పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, చండీఘడ్ , జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల బాధ్యతలను అప్పగించారు. 1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో శంకర్ సింహ్ వాఘేలా అనూహ్యంగా ఓడిపోయారు. ఆర్ఎస్ఎస్, మోదీ, పటేల్‌ల వల్లే తాను ఓడిపోయానని వాఘేలా ఆరోపించారు. మరికొంతమంది అసమ్మతివాదులతో కలిసి పార్టీనుంచి విడిపోయి కొత్త పార్టీ పెట్టారు. సురేష్ మెహతా ప్రభుత్వం పడిపోయింది. కాంగ్రెస్ మద్దతుతో వాఘేలా ముఖ్యమంత్రి అయ్యారు. ఇక మోదీని ఢిల్లీకి ప్రవాసానికి పంపించడం ఒకరకంగా అతనికి తంతే గారెల బుట్టలో పడ్డట్లయింది. పార్టీ కేంద్ర కార్యాలయంలో రోజూ అనేకమంది బిజెపి జాతీయ నాయకులను కలుసుకునే అవకాశం కలిగింది. దాన్ని పూర్తిగా వాడుకున్నాడు. కనిపించిన అందరి దగ్గరా వాఘేలా ఫిరాయింపును ప్రస్తావించి నేను ముందే చెప్పానని గుర్తు చేస్తూండేవాడు. ఇది పరోక్షంగా పార్టీ జాతీయ నాయకుల్లో మోదీ పరపతి పెరగడానికి దోహదపడింది. 1998లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రి అయిన కొన్నాళ్ళకు మోదీకి పార్టీ జాతీయ ఆర్గనైజేషన్ సెక్రటరీగా పదోన్నతి లభించింది. అంటే జాతీయ

స్థాయిలో ఆర్‌ఎస్‌ఎస్‌కి, బిజెపికి వారధిలా వ్యవహరించే పని అన్నమాట. అప్పటి అయిదు దశాబ్దాల పార్టీ చరిత్రలో(బిజెపి, దాని పూర్వ రూపమైన జనసంఘ్ పార్టీల చరిత్ర)ముగ్గురే ఆర్గనైజేషన్ సెక్రటరీలుగా ఉన్నారు. ఒక్కొక్కరూ సంఘ్‌లో సిద్ధాంత కర్తలనదగ్గ స్థాయి కలిగి ఉన్న వ్యక్తులు. వీరందరూ మీడియా కంట పడకుండా తెరవెనుకే పనిచేశారు. మోదీ ఆ సంప్రదాయానికి భిన్నంగా అనునిత్యం వార్తలలో ఉండడానికి ప్రయత్నించారు. 1999లో కార్గిల్ యుద్ధ సమయాన, ఆ తర్వాత వాజ్‌పేయికి, ముషారఫ్‌కి మధ్య జరగిన శాంతి చర్చలు విఫలమయిన సందర్భంలోనూ తరచూ పత్రికా సమావేశాలు ఏర్పాటు చేశాడు. టీవి ఛానళ్ళలో రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తూ కనిపించేవాడు. తర్వాత కాలంలో ఆశైలే మోదీకి పర్యాయపదంగా మారింది. పాకిస్థాన్ నుంచి వచ్చే కవ్వింపులకు భారత్ ఎలా స్పందించాలని ఒక టీవి ఛానల్ చర్చలో ప్రశ్నిస్తే "చికెన్ బిర్యానీతో కాదు తూటాలకు బాంబులతో సమాధానం చెప్పాలి" అని బదులిచ్చాడు. ఇక గుజరాత్‌లోనేమో కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించుకోవడంతో వాఘేలా ప్రభుత్వం కొద్ది కాలంలోనే పడిపోయింది. కేశూభాయ్ పటేల్ అధికారంలోకి వచ్చాడు. అతని చుట్టూ అప్పుడే కొత్తగా పేరు తెచ్చుకుంటున్న యువ నాయకులు సంజయ్ జోషి, హరేన్ పాండ్యా, బోర్ధాన్ జడాఫియా లాంటి వారు చేరారు. మోదీ ఢిల్లీలోనే ఉన్నాడు. బిజెపి ప్రభుత్వం స్థానిక ఎన్నికలలోనూ, 2001లో జరిగిన శాసనసభ ఉప ఎన్నికలలోనూ పరాజయం పాలైంది. కచ్ ప్రాంతంలో తీవ్రస్థాయిలో భూకంపం వచ్చి జన జీవితాలను అతలాకుతలం చేసిన సందర్భంలోనూ ప్రభుత్వం సరిగా స్పందించి సహాయ కార్యక్రమాలు నిర్వహించడంలో విఫలమయింది. ఇదే తరుణమని భావించిన మోదీ తన ఒకప్పటి మిత్రుడు కేశూబాయ్ పటేల్‌కు వ్యతిరేకంగా ప్రచారం మొదలుపెట్టాడు.

"మోదీ కేశూబాయ్ వైఫల్యం గురించి మాకు ఫిర్యాదు చేసేవాడు. పటేల్‌కి అభివృద్ధి గురించే తప్ప హిందూత్వను వ్యాప్తి చేయాలన్న ధ్యాస లేదని విమర్శించేవాడు. ఒకప్పుడు కేశూబాయ్ పటేల్‌కి ఎలా అయితే శంకర్ సింహ్ వాఘేలా గురించి చెడుగా చెప్పాడో అలానే ఢిల్లీ నాయకుల దగ్గర కేశూబాయ్ పటేల్ గురించి చాడీలు చెప్పేవాడు" అని అప్పట్లో బిజెపి ఢిల్లీ కార్యాలయంలో కీలక స్థానంలో ఉన్న ఒక మాజీ బిజెపి నాయకుడు చెప్పాడు.

ఆ చాడీలకు ఫలితం లభించింది. మోదీ ముఖ్యమంత్రి అయ్యాడు. కానీ ముఖ్యమంత్రి పదవిని అప్పగిస్తారని ఊహించనేలేదని, వాజ్‌పేయి తనకా బాధ్యతను అప్పగించినప్పుడు ఆశ్చర్యానికి గురయ్యానని మోదీ చెప్పుకున్నాడు. తన జీవిత చరిత్ర

రాసిన ఎం.వి. కామత్‌కి మోదీ ఈ సంఘటన గురించి ఇలా వివరించాడు. “నేనొక టీవి ఛానల్ కెమెరామెన్ అంత్యక్రియలకు హాజరయినపుడు వాజ్‌పేయి నుంచి సాయంత్రం వచ్చి కలవమని ఫోన్ వచ్చింది. నేను వెళ్ళి కలిశాను. ‘పంజాబీ తిండి తిని బాగా లావెక్కుతున్నావు. కాస్త సన్నబడాలి, ఇక్కడ నుంచి వెళ్ళిపో’అని అన్నారు. ‘ఎక్కడికి?’ అని అడిగాను. ‘గుజరాత్‌కి వెళ్ళి పనిచెయ్యి’ అన్నారు. ‘ఒక్క గుజరాత్ బాధ్యతేనా వేరే ఇంకేమైనా రాష్ట్రాలకు కూడా ఇన్‌చార్జిగా ఉండాలా?’ అని అడిగాను. అప్పుడు అటల్‌జీ ‘కాదు, ఎన్నికల్లో పోటీ చేయాలి’ అన్నారు. ముఖ్యమంత్రిగా ఉండడం కోసం వెళ్ళమంటున్నారని అర్థమైంది. ‘అది నా పని కాదు. గుజరాత్‌కి దూరమై ఆరేళ్ళయింది. అక్కడి విషయాలపై నాకు అవగాహన లేదు. వెళ్ళి నేనేమి చేయాలి? నాకిష్టం ఉన్న రంగం కూడా కాదు. నాకెవ్వరూ తెలియదు కూడా’ అని వాజ్‌పేయికి చెప్పాను. కానీ ఐదారు రోజులు అయ్యాక పార్టీ అప్పగించిన పనిని తీసుకోకతప్పలేదు.”.

మోదీ ఇచ్చిన ఈ చిత్రణకు సీనియర్ బిజెపి నాయకులు చెప్పే విషయాలకు ఎక్కడా పొంతనలేదు. ఢిల్లీ వచ్చిన దగ్గర నుంచి ముఖ్యమంత్రి పదవి కోసం మోదీ తీవ్రంగా ప్రయత్నించాడని వాళ్ళు నాకు చెప్పారు. “గుజరాత్ బిజెపి అతనిని ముఖ్యమంత్రిగా ఎంచుకోదు. మోదీ ఎలా మనుషులను విభజిస్తాడో, వారి మధ్య ఎలా విబేధాలు సృష్టిస్తాడో, ఎంతటి ఒంటెత్తు పోకడలు పోతాడో వారికి బాగా తెలుసు. ఇక పై నుంచి నియామకపు ఆదేశాలు తెచ్చుకోవడం తప్ప అతనికి వేరే మార్గం లేదు. ఆ పనే చేశాడు” అన్నాడు ఒక నాయకుడు.

నిజానికి మోదీ ఢిల్లీలోని కొంతమంది పత్రికా సంపాదకులకు కేశూబాయ్ పటేల్‌కి వ్యతిరేకంగా కథనాలు రాయడానికి అవసరమైన సమాచారాన్ని అందించారని కూడా అంటారు. అలాంటి ఒక సంఘటనను గురించి అవుట్‌లుక్ పత్రిక మాజీ సంపాదకుడు వినోద్ మెహతా తన జ్ఞాపకాలను పుస్తక రూపంలో తెచ్చినపుడు దానిలో ఇలా రాశారు. “మోదీ ఢిల్లీలో పనిచేసేటపుడు నన్ను కలవడానికి మా కార్యాలయానికి వచ్చాడు. వెంట కొన్ని పత్రాలను తీసుకువచ్చాడు. కేశూబాయ్ పటేల్ పాలన సరిగా లేదని సూచించే పత్రాలవి. ఆ తర్వాత కేశూబాయ్ స్థానంలో మోదీ ముఖ్యమంత్రి అయ్యాడని విన్నాను.”

గుజరాత్ పార్టీ నుంచి మోదీకి ఎలాంటి వ్యతిరేకతా ఎదురవ్వకుండా చూడడానికి ఢిల్లీ నుంచి సీనియర్ బిజెపి నాయకులు కుశుభావ్ థాకరే, మదన్‌లాల్ ఖురానాలు వెళ్ళారు. వారి సమక్షంలో కనీసం శాసనసభ్యుడు కూడా కాని మోదీ సురక్షితంగా

ముఖ్యమంత్రి పదవి చేపట్టాడు. ఆర్ఎస్ఎస్‌కి ఇది ఒక గొప్ప విజయంగా కనిపించింది. చరిత్రలో మొదటిసారిగా సంఘ్ పూర్తికాలపు ప్రచారక్(కార్యకర్త) ముఖ్యమంత్రి కాగలిగాడు మరి.

ఇంకో ఏడాదిలో రాష్ట్ర ఎన్నికలు ఉన్నాయి. అందుకే మోదీ అహ్మదాబాద్ చేరిన నాటి నుంచే తానేం చేయాలనుకుంటున్నాడో వెల్లడించడం మొదలుపెట్టాడు. "నేనిక్కడికి వన్ డే మ్యాచ్ ఆడడానికి వచ్చాను. అత్యంత వేగంగా, సమర్థంగా ఆడే బ్యాట్స్‌మెన్ కావాలి నాకు. గెలవాలంటే పరిమిత ఓవర్లలోనే అత్యధిక పరుగులు చేయాలి కదా" అని పత్రికల వారితో అన్నాడు. ఆ వన్ డే మ్యాచ్ టెస్ట్ సిరీస్‌గా మారుతుందని పదకొండేళ్ళ (ఇప్పటికి పదమూడేళ్ళు) తర్వాత కూడా ఆడుతూనే ఉంటాడని ఎవరూ ఊహించలేదు.

నాలుగవ భాగం

నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా అక్టోబర్ 7, 2001న ప్రమాణస్వీకారం చేశాడు. అదే రోజున అమెరికా, దాని మిత్ర దేశాలు కాబూల్, కాందహార్, జలాలాబాద్ (ఆఫ్ఘనిస్థాన్) మీద తొలిసారిగా బాంబులు వేశాయి. న్యూయార్క్ లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడులు జరిగిన నెలలోపే ఆఫ్ఘనిస్థాన్ మీదకు దాడులకు దిగారు. ఇస్లాం



2002 మార్చి 1న అహ్మదాబాద్ వీధుల్లో అరాచకమూకలు

తీవ్రవాదులైన జీహాద్‌ల నుంచి ముప్పు పొంచి ఉందన్న ప్రచారం ప్రపంచం అంతా మారుమోగింది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ యుద్ధం (గ్లోబల్ వార్ ఆన్ టెర్రరిజమ్) మొదలైందని, దీని నుంచి ఏ ప్రాంతానికీ మినహాయింపు లేదని అమెరికా అధ్యక్షుడు ప్రకటించాడు. ఐక్య రాజ్య సమితి భద్రతామండలి తమ సభ్య దేశాలన్నింటినీ తీవ్రవాదంపై యుద్ధం కోసం అవసరమైతే అదనపు చట్టపరమైన చర్యలు తీసుకోమని సూచిస్తూ తీర్మానం చేసింది. ఆ దశలో ప్రతిచోటా రాజకీయ నాయకులకు ఈ "ఇస్లామ్ తీవ్రవాదంమీద పోరాటం" అనే మాట ఒక ఆయుధంలా ఉపయోగపడింది. అరుదైన శక్తినిచ్చింది. ఆ పేరుతో తమ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను, అణచివేత చర్యలను సమర్థించుకోగలిగారు.

పాలనలో ఓనమాలు తెలియని మోదీ తన శక్తియుక్తులన్నింటినీ అవి నేర్చుకోవడం మీదకి మళ్ళించాడు. అప్పటి వరకూ అతను ప్రభుత్వంలో ఏ పదవీ చేపట్టలేదు, ఎన్నికల్లో స్వయంగా పోటీ చేసిందీ లేదు. "తొలినాళ్ళలో అధికారులతో జరిగే చర్చలలో అతను మౌనంగా ఉండేవాడు. అధికారులనే మాట్లాడనిచ్చేవాడు. వాటిని అత్యంత శ్రద్ధగా ఆలకించేవాడు. మాటలనే కాదు స్వరంలో హెచ్చు తగ్గులు, హావభావాలు, ఉచ్ఛారణ అన్నింటినీ గ్రహిస్తున్నాడా, పరిశీలిస్తున్నాడా! అనిపించేది" అని మోదీ ప్రభుత్వంలో పనిచేసిన ఒక సీనియర్ పోలీస్ అధికారి చెప్పారు. మోదీ పైవారి ఆశీస్సులతో అధికారాన్ని కైవసం చేసుకోవడం స్థానిక బిజెపి నాయకులకు మింగుడుపడలేదు. సీనియర్లతో అతను ప్రవర్తించే తీరు కూడా వారిలో వ్యతిరేకతను పెంచింది. "నాయకుల అండతో ముఖ్యమంత్రిని అయ్యానన్న భావన మోదీలో బలంగా ఉండేది. మంత్రివర్గ సమావేశాల్లో మాతో ఆజ్ఞలు జారీ చేస్తున్నట్లు అధికార స్వరంతో మాట్లాడేవారు" అని ఒక మాజీ మంత్రి చెప్పారు.

ఇస్లాం తీవ్రవాదానికి వ్యతిరేకంగా అమెరికా పాలకులు చేస్తున్న ప్రచారం కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి ఒక సానుకూల అంశంగా కనిపించింది. దీనివల్ల తమ పాకిస్థాన్ వ్యతిరేక వైఖరి సరైందేనని రుజువైనట్లుగా భావించారు. అ సంవత్సరం చివరికి అంటే డిసెంబరు 13న పార్లమెంటుపై బాంబు దాడి జరిగింది. అదే సాకుగా బిజెపి ప్రభుత్వం భారత్ పాక్ సరిహద్దుకు 10లక్షల మంది సైన్యాన్ని పంపింది. ఈ సైనిక వ్యయాన్ని భరించడం కోసం దిగుమతుల మీద యుద్ధ పన్ను విధించింది. దేశంలో ఆ సమయంలో జాతీయ వాదం ఒక బలమైన భావనగా ప్రజల మనస్సులోకి చొచ్చుకుపోయింది. దానితోపాటుగా ముస్లిం వ్యతిరేక భావాలు కూడా దేశమంతా వ్యాప్తి

చెందాయి. మోదీ సైద్ధాంతిక భావజాలం ఆర్‌ఎస్‌ఎస్ మూసలో రూపుదిద్దుకున్నది. అలాంటి మోదీకి దేశంలో అత్యధికంగా వ్యాప్తి చెంది ఉన్న ఈ రాజకీయ వాతావరణం గతంలో ఎన్నడూ లేనంతగా అనుకూలంగా ఉందనడంలో సందేహం లేదు.

ఫలితం : అది ఫిబ్రవరి, 2012. ఆ నెలలో ఒకరోజు. సూరత్‌లో లార్సన్ అండ్ టర్బో(ఎల్ అండ్‌టి)లో పనిచేసే ఒక సీనియర్ ఇంజనీర్ కూతురు అనిక. పన్నెండేళ్ళ బాలిక. మార్చి ఒకటిన జరిగే స్కూల్ వార్షికోత్సవంలో తన నాట్య ప్రదర్శన కూడా ఉందని ఆ అమ్మాయికి ఆ రోజే తెలిసింది. వెంటనే అహ్మదాబాద్‌లో ఉన్న తన తాతకి ఫోన్ చేసి ప్రదర్శనకు వచ్చి తీరాల్సిందేనని పట్టుపట్టింది. వస్తానని ఆ తాతయ్య హామీ ఇచ్చారు.

అనిక ప్రదర్శనకు రెండు రోజుల ముందు ఫిబ్రవరి 27న గోద్రా (అహ్మదాబాద్‌కు తూర్పున 160 కిలో మీటర్ల దూరంలో ఉన్న పట్టణం) నుంచి వెళుతున్న ఒక రైలులో 58మందిని చంపారు. ఆ రైలులో విశ్వహిందూ పరిషత్, దాని విభాగమైన భజరంగ్‌దళ్ సభ్యులు అధిక సంఖ్యలో ఉన్నారు. బాబ్రీ మసీదు విధ్వంసపు పదవ వార్షికోత్సవం జరుపుకోవడానికి అయోధ్య వెళ్ళి తిరిగివస్తున్నారు. చనిపోయినవారిలో మహిళలు, పిల్లలే అధిక సంఖ్యలో ఉన్నారు. గోద్రాకు చెందిన ముస్లింలు గుంపుగా వచ్చి పథకం ప్రకారం రైలు మీద పడి దాడి చేశారన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. వెనువెంటనే ఘటనకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు ప్రసారమయ్యాయి.

భజరంగ్‌దళ్, విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మూకలు ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూ వీధుల్లోకి వచ్చాయి. మరుసటిరోజు విహెచ్‌పి రాష్ట్ర వ్యాపిత బంద్‌కి పిలుపు ఇచ్చింది. బిజెపి ప్రభుత్వం ఆ బందుకు మద్దతు ఇచ్చింది. ఆ రోజు అహ్మదాబాద్‌కి మాజీ ఎంపి అయిన ఇషాన్ జాఫ్రీ అనే 72ఏళ్ళ వృద్ధుడు తన మనవరాలు అనికకు ఫోన్ చేసి తను రాలేనని చెప్పాడు. అహ్మదాబాద్‌లో ముస్లింలు ప్రధానంగా ఉండే ఒక ఎగువ మధ్య తరగతి నివాస ప్రాంతమైన గుల్బర్గ్ సొసైటీలో అతని ఇల్లు ఉంది. సీనియర్ రాజకీయ నాయకుడైన జాఫ్రీకి మరుసటి రోజు ఇంటి నుంచి బయటికి వచ్చి సూరత్‌కి వెళ్ళడం ప్రమాదకరమని అప్పటికే అర్థమైంది. అందుకే కుదరదన్నాడు. 'బందే కదా తాత రావచ్చు కదా?' అని అమ్మ దగ్గర చిందులు వేసింది అనిక.

మరుసటిరోజు మధ్యాహ్నం 'నువ్వింకా బయలుదేరలేదా' అంటూ తాతకు మళ్ళీ ఫోన్ చేసింది. 'ఇక్కడ పరిస్థితి ఏమీ బాగాలేదమ్మా, ఎక్కడ చూసినా వీధుల్లో

మూకలున్నాయి. నేను చాలా మందికి ఫోన్ చేయాలి. నీతో మళ్ళీ మాట్లాడుతాను' అంటూ ఫోన్ పెట్టేశాడు జాఫ్రీ. అప్పటికే ఒక పెద్ద గుంపు గుల్బర్గ్ సొసైటీని చుట్టుముట్టింది. చేతుల్లో పెట్రోల్ బాంబులు, సైకిల్ చెయిన్లు, కత్తులు పట్టుకున్న ఆ గుంపు 'ప్రతీకారం తీర్చుకుంటాం, ముస్లింలను నరికేస్తాం' అనే నినాదాలతో వీరంగం వేస్తోంది. జాఫ్రీకి పొరుగున ఉన్న వారు, ముస్లిం బస్తీలలో ఉన్న వారు భద్రత కోసం ఆయనింటికి చేరారు. మాజీ పార్లమెంటు సభ్యుడైన ఆయన తన పరపతిని ఉపయోగించి రక్షణ కలిపించగలరన్న ఆశతో అక్కడ తలదాచుకున్నారు. "సాయం కోసం ఆయన వందకు పైగానే ఫోన్‌లు చేశారు"అని జాఫ్రీ భార్య జాకియా నాతో చెప్పారు. జాఫ్రీ గుజరాత్ డిజిపికి, అహ్మదాబాద్ పోలీస్ కమిషనర్‌కి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఇంకా ఎంతోమందికి ఫోన్ చేసి ఆ గుంపును అడ్డుకుని తమకు రక్షణ కల్పించమని వేడుకున్నారు. ఆ సమయంలో అక్కడున్న ఒక వ్యక్తి జాఫ్రీ మోదీకి కూడా ఫోన్ చేశారని కోర్టులో సాక్ష్యం చెప్పారు. "మోదీ ఫోన్‌లో ఏమన్నారని జాఫ్రీని అడిగాను. అతన్నుంచి మనకు ఎలాంటి సాయం రాదు. నన్ను దుర్భాషలాడుతున్నాడని జాఫ్రీ బదులిచ్చారు."అని కోర్టుకు వివరించారాయన.

జాఫ్రీ ఇలా ప్రాణాలరచేతపెట్టుకుని రక్షణ కోసం ఫోన్‌లు చేస్తున్నారన్న విషయం అప్పటి ఉప ప్రధానమంత్రి ఎల్‌కె అద్వానీకి కూడా చేరిందట. మోదీకి సన్నిహితుడైన ఒక బిజెపి నాయకుడు అప్పుడు అద్వానీ దగ్గరే ఉన్నాడు. అద్వానీ కూడా మోదీ ఆఫీసుకు ఫోన్ చేసి జాఫ్రీ క్షేమం గురించి ఆరా తీశారని ఆ నాయకుడు చెప్పాడు.

మధ్యాహ్నం రెండున్నరకల్లా మూకలు గుల్బర్గ్ హౌసింగ్ సొసైటీ గేట్లను విరగ్గొట్టి లోపలకు దూసుకొచ్చాయి. వారిలో ఒక పెద్ద గుంపు జాఫ్రీ ఇంట్లోకి చొరబడింది. మహిళలపై అత్యాచారం చేసి సజీవంగా కాల్చేశారు. మగవారిచే జైశ్రీరామ్ అన్న నినాదాలు ఇప్పించి ఆ తరువాత వారిని ముక్కలుగా నరికేశారు. పిల్లల్నీ వదిలి పెట్టలేదు. కోర్టుకు అందిన ఒక నివేదిక ప్రకారం జాఫ్రీని బట్టలూడదీసి అందరి ముందూ నగ్నంగా నడిపించి, చేతి వేళ్ళూ, కాళ్ళు నరికి శరీరాన్ని నేలమీద లాక్కుంటూ పోయి మంటల్లో పడేశారు. పోలీసుల అధికారిక నివేదిక ప్రకారమే గుల్బర్గ్ సొసైటీలో ఈ మారణకాండలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 59. ఇతరులు చేసిన స్వతంత్ర విచారణలో 70మంది వరకూ చనిపోయారని తేలింది. జాఫ్రీ భార్య జాకియా, ఇంకొంత మంది మేడ పైభాగంలోని గదికి తాళం వేసుకుని లోపలే ఉండిపోవడం వల్ల ప్రాణాలు కాపాడుకోగలిగారు.

ఆ రోజు సాయంత్రం పోలీసులు వచ్చి సమాచారం ఇచ్చేంతవరకు గుల్బర్గ్ సొసైటీలో ఏం జరిగిందో తనకు తెలియదని మోదీ చెబుతూ వస్తున్నాడు. కానీ అప్పుడు రాష్ట్ర ఇంటిలిజెన్స్ విభాగంలో డిప్యుటీ కమిషనర్(డిసిపి)గా పనిచేసిన సంజీవ్ భట్ మాత్రం మోదీ చెప్పేది పచ్చి అబద్ధమంటున్నారు. సంజీవ్‌భట్ మాత్రమే కాదు, ఇంకా అనేకమంది ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు జరిగిందేమిటో సాక్ష్యం చెప్పారు. దాన్ని మోదీ, అతని అధికార యంత్రాంగం తీవ్రంగా సవాల్ చేస్తున్నారు.

రాష్ట్ర హోం శాఖామంత్రిగా కూడా ఉన్న మోదీ ఆ రోజంతా సీనియర్ పోలీస్ అధికారులు, ఇంటలిజెన్స్ అధికారుల నుంచి సమాచారం తెలుసుకుంటూనే ఉన్నారని, అక్కడ జరుగుతున్న సంఘటనల గురించి మోదీకి ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉందని భట్ నొక్కి చెబుతున్నారు. "మధ్యాహ్నం రెండు గంటలకు ముందు నేను మోదీకి చాలాసార్లు ఫోన్ చేశాను. గుల్బర్గ్ సొసైటీని మూకలు చుట్టుముట్టాయని చెప్పాను. మధ్యాహ్నం మోదీని కలిసి వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉందని వివరించాను. మోదీ స్పందించిన తీరు వింతగా ఉంది. నేను చెప్పిందంతా విని "జాఫ్రీకి గతంలో కాల్పులు జరిపే అలవాటు ఉందేమో కనుక్కోవడానికి ప్రయత్నించు అన్నారు" అని భట్ నాతో చెప్పారు.

"మోదీని కలిసి బయటికి వస్తున్నపుడు ముఖ్యమంత్రి కార్యాలయం ఆవరణలో నాకు మాజీ ముఖ్యమంత్రి అమర్‌సింగ్ చౌదరి, మాజీ హోం మంత్రి నరేష్ రావల్ ఎదురుపడ్డారు. ఇద్దరూ కాంగ్రెస్ నాయకులే. గుల్బర్గ్ సొసైటీ నుంచి ఇషాన్‌బాయ్ సాయం చేయమని ఫోన్‌లు చేస్తున్నాడని, ఆ పనిమీదే మోదీని కలవడానికి వచ్చామని చెప్పారు. నేనింతకు ముందే పరిస్థితిని వివరించాను. మీరూ వెళ్ళి మాట్లాడి చూడండి అన్నాను. ఆ తరువాత గుల్బర్గ్ సొసైటీనుంచి సమాచారం అందించే ఒక వ్యక్తి నాకు ఫోన్ చేసాడు. ఇషాన్‌బాయ్ ఆత్మరక్షణ కోసం కాల్పులకు దిగాడని అతను చెప్పాడు. నా ఆఫీసు బల్ల మీద కూడా ఆ విషయాన్ని నిర్ధారించే ఒక చిన్న నివేదిక ఉంది. ఆశ్చర్యపోవడం నావంతయింది. అప్పుడు కానీ ఈ మనిషి(మోదీ)కి నాకంటే ముందే అన్ని విషయాలూ తెలిశాయని నేను గ్రహించలేకపోయాను."అని నాతో చెప్పారు సంజీవ్‌భట్.

24గంటల ప్రత్యక్ష ప్రసారం చేసే వార్తా ఛానళ్ళు వచ్చాక ఇంత పెద్ద ఎత్తున మతపరమైన హింస పెచ్చరిల్లిన మొదటి దాడులు ఇవే. యువత ఆయుధాలను చేతబట్టి వీధుల్లో పరుగెడుతూ 'ముస్లింలు ఈ దేశాన్ని వదిలి వెళ్ళాలి, లేకుంటే ప్రతీకారం తీర్చుకుంటాం'అని వీరంగం వేయడాన్ని ప్రజలు దేశవ్యాప్తంగా చూశారు. ఐదు నెలల

క్రితం మోదీని ముఖ్యమంత్రిగా ఎంచుకుని బిజెపి నాయకులు గుజరాత్‌కి పంపారు. ఇప్పుడక్కడ రక్తపుటేరులు పారుతుంటే దాని ప్రకంపనలు బిజెపిలో స్పర్థలను రేపాయి. పార్టీలోని అతివాదులు ముఖ్యంగా సంఘ్ నాయకులు మోదీని వంద శాతం సమర్థించారు. ఈ మిలిటెంట్ హిందూత్వ పార్శ్వం బయటకు రావడంవల్ల బిజెపిని ఒక భిన్నమైన పార్టీగా గుర్తిస్తున్న లిబరల్ హిందూలు దూరమవుతారేమోనన్న ఆందోళన పార్టీలోని మితవాదుల్లో కలిగింది.

అలా అడ్డూ అదుపూ లేకుండా గుజరాత్‌లో మారణ కాండ కొనసాగడంతో విదేశీ ప్రభుత్వాలు ప్రధానమంత్రి కార్యాలయంపై ఒత్తిడి పెంచాయి. వాజ్‌పేయి సణగడం మొదలుపెట్టారు. (అంతకుమించి ఏమీ చేయలేకేమో) "మోదీకి, వాజ్‌పేయికి ఒకరంటే ఒకరికి పొసిగేదికాదు. వాజ్‌పేయి బ్రాహ్మణ స్వభావం, ఉన్నతమైన అభిరుచులు, కవిత్వం ఇవన్నీ మోదీకి వింతగా (బహుశా పనిరానివిగా అనిపించేదేమో)ఉండేవి. మోదీని వాజ్‌పేయి మొరటువాడిగా భావించేవాడు''అని మోదీకి సన్నిహితుడైన బిజెపి నాయకుడొకరు చెప్పారు. మోదీకి మారణకాండను అదుపు చేసే ఉద్దేశం లేదని వాజ్‌పేయి అర్థం చేసుకున్నాడు. అందుకే అతనిని ముఖ్యమంత్రి పదవినుంచి తొలగించాలనుకున్నారు. కాని తన ఉప ప్రధాని అద్వానీ, ఆర్ఎస్ఎస్ నాయకత్వం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తారని ఆయనకు తెలుసు.

బిజెపిలో మితవాదానికి ప్రాతినిధ్యం వహించే వర్గం నుంచి ఈ దాడులను బహిరంగంగా ఖండించిన వ్యక్తి శాంతకుమార్. అప్పటికి కేంద్ర మంత్రి వర్గంలో భాగంగా ఉన్న శాంతకుమార్ అంతకుముందు హిమాచల్ ప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశారు. గుజరాత్‌లో జరిగిన ఘటనలు తనను తీవ్రంగా బాధించాయని, తనకు చీదరపుట్టించాయని ఆయన బహిరంగంగా విమర్శించారు. "శవాలమీద ఓట్లు ఏరుకునేవారు హిందువులేకారు. గుజరాత్‌లో రక్తాన్ని పారించి హిందూత్వను సంఘటిత పరచాలనుకునేవారు హిందువులకు శత్రువులు."అని విస్పష్టంగా ప్రకటించారు. ఈ హింసాకాండకు పాల్పడినందుకు విహెచ్‌పి, భజరంగ్‌దళ్ మీద చర్యలు తీసుకోవాలని శాంతకుమార్ డిమాండ్ చేశారు.


శాంతకుమార్ వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ వర్గాల్లో తీవ్రమైన ఆగ్రహాన్ని కలిగించాయి. గోవాలో జరగబోయే బిజెపి కార్యవర్గ సమవేశానికి కొద్ది రోజుల ముందే శాంతకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీకి పార్టీలోని మితవాదులనుంచి ఎటువంటి అడ్డంకులు రానివ్వకూడదనుకుంది ఆర్ఎస్ఎస్. ముఖ్యమంత్రిగా మారిన తమ పూర్తి కాలపు ప్రచారక్‌ను ఆ పదవి నుంచి తొలగిస్తే ఒప్పుకోవడానికి సంఘ్ నాయకులు ఏమాత్రం

సిద్ధంగా లేరు. బిజెపి అధ్యక్షుడు జానా కృష్ణమూర్తి శాంతకుమార్‌ను పిలిపించి మందలించాడు. క్రమశిక్షణకు భంగం కలిగించిన పార్టీ సభ్యులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామని అద్వానీ ప్రకటించారు. శాంతకుమార్ నుంచి బలవంతంగా రెండు లిఖితపూర్వక క్షమాపణలు తీసుకున్నారు. ఒకటి జానా కృష్ణమూర్తిని ఉద్దేశించింది. మరొక క్షమాపణ లేఖను (విహెచ్‌పి చర్యలు హిందూ సమాజాన్ని మలిన పరిచేలా ఉన్నాయని వ్యాఖ్యానించినందుకుగానూ) విహెచ్‌పికి ఆర్‌ఎస్‌ఎస్ నుంచి ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తికి ఇప్పించారు.

పార్టీలోని మితవాద శిబిరానికి ఒక భయం పట్టుకుంది. ఈ దాడుల నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న ఏ పార్టీ అయినా మద్దతు ఉపసంహరించుకుంటే ప్రభుత్వం కుప్పకూలిపోతుందేమోనన్న ఆందోళన వారిని వెంటాడింది. అయితే ఈ వాదన ఆర్‌ఎస్‌ఎస్‌ను ఏమాత్రం కదిలించలేకపోయింది. "ఆర్‌ఎస్‌ఎస్‌లో శక్తివంతమైన నాయకుడు, బిజెపి మాజీ అధ్యక్షుడు అయిన కుశుభావ్ థాకరే మోదీ తరపున రంగంలోకి దిగారు. అవసరమైతే వాజ్‌పేయి ప్రభుత్వం పడిపోయినా సరే మోదీని సమర్థించాల్సిందేనని పార్టీలోని నాయకులకు చెప్పారు. పార్టీలో రెండు శిబిరాలు తమ ప్రయోజనాల కోసం లాబీయింగ్ చేశాయి. అయితే వాజ్‌పేయి శిబిరం మీద అద్వానీ, థాకరే, మోదీ, జైట్లీల శిబిరానిదే పైచేయి అయింది."అని ఆనాటి పార్టీ అంతర్గత పరిస్థితులను బిజెపి పూర్వ జాతీయ కార్యదర్శి ఒకరు నాకు వివరించారు.

పార్టీకి మద్దతు ఇచ్చిన ప్రాంతీయ, లౌకిక పార్టీలు (జనతాదళ్ యునైటెడ్–బీహార్, డిఎంకె–తమిళనాడు, తెలుగుదేశం–ఆంధ్ర ప్రదేశ్, తృణమూల్ కాంగ్రెస్–పశ్చిమ బెంగాల్) ఏవీ మద్దతు ఉపసంహరించుకోలేదు. దీనితో జాతీయ కార్యవర్గ సమావేశం (ఏప్రిల్12,2002)ప్రారంభమయ్యేనాటికే బిజెపిలోని మితవాదుల నోళ్ళను మూయించేశారు. మోదీ అనుకూల శక్తులను సవాలు చేయాలన్న ఆకాంక్ష ఇక వాజ్‌పేయిలో మిగల్లేదు. ఒకనెల ముందు మోదీ తొలగింపును కోరుకున్న మితవాద ప్రధాని ఇపుడు ఆర్‌ఎస్‌ఎస్ ముందు మోకరిల్లారు. గోవాలో జరిగిన కార్యవర్గ సమావేశంలో అతివాదుల పరిభాషను అరువు తెచ్చుకుని మోదీకి ప్రతిరూపంలా ఉపన్యసించారు. "ఇండోనేషియా, మలేషియాలాంటి ముస్లింలు ప్రధానంగా నివసించే దేశాల్లో వారు ఇతరులతో స్నేహంగానూ, ఐక్యతతోనూ జీవించాలనుకోవటం లేదు. సమాజంలో కలగలిసిపోయి బతకడంలేదు. వారికి శాంతియుతంగా ఉండాలన్న ఆకాంక్షలేదు... ఎవరూ మాకు లౌకికవాదం గురించి నీతులు చెప్పనక్కరలేదు. ముస్లింలు, క్రైస్తవులు అడుగుపెట్టకముందు నుంచే భారతదేశం లౌకిక దేశంగా ఉంది" అన్నారాయన.

బహుశా దేశ చరిత్రలోనే ప్రథమంగా ఒక ప్రధానమంత్రి ముఖ్యమంత్రి దారికి వచ్చిన సందర్భం ఇదేనేమో. అంతే ఆ తరువాత నుంచి మోదీకి వాజ్‌పేయి భయపడుతూనే ఉన్నారు. 2002డిసెంబరులో మోదీ తన మొదటి రాష్ట్ర ఎన్నికలకోసం ప్రచారం చేస్తున్నాడు. ఢిల్లీ నుంచి వాజ్‌పేయి, ఇతర రాజకీయ నాయకులెవరైనా రాదలచుకుంటే ఇప్పుడే వచ్చి వెళ్ళమని మోదీ పార్టీకి చెప్పాడు. ఎందుకంటే చివరలో ప్రచారానికి వచ్చి ఎన్నికల్లో గెలిపించామన్న ఖ్యాతిని వీళ్ళెవరూ పొందడం అతనికి ఇష్టం లేదు. అందులో ఎవరికీ భాగం ఇవ్వదలచుకోలేదు. “మోదీ అంటే వాజ్‌పేయి చాలా భయపడేవారు. అరుణ్‌జైట్లీ, ఉమా భారతితో కలిసి మేమంతా ఎన్నికల ప్రచారానికి విమానంలో వెళుతున్నాము.‘సాధారణంగా ప్రధానమంత్రితో జాతీయ నాయకుడో రాష్ట్రానికి వస్తుంటే ముఖ్యమంత్రి ముందే వచ్చి స్వాగతం పలకడానికి ఎదురు చూస్తూ ఉంటాడు. నాకోసం మోదీ రావడం సంగతి అలా ఉంచండి. బహిరంగసభలో ఏం మాట్లాడతాడోనని నా గుండె దడదడలాడుతోంది’అన్నారు వాజ్‌పేయి. అందరూ ఫక్కుమని నవ్వారు. వాజ్‌పేయి కూడా నవ్వేసినా ముఖంలో మాత్రం కలవరం అలానే ఉంది”అని బిజెపి నాయకుడొకరు చెప్పారు.



గుజరాత్ అల్లర్ల తర్వాత మోదీని ముఖ్యమంత్రి పదవి నుండి తప్పించాలన్న తన పథకాన్ని విరమించుకున్న నెలరోజుల తర్వాత మోదీతో అప్పటి ప్రధాని వాజ్‌పేయి.

మోదీ విజయం కేవలం ఒక్క వాజ్‌పేయినే అతని దారికి తెచ్చిందనుకుంటే పొరపాటు. ఈ గత దశాబ్దంలో అతను రెండు రాష్ట్ర ఎన్నికలు (ఇప్పటికి మూడు) గెలిచాడు. జాతీయ పార్టీ రెండుసార్లు ఓటమి పాలయింది. బిజెపి లోపల అతను విజయానికి ఒక ప్రమాణంగా నిలిచాడు. దీనివల్ల పార్టీలో గతంలో మితవాదులకున్న కొద్దిపాటి చోటు కూడా మిగలకుండాపోయింది.

దాదాపు గోవా జాతీయ కార్యవర్గ సమావేశం జరిగి పదేళ్ళు అయ్యాక ఈ సంవత్సరం మొదట్లో నేను శాంతకుమార్‌ను కలవడానికి వెళ్ళాను. మోదీ ఆరాధకుల బృందంలో ఇప్పుడు ఆయన కూడా చేరాడు. “గతం గత:, కానీ ఇప్పుడు గుజరాత్‌ను చూడండి. క్రితం నెలలో మోదీజీని కలిశాను. హిందూత్వను, అభివృద్ధిని కలగలిపి గుజరాత్‌లో మీరు చేసినదాన్ని నమూనాగా తీసుకుని దేశమంతటా మనం ఆచరణలో పెట్టాలని ఆయనతో చెప్పాను. ఆయన సాధించినది అపూర్వమైనది. గుజరాత్‌లో మోదీ సాధించింది ఏదో ఒకనాటికి దేశమంతటా సాధిస్తాం”అని శాంతకుమార్ నాతో చెప్పారు.

ఈ శీతాకాలం ఒక నులివెచ్చని రోజున(2011-12శీతాకాలం) గుల్బర్గ్ సొసైటీ శిథిలాల నడుమ తిరుగాడాను. రణగొణధ్వనులతో కూడిన ప్రధాన వీధి నుంచి కొద్దిగా పక్కకు మళ్ళితే అక్కడ గుల్బర్గ్ సొసైటీ మొదట్లో ఒక ఇనుప గేటు ఉంది. అది దాని గోడ నుంచి ఊడి కొద్దిగా వాలుగా ఒరిగి పడిపోవటానికి సిద్ధంగా ఉన్న చెట్టులా ఉంది. దాన్ని దాటి లోపలికి వెళితే వరుస వీధులు. ఆ వీధులకు రెండు వైపులా మనుషులు లేక పాడుబడి శిథిలమయిన రెండంతస్తుల భవనాలు. వాటిలో వేటికీ కిటికీలు కానీ, తలుపులు కానీ లేవు. మల మూత్రాల దుర్వాసనకు కడుపులో తిప్పేసింది. జాఫ్రీ ఇల్లు ప్రధాన ద్వారానికి అతి దగ్గరలో ఉంది. కాగితం పూల చెట్లు అడ్డదిడ్డంగా పెరిగి ఉన్నాయి. లోపల గోడలంతా పొగచూరిపోయి నల్లరంగు పూసినట్లున్నాయి. హాల్లోకి వెళ్ళేసరికి ఒక కుక్క పెద్దగా మొరిగింది. నాలుగు పిల్లలకు పాలిస్తున్న ఆ కుక్క లేచినిలబడి నావైపు చూస్తూ అరుస్తోంది. కాగితం పూల చెట్ల తుప్పలు, ముళ్ళు మరోవైపు విరిగిపడిన ఇటుకల కుప్పలు...వాటి మధ్యగా దాటుకుంటూ పై అంతస్తుకు వెళ్లాను. ప్రతి గదీ చూశాను. దయ్యాలు తిరుగాడుతున్న బూత్ బంగ్లాలా ఉందది. కొద్ది గంటల్లోనో, క్షణాల్లోనో అత్యంత కిరాతకంగా హత్యకు గురికాబోతున్న ఒక సమూహపు నిస్సహాయత, భయాందోళనల అవశేషాలను ఆ శిథిలమైన భవనపు గోడల్లో నేను చూడగలిగాను.



మారణకాండకు ఒక సాక్షీ భూతమయిన గుల్బర్గ్ సొసైటీ భవనం 2012లో. ముస్లిమ్ ఎగువ మధ్యతరగతి నివాస ప్రాంతమయిన ఇక్కడ 2002లో దాదాపు 70 మంది చంపివేయబడ్డారు.

కనివినీ ఎరుగని రీతిలో ఈ దారుణమారణ కాండ జరిగిన మరుసటి రోజు గుల్బర్గ్ సొసైటీనుంచి ఎముకలు, కాలని శవాలను నింపుకున్న ఒక ట్రక్కు దూదేశ్వర్‌లోని ముస్లిం స్మశానవాటికకు చేరింది. ఆ స్మశానవాటికలో పనులు చూసే హజ్రా బీవా అనే మహిళ ఇపుడు నలభైలలో ఉంది. నేను తనను కలిసినపుడు ఆ దుర్దినాన్ని గుర్తుకు తెచ్చుకుని వివరాలను అందించింది. ఆ రోజు మొత్తం 179 శవాలను పూడ్చారట. ఓ అతి పెద్ద గుంతను తవ్వి అందర్నీ ఒకే చోట ఖననం చేశారట. “ఒక గుల్బర్గ్ సొసైటీ నుంచే కాదు, చాలా ప్రాంతాల నుంచి ఆరోజు అలాంటి ట్రక్కులు వచ్చాయి. మా అబ్బాయి అప్పటికి చాలా చిన్నవాడు. భూకంపం వచ్చిందా అని అడిగాడు. అవునన్నాను.”అని చెప్పిందామె.

ఐదవ భాగం

ఒక అతివాద రాజకీయ నాయకుడి అవతారాన్ని మరుగునపరిచి తనను తాను ఒక సరికొత్త రూపంలో జనం ముందుకు తెచ్చుకోవాలనుకున్న మోదీకి ఆ అవకాశం అక్టోబర్ 2008లో వచ్చింది. టాటా వారి నానో కార్ల ప్రాజెక్టు రూపంలో. వ్యాపార అనుకూలుడిగా, వికాస(అభివృద్ధి) పురుషుడిగా తనను ప్రతిష్టించుకునే ప్రక్రియలో మోదీకి



సానంద్‌లోని నానో కర్మాగారం. టాటాలు గుజరాత్‌కి రావడం, అభివృద్ధి నేతగా మోదీ ప్రతిష్టకు దోహదపడింది.

ఇది ఒక కీలకమైన మలుపులా ఉపయోగపడింది. అక్టోబరు మూడున రతన్ టాటా పశ్చిమ బెంగాల్‌లోని సింగూరులో నానో కార్ల ఫ్యాక్టరీ మూసేస్తున్నానని ప్రకటించారు. పరిహారం కోసం ఉద్యమించే రైతులతో ఒక ఒప్పందానికి రాలేకపోడంతో మూయక తప్పలేదు. నాలుగు రోజుల తరువాత రతన్‌టాటా నానో కార్ల ప్రాజెక్టును గుజరాత్‌కి తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. నానో కారు వస్తూ వస్తూ మోదీకి అంతులేని ప్రచారాన్ని చేసుకునే అవకాశాన్ని కూడా తెచ్చి ఇచ్చింది. మోదీ గుజరాత్‌లో చేసిన ప్రతి ఉపన్యాసంలోనూ నానోని గుజరాత్‌కి తీసుకువచ్చిన వైనాన్ని వివరించేవాడు. "పశ్చిమబెంగాల్‌లో నానో ప్లాంట్‌ను మూసేస్తున్నామని ప్రకటించగానే 'గుజరాత్‌కి స్వాగతం' అని టాటాకు ఒక ఎస్‌ఎంఎస్ పంపించాను అంతే. పని జరిగిపోయింది." అని చెప్పేవాడు.

నానో ఫ్యాక్టరీని తమ ప్రాంతంలో పెట్టుకోమని ఇంకో నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రతన్ టాటాను ఆహ్వానించాయి. అయితే మోదీ ఇచ్చినన్ని తాయిలాలు ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. "గుజరాత్ ముఖ్యమంత్రి అతి వేగంగా స్పందించి రంగంలోకి దిగారు. మిగిలిన రాష్ట్రాలు కూడా ఈ ఫ్యాక్టరీ కావాలని ముందుకు వచ్చినా అక్కడ పరిష్కరించాల్సిన సమస్యలెన్నో ఉన్నాయి. అందుకే మేము గుజరాత్‌ని ఎంచుకున్నాం. అంతా సవ్యంగా జరిగిపోయింది."అని టైమ్స్ ఆఫ్ ఇండియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రతన్‌టాటా చెప్పారు. పదిరోజుల్లోనే ఒప్పందంపై సంతకాలు జరిగిపోయాయి. ఈ ప్రాజెక్టు కోసం మోదీ టాటాకు అత్యంత ఉదారంగా సదుపాయాలు కల్పించారు. మినహాయింపులు ఇచ్చారు. ఇరవై ఏళ్ళపాటు ప్రభుత్వానికి పన్ను కట్టనక్కరలేదు. దాన్ని రుణంగా భావించి ఆ రుణాన్ని ఇరవై ఏళ్ళ తరువాత, 10.1శాతం వడ్డీతో తిరిగి చెల్లించడం ప్రారంభించాలి. టాటా చెల్లించాల్సిన పన్ను మొత్తం ఎంత ఉంటుందో ముందే లెక్కించలేము. కానీ ఈ అత్యంత అనుకూలమైన రుణ సదుపాయం వల్ల కంపెనీ తొలుత పెట్టిన పెట్టుబడి (2,200 కోట్లు)కి ఎన్నో రెట్లు ధనాన్ని అది మిగుల్చుకోగలుగుతుందని చెప్పవచ్చు. టాటా కంపెనీకి గుజరాత్ ప్రభుత్వం రెండుచోట్ల భూమిని చూపించింది. అందులో సానంద్‌ని ఎంచుకున్నారు. అయితే సానంద్‌లోని ఆ భూమికి ప్రధాన రహదారికి మధ్య కొంత వ్యవసాయ భూమి ఉంది. దానిని రైతుల నుంచి కొనుగోలు చేసి ఇమ్మని టాటా మోటర్స్ కంపెనీ కోరింది. మోదీకి ఇదేమంత కష్టంగా అనిపించలేదు. పశ్చిమబెంగాల్‌లోలా కాక తను మరింత చాతుర్యంతో వ్యవహారాన్ని పూర్తి చేయగలనని అతనికి తెలుసు. కాని అప్పుడున్న పరిస్థితుల్లో రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత వచ్చినా అది తనకి తల కొట్టేసినట్టవుతుంది. కాబట్టి అతి జాగ్రత్తగా ముందుకు వెళ్ళాలన్నది కూడా అతనికి ఎరుకే.

ఆ వ్యవసాయభూమిలో అత్యధిక భాగం రవూబా వాఘేలా అనే స్థానిక కాంగెస్ పార్టీ నాయకుడిది. ఆయనే మిగిలిన రైతులకు కూడా ప్రాతినిధ్యం వహించి ప్రభుత్వంతో జరిగే సంప్రదింపుల్లో పాల్గొన్నారు. ఆయన తలచుకుంటే భూమిని ఇవ్వకుండా మోదీని ఇరుకున పెట్టి ఉండవచ్చు. అందుకే మోదీ యంత్రాంగం అత్యంత జాగురూకతతో వ్యవహారం నడిపింది. "మోదీ, టాటాలు సంయుక్తంగా ప్రకటన చేయడానికి ఒకరోజు ముందు వరకు మాకు, జిఐడిసి(గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కి మధ్య సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయి. వాళ్ళు ఇవ్వజూపిన ధరను మేము ఒప్పుకోలేదు. ఈ భూమి టాటా మోటార్స్ కోసం సేకరిస్తున్నామని మాకు చెప్పలేదు. ముఖ్యమంత్రి కార్యాలయంలోనుంచి ఆ మేరకు ఆదేశాలుండటంతో చివరి వరకూ జిఐడిసి ప్రతినిధి మహేశ్వర్ సాహూ టాటా మోటార్స్ పేరును మాకు వెల్లడించలేదు. రాత్రి పదింటి వరకూ చర్చలు నడుస్తూనే ఉన్నాయి. అప్పుడు ఆఖరి అస్త్రంగా మహేశ్వర్ 'రేపు రతన్ టాటా అహ్మదాబాద్‌కు వస్తున్నారు. ఈ భూమిని నానా ప్లాంట్ కోసమే సేకరిస్తున్నది, వాళ్ళకి ఎలాంటి సమస్యలూ రానివ్వద్దు'అని బతిమాలారు. అది విన్నాక మా సంతోషం అంతా ఇంతా కాదు. గుజరాతీయులకు, మిగిలిన వాళ్ళకు అదే తేడా. మాకు భూమి మీద అంతటి మమకారం ఉండదు. మా లెక్కలు వేరేగా ఉంటాయి. ఈ భూమిని అమ్మితే పక్కనున్న మా ఆస్తులకు విలువ బాగా పెరుగుతుంది కదా! అది ఆ మేరకు మాకు ప్రయోజనకరమే. ఒక గంటలోనే వీలైనంత మంచి ధర వచ్చేలా చూసుకుని ఒప్పందం కుదుర్చుకున్నాం"అని తనవైపు నుంచి జరిగిన కథను వివరించారు రవూబా వాఘేలా.

వాఘేలా టాటామోటార్స్‌కు ఆనుకుని ఉన్న తన 30 ఎకరాల భూమిని అమ్మిన వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆయనకు పిలుపు వచ్చింది. వాళ్ళిద్దరూ కలిసే రోజునే టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ సంచికలో "సానంద్ షావుకారు ఇంకాస్త ధనికుడయ్యాడు" అనేక పతాక శీర్షికతో వాఘేలాపై కథనం ప్రచురితమయ్యింది.

"నేను గదిలోకి వెళ్ళగానే మోదీ లేచి నిలబడి రవుబా బాయ్ మీ లక్ష్మిని నాకివ్వండి అంటూ ఆహ్వానించాడు. ' నాదృష్టి సానంద్‌పై పడింది. దీన్ని బాగా పెద్దది చేద్దాం. అందరూ అదిరిపోయేలా తీర్చిదిద్దాలి. ప్రపంచం అంతా వచ్చి చూడాలి'అన్నాడు."అని రవూబా వాఘేలా నాతోచెప్పారు.

నానో ఫ్యాక్టరీని రప్పించుకోవడానికి గుజరాత్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం నిజంగానే అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించింది. జూన్ 2010లో నానో

ప్లాంట్ ప్రారంభమయింది. తరువాత కొద్ది వారాలలోనే ఫోర్డ్, పీజియోట్ కార్ల సంస్థలు తమకి ఫ్యాక్టరీలు పెట్టుకోవడానికి స్థలం కేటాయించమని కోరాయి. జిఐడిసి 2,200 ఎకరాలను సేకరించి ఆ రెండు సంస్థలకు విశాలమైన భూమిని అప్పగించింది. టాటాకిచ్చిన లాంటి ఆర్థిక పరమైన రాయితీలు, సదుపాయాలు కూడా కల్పించింది. సానంద్‌లో భూ సేకరణకు రైతుల నుంచి నిరసన ఎదురైనా ఇస్తున్న పరిహారాన్ని పెంచడంతో అది సద్దుమణిగింది. టాటా నానో ఫ్యాక్టరీ పెట్టకముందు అక్కడ ఎకరం నేల ఖరీదు మూడు లక్షల రూపాయలు ఉండేది. జిఐడిసి కనీసం ముప్పై లక్షల రూపాయల చొప్పున ఖరారు చేసింది. రైతులకు భూమి అమ్మిన వారంలోపే చెక్కులు జారీ చేసింది.

సానంద్ 'విజయ గాథ' వికాస పురుషుడుగా మోదీ ఖ్యాతిని మరింత ముందుకు తీసుకువెళ్ళింది. ఓటర్లను, వ్యాపారస్థులను ఉద్దేశించి మోదీ చేసే ప్రసంగాలలో ఇది ఒక ప్రధాన భాగమైంది. కానీ ప్రభుత్వం తేదలచుకున్న ప్రతి పారిశ్రామిక ప్రాజెక్టు ఇలానే సాగిపోయిందనుకుంటే పొరపాటే. భావ్‌నగర్ జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో ఒక చిన్న పట్టణం మహువా. అక్కడ 2003లో మోదీ ప్రభుత్వం గుజరాత్‌లోని అతి పెద్ద పారిశ్రామిక కంపెనీలలో ఒకటైన నిర్మాకు సిమెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం 700ఎకరాలను కేటాయించింది. నిర్మా కంపెనీ వ్యవస్థాపకుడు కార్సన్ పటేల్ దాడులను నిలువరించనందుకు మోదీని విమర్శించిన సిఐఐకి వ్యతిరేకంగా మరో సంస్థను (రిజర్జంట్ గ్రూప్ ఆఫ్ గుజరాత్–ఆర్‌జిజి)ఏర్పాటు చేసిన వారిలో ఒకరు. నిర్మా సంస్థకు కేటాయించిన భూమిలో మూడొందల ఎకరాల చిత్తడి నేలలు, కొన్ని రిజర్వాయర్లు ఉన్నాయి. వాటిని యాభై వేలమంది రైతులు సాగు కోసం, పశుపోషణకు వినియోగించుకుంటున్నారు. అందుకే రైతులు ఆ ఒప్పందాన్ని వ్యతిరేకించారు. ప్రభుత్వం, నిర్మా గ్రూపు వారి ఫిర్యాదులను పెడచెవినపెట్టాయి. కానీ ఇతర ప్రాంతాలలోలా కాకుండా ఇక్కడ నిరసనలు ఊపందుకున్నాయి. మహువా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి శాసనసభ్యుడు డాక్టర్ కనూబాయి కల్సారియానే తమ పార్టీ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఈ ఉద్యమాన్ని నడిపించారు. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా ప్రభుత్వానికి రాసిన లేఖపై పదకొండువేల మందికి పైగా రైతులు తమ రక్తంతో సంతకాలు చేశారు. మహువా నుంచి అహ్మదాబాద్ వరకు ఐదువేలమంది రైతులు నాలుగు వందల కిలోమీటర్లు ఈ ఒప్పందాన్ని రద్దు చేయమని కోరుతూ పాదయాత్ర చేశారు.

ఆ భూమి బంజరు భూమి అని గుజరాత్ ప్రభుత్వమూ, నిర్మా గ్రూపు బుకాయించాయి. కానీ రైతులు పర్యావరణ, అటవీశాఖకు వారిచ్చిన అనుమతిని

పున:పరిశీలించమని విజ్ఞప్తి చేశారు. ఆ శాఖ ప్లాంటుకిచ్చిన అనుమతిని ఉపసంహరించుకుంది.

అభివృద్ధి పేరుతో ప్రతి ప్రాజెక్టును పై నుంచి రుద్దడమే ఎజెండాగా ఉన్న ప్రభుత్వంపై ఇదొక అరుదైన విజయమని రైతులు కొనియాడారు. అప్పటికి మూడుసార్లు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కల్సారియాను ఈ ఉద్యమానికి నేతృత్వం వహించినందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. గుర్తు తెలియని గూండాలు ఆయనపై దాడి చేశారు. కానీ ఆయనను గుజరాత్ రైతులు తమ ప్రతినిధిగా గుర్తించారు. ప్రజల ప్రయోజనాలను పణంగాపెట్టి భూమిని, ప్రజా ధనాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్న మోదీని తమ తరపునుంచి ప్రశ్నిస్తున్న నాయకుడుగా ఆయన రైతుల హృదయాలలో నిలిచిపోయాడు.

2002 దాడుల తర్వాత గుజరాత్ ప్రభుత్వ దుశ్చర్యలపై ఏ విమర్శ చేసినా దానిని గుజరాతీయులను అవమానించడంగానూ, గుజరాత్ మీద దాడి చేయడంగానూ చిత్రించడంలో మోదీ అత్యంత నైపుణ్యం ప్రదర్శించాడు. అందులో కొంత వరకు సఫలమయ్యాడు కూడా. అదే చాతుర్యాన్ని ఆ తర్వాత 'గుజరాత్ అభివృద్ధి కథనం'పై వచ్చే విమర్శలను ఎదుర్కోవడంలోనూ ప్రదర్శిస్తున్నాడు. కాకపోతే అంత బహిరంగంగా కాదు. పరోక్ష రూపాల్లో పని జరిగేలా చూసుకుంటున్నాడు. మీడియాకు గుజరాత్ ప్రభుత్వం మోదీ హయాంలో సాధించిన ఆర్థిక ప్రగతి, వేగంగా ఎదుగుతున్న నిర్మాణ రంగం, సమర్థ పాలన తదితర అంశాలపై నిరంతరం సానుకూల కథనాలను సరఫరా చేస్తూ ఉంది. మోదీ గుజరాత్‌ని దేశ ప్రజల ముందు అవసరాలకు మించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా ప్రదర్శించడానికి తాపత్రయ పడతాడు. 'గుజరాత్ అద్భుతం' గురించి జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో (బిజెనెస్ టుడే నుండి సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ వరకు)వచ్చిన ప్రతి వార్తా కథనంలోనూ ఈ విషయం ప్రస్తావనకు వచ్చేలా చూసుకున్నాడు.

కానీ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నడిచే రైతు సంఘానికి చెందిన రైతులే పదేళ్ళుగా తమ విద్యుత్ అవసరాలు తీర్చమంటూ ఆందోళన చేస్తున్నారు. ఈ పదేళ్ళలోనే (2000–2010) రైతులకు కేటాయిస్తున్న విద్యుత్ 43శాతం నుండి 21 శాతానికి పడిపోయిందని ప్రభుత్వ గణాంకాలను చూస్తే తెలుస్తుంది. సాగునీటి పంపులకు విద్యుత్ కనెక్షన్ల కోసం కనీసం 3,75,000మందికి పైగా రైతులు ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల జాతీయ సగటు కంటే అతికొద్దిగానే ఎక్కువ ఉంది. ఎన్నో దశాబ్దాలుగా పారిశ్రామికంగా ముందున్న ఆ రాష్ట్రానికి అదేమంత ఎక్కువ

కాదు. అంతకు రెండు దశాబ్దాలకంటే మోడీ పాలనలో ఉన్న దశాబ్దంలో ఎదుగుదల రేటు చెప్పుకోదగ్గ ఎక్కువగా లేదు. మోదీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో గుజరాత్ రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నట్లు చిత్రించేవాడు. కానీ నిజానికి 2000–2009 మధ్య కాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో గుజరాత్ దేశంలో నాలుగవ స్థానంలోఉంది. 2011నాటికి అది ఆరవ స్థానానికి పడిపోయింది. మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు గుజరాత్ కంటే ముందున్నాయి. మహారాష్ట్రకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గుజరాత్ కంటే కనీసం తొమ్మిదిరెట్లు ఎక్కువ వచ్చాయి.

గుజరాత్ ఆర్థిక ఎదుగుదల ఉన్న రాష్ట్రం అయినా పేదరిక నిర్మూలన రేటులో బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్ర ప్రదేశ్‌వంటి రాష్ట్రాల కంటే (ప్రణాళికా సంఘం నివేదికల ప్రకారం) వెనుకబడే ఉంది. సామాజిక సూచికల్లోనూ ఆ రాష్ట్రం వెనకబడిఉంది. గుజరాత్‌లో పోషకాహార లోపానికి గురవుతున్న పిల్లలు నలభైనాలుగు శాతం ఉన్నారు.(భారత మానవాభివృద్ధి నివేదిక 2011 ప్రకారం) ఇది ఉత్తర ప్రదేశ్ కంటే ఎక్కువ. ఈ గణాంకాలకు, మోదీకి వచ్చిన ఖ్యాతికి పొంతనలేదు. దీన్ని తరచి చూస్తే మనకు కొన్ని విషయాలు స్పష్టమవుతాయి. అందులో

ఒకటి: – అభివృద్ధి సాధకుడిగా, ఆర్థిక ప్రగతి కారకుడిగా మోదీకి వచ్చిన ఖ్యాతి అంతా కేవలం అతని ప్రజా సంబంధాల యంత్రాంగం అతి జాగ్రత్తగా నిర్మించిన ప్రచారోద్యమ ఫలితమే. మిగిలిన రాష్ట్రాలకన్నా ఎదుగుదలలోనూ, అభివృద్ధిలోనూ గుజరాత్ ఎంతో ముందుకు వెళ్ళిందన్నది అసత్యం. కానీ ఆ అసత్యాన్నే ఒక వాస్తవమన్నట్లు అతి సమర్థంగా ప్రచారంలో పెట్టి మోదీకి ఈ గుర్తింపును తెచ్చిపెట్టారు.

రెండు:– ప్రచారోద్యమ నిర్వహణతోపాటు సద్విమర్శలకు దురుద్దేశాలను ఆపాదించడం ద్వారా ఎవరూ తమను విమర్శించే సాహసం చేయకుండా చూసుకోవడం అనే పనిని వారు అత్యంత నేర్పుగా నిర్వహించారు. ఈ 'అభివృద్ధి కథనం'ను సవాలు చేసే సమాచారాన్ని ఎవరైనా ముందుకు తీసుకువచ్చారనుకోండి మోదీని, గుజరాతీయులను అపఖ్యాతి పాల్జేయడానికి సత్యాన్ని వక్రీకరిస్తున్నారని ఆ విమర్శకులపై వ్యూహాత్మకంగా దాడికి దిగుతారు. తమ ప్రచార హోరులో ఆ సమాచారం మరుగునపడిపోయేలాచేస్తారు.

ఆరవ భాగం

సెప్టెంబరు 12, 2011న మోదీ తన ట్విట్టర్ అకౌంట్‌లో 'గాడ్ ఈజ్ గ్రేట్' అని కృతజ్ఞతాపూర్వకంగా రాసుకున్నారు. అంతకు ముందు 2002 మత దాడులలో భాగమైన తొమ్మిది మారణ కాండ కేసులను విచారించడంకోసం ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ సిట్‌కే ఇషాన్ జాఫ్రీ హత్య కేసులో మోదీ ఎంతవరకూ



సెప్టెంబరు 2011లో అహ్మదాబాద్‌లో సద్భావనా దృశ్యం. మోదీకి ఒకవైపున బిజెపి నేత ఎల్.కె.అద్వానీ, మరోవైపు పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకాష్‌సింగ్ బాదల్

దోషో నిగ్గుతేల్చి ఆ నివేదికను గుజరాత్‌లోని కింది కోర్టుకు అందజేయమని సుప్రీం కోర్టు సూచించింది. సిట్ నివేదిక ఆధారంగా కింది కోర్టు మోదీపై కేసు నమోదు చేయాలా లేదా అని నిర్ణయిస్తుంది. నిజానికి ఇది ఏ విధంగానూ అతను నిర్దోషి అని తేల్చినట్లు కాదు. కాకపోతే సుప్రీం కోర్టు నుంచి ఇంతకంటే కఠినమైన ఆదేశాలొస్తాయేమోనని మోదీ భయపడ్డాడు.

2003లో మోదీని ఆధునిక నీరో అని వాఖ్యానించినట్లు ఈసారి కూడా ఏదో వాఖ్య చేసి ఉండవచ్చు. లేదా కేసును గుజరాత్ వెలుపలి న్యాయస్థానానికి బదలాయించి ఉండవచ్చు. అతనిని ముద్దాయిగా చేర్చి ఉండవచ్చు.

ఇవేవీ జరగనందునే అంత సంబరంగా భగవంతుని తలచుకున్నది. అంతేకాదు ఇక సరికొత్త ప్రచారానికి తెరదీసే తరుణం ఆసన్నమైందని కూడా మోదీ గ్రహించాడు. కోర్టు ఆదేశాలిచ్చిన ఐదు రోజుల తరువాత తన పుట్టిన రోజున సద్భావన పేరుతో మూడు రోజులు నిరాహార దీక్షను చేపట్టాడు. మోదీ ఊహించినట్లే సద్భావన నిరశనకు మీడియా ద్వారా విపరీతమైన ప్రచారం లభించింది. పదివేలమందిని కదిలించి ఈ సద్భావనకు హాజరయ్యేలా చూశారు. ఇక ప్రతి బిజెపి నాయకుడిని వేదిక మీదకు రప్పించుకుని తన పక్కన నిలబెట్టుకోడానికి మోదీ ఈ అవకాశాన్ని వాడుకున్నాడు. నిరాహార దీక్ష మొదటి రోజున దేశంలోని అన్ని వార్తా పత్రికల్లో దీనికి సంబంధించి పూర్తి పేజి ప్రకటనలు వచ్చాయి. ఆ ఉదయం చిరునవ్వులు విసురుతున్న మోదీ ముఖం అన్ని రాష్ట్రాల్లోని ఓటర్లను వారి వారి మాతృభాషలలో పలకరించింది. సద్భావన సందేశం అందించింది. తెలుగు, తమిళ, కన్నడ, హింది, బెంగాలీ, మరాఠి, ఉర్దూ, అస్సామీ, ఒరియా భాషల్లోని పత్రికల్లో ప్రకటనలు వచ్చాయి. అందుకైన ఖర్చునంతా గుజరాత్ రాష్ట్రం(ప్రభుత్వం) భరించింది.

ఆ నిరశన ముగింపు రోజున తాను ప్రతి జిల్లాలోనూ ఒకరోజు నిరాహార దీక్ష చేస్తానని మోదీ ప్రకటించాడు. దానితోపాటు రోడ్డు యాత్రలను కూడా చేస్తూ ఈ సంవత్సరాంతంలో జరగబోయే ఎన్నికలకు ప్రచారం చేశాడు. (ఆ ఎన్నికల్లో గెలిచాడు). 2011 నవంబరు చివరలో మహారాష్ట్ర సరిహద్దులో గిరిజనులు అధికంగా ఉండే ఒక కొండ ప్రాంత పట్టణం సోనాగడ్‌కు వెలుపల నిరశన జరుగుతుంటే దాన్ని చూడడానికి వెళ్ళాను. మోదీ రాక కోసం అని చదును చేసి పెట్టి ఉన్న పెద్ద వ్యవసాయ భూమిలో నిరశన వేదికను ఏర్పాటు చేశారు. దూరం నుంచి చూస్తే అదో జాతర జరుగుతున్న

ప్రదేశంలా కనిపించింది. సభా ప్రాంగణం వెలుపల 100 రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు నిలిపి ఉన్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ నిరసనకు హాజరయ్యేవారిని ఎక్కించుకు వచ్చాయవి. ఈ బస్సులకు కాస్త దూరంలో స్ట్రాబెరీ, జామ, మామిడి అంటు మొక్కలను నింపుకున్న ట్రక్కులు అనేకం ఉన్నాయి. ఆ మొక్కలను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వచ్చినవారందరికి పంపిణీ చేశారు. మోదీ నిరాహార దీక్షను చూడడానికి వచ్చిన పదివేలమంది కూర్చోవడానికి ఒక పెద్ద తెల్లటి గుడారం వేశారు. దూరాన వేదిక మీద ఉన్న మోదీ అందరికీ దగ్గరగా కనిపించేందుకు ప్లాస్మా టీవి స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. వేదిక మీద అరవైమంది నాయకులున్నారు. మధ్యలో మోదీ ఆలోచనలో మునిగిఉన్న ఒక తత్వవేత్త విగ్రహంలా కూర్చొని ఉన్నాడు. బొటనవేలు మీద గడ్డం అనించి కూర్చుని ఉన్న ఆ భంగిమలోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు రాజకీయ నాయకులు, మత పెద్దలు ఇస్తున్న ఉపన్యాసాలను మౌనంగా వింటూ ఉన్నాడు. ఆ ఉపన్యాసాల నిండా మోదీపై పొగడ్తలే. టీవి తెరలపై అతి దగ్గరగా కనిపిస్తున్న మోదీ ముఖం చూస్తే అక్కడ హాజరయిన వారిని అతి జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడని స్పష్టమవుతుంది. కాసేపు వెనుక కూర్చున్న తరువాత ముందు వరుసలో కూర్చుందామని లేచి వెళ్ళాను. వెనుక వరుసకి, ముందు వరుసకి మధ్య దూరం వంద మీటర్లు ఉంది. నడుస్తున్నంతసేపూ మోదీ చూపులు నావెన్నంటే ఉన్నట్లు అనిపించింది.

మోదీ రాష్ట్ర వ్యవహారాలను పూర్తిగా తన నియంత్రణలోనే ఉంచుకుంటాడు. అందుకోసం తరచూ కింది స్థాయి అధికారులను పిలిచి స్వయంగా ఆదేశాలను జారీ చేస్తుంటాడు. వారి నుంచి ఆరాలు తీసి సమాచారం సేకరిస్తాడు. పత్రిక విలేకరుల రాకపోకలు, చర్యల గురించి కూడా సహజంగానే తెలుసుకుంటూ ఉంటాడు. మోదీ నిజంగా అవివాహితుడు కాదని, అతనికి భార్య ఉందన్న విషయం మొదట 2002మేలో స్థానిక విలేకరుల దృష్టికి వచ్చింది. వాద్‌నగర్ పక్క గ్రామంలో మోదీ భార్య ఉంటోందన్న విషయాన్ని గాంధీనగర్‌కి చెందిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేకరి దర్శన్‌దేశాయ్ కనుక్కోగలిగాడు. ఒకరోజు తెల్లవారుజామునే బయలుదేరి జశోదాబెన్ ఉన్న బ్రాహమన్ వాడకి బయలుదేరి వెళ్ళాడు. ఆమెను కలుసుకున్నాడు. తన అన్న ప్రధాన ఉపాధ్యాయుడుగా ఉన్న ఒక ప్రాథమిక పాఠశాలలోనే ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. అయితే వారిద్దరూ ఇంటర్వ్యూ ఇవ్వడానికి భయపడ్డారు. స్థానిక ప్రజలను ఆరా తీశాడు. అతనలా ప్రశ్నించడం బాగాలేదని, వెంటనే ఊరు వదలి వెళ్ళిపొమ్మని స్థానిక బిజెపి నాయకులు దర్శన్ దేశాయ్‌పై ఒత్తిడి చేశారు.

"నాకు బాగా గుర్తు. ఇంటికి చేరి చెప్పులు విప్పానోలేదో నా సెల్‌ఫోన్ మోగింది. ఫోన్‌లో ఒకరు గుజరాతీలో ముఖ్యమంత్రి మీతో మాట్లాడాలనుకుంటున్నారు అని చెప్పారు. వెంటనే మోదీ అందుకుని నమస్కార్ అన్నాడు. మీ ఎజెండా ఏమిటని ప్రశ్నించాడు? మీరేమంటున్నారో నాకర్థం కావటంలేదన్నాను. 'నువ్వు నాకు వ్యతిరేకంగా చాలా రాశావు. మీ పత్రిక మోదీ మీటర్ (దాడులపై వరుస కథనాలను ఆ శీర్షికతో ఇచ్చింది) కూడా మొదలెట్టింది. అయినా నేను మౌనంగానే ఉన్నాను. నువ్వివాళ ఏమి చేశావో నాకు తెలుసు. మరీ హద్దులు దాటి వెళుతున్నావు. అందుకే నీ ఎజెండా ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నాను' అన్నాడు. నేను భయపడలేదు కానీ కాస్త తొట్రుపాటుకు లోనయ్యాను. 'నాకు ఏజెండా లేదు. మా ఎడిటర్‌తో మాట్లాడుకోండి' అన్నాను. 'సరే మరోసారి ఆలోచించు' అంటూ ఫోన్ పెట్టేశాడు." ఓ విలేకరిగా మోదీతో తన అనుభవాన్ని వివరించాడు దర్శన్ దేశాయ్.

నేను గత కొద్ది నెలలుగా మోదీ ఇంటర్వ్యూకోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. మోదీకి చాలా ఉత్తరాలు రాశాను. బదులు రాలేదు. అతని ప్రజా సంబంధాల అధికారి (పిఆర్ఒ) జగదీశ్ టక్కర్‌తో మాట్లాడితే "ఆయన అపాయింట్‌మెంట్ దొరకడం చాలా కష్టమని మీకు తెలుసు. ఎవరితో మాట్లాడాలో తానే స్వయంగా ఎంచుకుంటారు' అని చెప్పారు. అయినా నా ప్రయత్నాలు కొనసాగించాను. మోదీ చైనాలోఉన్నప్పుడు, పోర్ బందర్‌లో నిరశన చేసినపుడు కూడా జగదీశ్‌తో మాట్లాడాను. "నేను మీరడిగిన ప్రతిసారీ మోదీకి తెలియజేశాను. మీరు ప్రయత్నిస్తున్నారని ఆయనకు తెలుసు. మీ ఉత్తరాలన్నీ చదివారు. కానీ నాకేమీ చెప్పలేదు" అని జగదీశ్ నాతో అన్నాడు. ఇప్పుడు సోన్‌గాద్‌కు వచ్చేముందు మరోసారి జగదీశ్‌కు ఫోన్ చేసి నేను మోదీ నిరశన సభకు హాజరవుతున్నానని, వీలైతే ఒక అరగంట సమయాన్ని నాకు కేటాయించమని మోదీని అడగమని చెప్పాను.

మోదీ పత్రికా విలేకరులతో మాట్లాడటం కంటే ఛానళ్ళకు ఇంటర్వ్యూలు ఇవ్వడానికే మొగ్గు చూపుతాడన్న అభిప్రాయం నాకుంది. దానిని మిగిలిన పాత్రికేయులు కూడా బలపరిచారు. సిఎన్ఎన్ ఐబిఎన్ ఛానల్‌కు ఇంటర్వ్యూలు చేసే కరణ్ థాపర్ పద్దెనిమిది నెలలపాటు క్రమం తప్పకుండా ప్రయత్నించిన తర్వాత కానీ ఇంటర్వ్యూ ఇవ్వడానికి మోదీ ఒప్పుకోలేదట. "దాదాపు ప్రతివారం మోదీకి ఉత్తరాలు రాసేవాడిని. అయినా మోదీ నుంచి స్పందన రాకపోతే అతని స్నేహితుడైన అరుణ్‌జైట్లీ దగ్గరకి

వెళ్ళాను. ఆయన మోదీని ఒప్పించాడు" అని నాతో థాపర్ చెప్పాడు. అంత ప్రయాసపడి ఒప్పించినా చివరకు అరగంటపాటు సాగాల్సిన ఇంటర్వ్యూ మూడు నిమిషాలతో ముగిసింది. ఒక పాలకుడిగా తాను కనపరిచిన నైపుణ్యానికి గానూ మోదీ అందుకున్న ప్రశంసలను గుర్తు చేస్తూ థాపర్ ఆ ఇంటర్వ్యూను ప్రారంభించారు. ఆ తరువాత తన తొలి ప్రశ్నను సంధిస్తూ "అయినప్పటికీ ప్రజలు ఇప్పటికీ మిమ్మల్ని ముఖానే నరహంతకుడు అంటున్నారు. మీకు ముస్లింలపై ద్వేషం, దురభిప్రాయాలు ఉన్నాయంటున్నారు. ఈ విమర్శల వల్ల మీకేమీ సమస్య లేదా'' అని అడిగారు. మోదీ ముఖం బిగుసుకుపోయింది. కోపంతో ఎర్రబడింది. పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని అదిమిపెట్టుకుని బదులివ్వడానికి ప్రయత్నించాడు. ఆగుతూ ఆగతూ ఒకటి రెండు వాక్యాలు మాట్లాడగలిగాడు. కొన్ని నిమిషాలకే తనకు కాస్త విరామం కావాలని అడిగాడు. కుర్తా అడుగున పెట్టిన మైక్‌ని తీసివేసి ఇంటర్వ్యూ ముగిస్తున్నానని ప్రకటించి లేచి వెళ్ళిపోయాడు. వెళుతూ వెళుతూ "నువ్విక్కడకు వచ్చావు, స్నేహం చేశావు. కానీ నీకు కొన్ని ఆలోచనలు, భావాలున్నాయి. వాటినే పదే పదే చెబుతూ వస్తున్నావు" అని థాపర్‌తో అన్నాడు. అర్ధాంతరంగా ముగిసిన ఆ ఇంటర్వ్యూనే సిఎన్ఎన్ ఐబిఎన్ ఛానల్ పదేపదే ప్రసారం చేసింది. 'ఇంటర్వ్యూ మధ్యలోనే లేచి వెళ్ళిపోయిన మోదీ' అన్న వార్తా కథనంగా అది ఆ రోజు ముప్పైమూడు సార్లు ప్రసారమయింది. మరుసటి రోజు మోదీ నుంచి థాపర్‌కు ఫోన్ వచ్చింది. "నా భుజాల మీద తుపాకిని ఉంచి కాల్చాలనుకుంటున్నావా? అని అడిగాడు. "ఇంటర్వ్యూ పూర్తి చేస్తే బాగుంటుందని అప్పుడే చెప్పాను కదా అని బదులిచ్చాను. ఆ తరువాత శాంతపడ్డట్లే అనిపించాడు. 'ఈసారి నేను ఢిల్లీ వచ్చినపుడు కలిసి భోజనం చేద్దాం' అన్నాడు. ఇంకో ఇంటర్వ్యూ ఇస్తానని హామీ కూడా ఇచ్చాడు. సంభాషణలో ఒక దశలో 'నువ్వంటే నాకిష్టం' అని కూడా అన్నాడు. (ఇది జరిగింది 2007లో) గత ఐదేళ్ళుగా ప్రతి ఆరువారాలకు ఒక ఉత్తరం పంపిస్తూనే ఉన్నాను. బదులే రాలేదు" అని చెప్పారు థాపర్.

ఇక సద్భావన సదస్సు వేదిక వైపు చూస్తే బిజెపి శాసనసభ్యులు, మంత్రులు నిలబడి జిల్లాలో ప్రజలకు మోదీ ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చారో, ఎన్ని బాలబడులను పెట్టారో, బోరు బావులను తెచ్చారో పదే పదే ప్రకటిస్తున్నారు. సభికులు (వారు కూడా దీక్షలోనే ఉన్నారు) సభ జరుగుతున్నంతసేపు మౌనంగా కూర్చుని ఉన్నారు. అప్పుడప్పుడు వేదిక మీదనుంచి ప్రకటన చేసే వ్యక్తి 'భారత్ మాతాకి జై,' 'గుజరాత్‌కి జై,' 'నరేంద్రమోదీ భాయ్‌కి జై' అని నినాదాలిస్తే కింది నుంచి సభికులు కూడా వంతపాడేవారు. వేదిక

మీద ఉన్న కొంతమంది మోదీని పొగుడుతూ ఒక పాట పాడారు. దాన్ని ఆ జిల్లా కలెక్టరు ఆర్ఎస్ పటేల్ రాశాడని ప్రకటించగానే సభికుల చప్పట్లతో ఆ ప్రాంతం మారుమోగింది. ఇలా కొన్ని గంటలపాటు స్థానిక నాయకులు తన భజన చేస్తుంటే అదంతా పట్టనట్లు ఏదో ఆలోచిస్తున్న భంగిమలో మోదీ మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత తనను కలవడానికి వరుసలో వస్తున్న ప్రజలను స్వాగతించడానికి లేచి నిలబడ్డాడు. మోదీని కలుస్తున్న సభికుల్లో ఉత్సుకత పెల్లుబికింది. వారిలో చాలామంది మోదీ కోసం ఏదో ఒక బహుమతి తీసుకువచ్చారు. శాలువాలు, పూలగుత్తులే కాదు. ఒకరు తను స్వయంగా గీసిన మోదీ చిత్తరువును బహుకరించారు. ఇద్దరు మహిళలు ఒక బట్టమీద రంగు రంగు దారాలతో మోదీ ముఖ చిత్రాన్ని ఎంబ్రాయిడరీ చేసి తెచ్చారు. సభికులందరిలో అతనిపట్ల ఆరాధన కొట్టొచ్చినట్లు కనిపించింది. మోదీ సాయంత్రం ఐదు గంటలకు దీక్ష ముగించిన తరువాతనే ప్రసంగిస్తాడని స్పష్టమయ్యాక నేనక్కడ నుంచి బయటకు వెళ్ళాలనుకున్నాను. ముందు వరుసలో ఉన్న నేను లేవగానే మోదీ చేయెత్తి నా దిశగా ఊపాడు. నన్ను ఉద్దేశించేనా, కాదేమోనన్న సందిగ్ధంలో ఒక క్షణం అలానే నిలబడ్డాను. మళ్ళీ ఊపాడు నా కోసమేనన్నట్లు. ఆ తరువాత జగదీశ్ టక్కర్ వైపుకి చూడగానే ఆయన వేదిక మీదకు వెళ్ళి మోకాళ్ళ మీద వంగి మోదీ నోటి దగ్గర తన చెవి పెట్టి విన్నాడు. రెండు నిమిషాలు కాగానే డెబ్బై ఏళ్ళకు పైబడ్డ జగదీశ్ టక్కర్ వేదిక మీద నుంచి నావైపుకు పరుగెత్తుకు వచ్చాడు. పరుగెత్తేటపుడు ఆయన కాళ్ళు వణకడం చూసి పడిపోతాడేమోనని భయం వేసింది. కానీ ఎలానో నన్ను చేరుకుని ఆసరా కోసం నా చేయి గట్టిగా పట్టుకున్నాడు. మోదీజి మీకు ఇంటర్వ్యూ ఇవ్వాలనుకుంటున్నారు. కానీ దీక్ష ఉంది కదా ఇవ్వాళ కుదరదు. శుక్రవారం గాంధీ నగర్‌లోని ఆయన ఆఫీసుకు రాగలరా? అని అడిగాడు. నేను మోదీకేసి చూశాను. అవునన్నట్లు తల ఊపాడు.

మోదీ ప్రసంగం మొదలయ్యే సమయానికి తిరిగి వచ్చాను. మంత్రులు మరోసారి ప్రశంసలు గుప్పించారు. మత పెద్దలు ఆశీర్వదించారు. ఆఖరున మోదీ లేచి భవిష్యత్తుకేసి చూస్తూ ప్రసంగం ప్రారంభించారు. ఈ జిల్లాకు రెండు వందల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని తన చేతుల్లోఉన్న కాగితం ముక్కల్లోకి చూసి మళ్ళీ జనం వైపు తిరిగి ప్రకటించాడు. ఒక కొత్త బ్రిడ్జి, అడవిలోకి రోడ్డు, రిజర్వాయర్....ఇలా చేయబోయే పనుల జాబితాను చదివాడు. ఆ తర్వాత వికాస్, వికా..స్, వికా........స్ అంటూ మంత్రాల్లా జపించాడు. "ప్రపంచం అభివృద్ధిని చూడాలనుకున్నపుడు గుజరాత్ కనిపించింది. ప్రపంచం గుజరాత్ గురించి తెలుసుకోవాలనుకున్నపుడు అభివృద్ధి గురించి తెలిసింది"అన్నాడు. ఆ తరువాత చేతులు కాస్త పైకెత్తి 'గుజరాత్ వికాస్! వికాస్ గుజరాత్!'

అని నాలుగైదుసార్లు అంటూ ఆ మాటలకు అనుగుణంగా చేతులను కుడి నుంచి ఎడమకి, ఎడమ నుంచి కుడికి ఊపాడు. తనను ఆరాధించే సభికుల ముందు మోదీ నాటకీయతతో కూడిన అద్భుతమైన ప్రదర్శనని ఇచ్చాడు. హావభావాల్లోనూ, స్వరంలోనూ అనువణువునా దృఢత్వం, ఆత్మ విశ్వాసం తొణకిసలాడాయి. వేరే మాటల్లో చెప్పాలంటే తమ అనుచరులకు తమ అందరి బాగోగులను చూసుకోగలడన్న ధీమాను ఇచ్చే నాయకుడిలా కనిపించాడు. ఆ ప్రసంగంలో ఆ మధ్య కాలంలో చేసి వచ్చిన చైనా పర్యటన గురించి వర్ణించాడు. వర్తక, వాణిజ్య స్పృహ అధికంగా ఉండే గుజరాతీల చెవులకు ఇంపుగా ఉండే విషయాలను ప్రస్తావించాడు. గుజరాత్ చేలల్లో పండుతున్న వంకాయ ఇప్పుడు యూరోప్‌కి ఎగుమతి అవుతోందన్నాడు. అంతర్జాతీయ కార్ల కంపెనీలు ఇక్కడ ఫ్యాక్టరీలు పెట్టడం కోసం పంపిన అభ్యర్థన లేఖలతో తన బల్ల సొరుగులు నిండిపోయాయన్నాడు. గుజరాత్‌లో ఏదైనా లోపం ఉందంటే అందుకు కేవలం తనకు సహకరించని ఢిల్లీ ప్రభుత్వాన్నే తప్పుపట్టాల్సి ఉంటుందన్నాడు. ఎలాంటి తడబాటు లేకుండా ఎదురుగా ఉన్న సభికుల మీదే దృష్టిని నిలిపి ఆశువుగా ప్రసంగించాడు. అతను మాట్లాడుతున్నంతసేపు ఆ గుడారంలో నిశ్శబ్దం రాజ్యమేలింది. పాలిథిన్ కవర్ల రాపిడి చప్పుడు కానీ, సెల్‌ఫోన్ల మోతలు కానీ ఒక క్షణం కూడా వినిపించలేదు. చాలా మంది నోరెళ్ళబెట్టి విన్నారు.

ఇలాంటి భక్త బృందంతో కూడిన సద్భావన దీక్షలొకపక్కా, జాతీయ స్థాయి ప్రచారోద్యమం మరోపక్క ఏక కాలంలో సాగాయి. ఇవి మోదీ భవిష్యత్ రాజకీయ లక్ష్యాలు ఎంత విస్తృతంగా ఉన్నాయో మనకు బోధపరుస్తాయి. మరోపక్క గుజరాత్‌లో ఆతను నిర్మించతలపెట్టిన అతిపెద్ద భవనాలు, ఆకాశాన్నంటే నిర్మాణాలు చూస్తే తన హయాంను భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా స్మారక చిహ్నాలను మిగిల్చాలన్న కోరిక అతనిలో ఎంతో బలీయంగా ఉందనిపిస్తుంది. నేనతని ప్రభుత్వంలో పనిచేస్తున్న కొంతమంది ఉన్నతాధికారులతో, సేవలందిస్తున్న భవన నిర్మాణ నిపుణులతో, మేనేజర్లతో మాట్లాడాను. ఆ ఇరవై మందిలో ఏ ఒక్కరూ కూడా తమ పేరును బయటికి వెల్లడించడానికి ఇష్టపడలేదు. మోదీకి తెలిస్తే తమకి వేధింపులు తప్పవని వారికి భయం. భవిష్యత్తులో కూడా అతనితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది కదా! ఇలా పనిచేస్తున్నవారిలో నిర్మాణాల రేఖా చిత్ర నిపుణులు (ఆర్కిటెక్ట్స్) కొందరు విదేశాల్లో పనిచేసి తిరిగొచ్చిన భారతీయులు. ఇంకొందరు చైనా నిర్మాణ కంపెనీలకు చెందిన ఇంజనీర్లు. మరికొందరు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఇంజనీర్లు. వీరంతా ఉన్నా గుజరాత్‌కి సంబంధించినంతవరకూ ఒకే ఒక్క ఆర్కిటెక్ట్ ఉన్నట్లు లెక్క. అతని మాటే ఆఖరిమాట. (అతని పేరు నరేంద్ర మోదీ)

'వైబ్రెంట్ గుజరాత్ 2007' సదస్సుకు కొన్ని వారాల ముందు మోదీ అహ్మదాబాద్‌లో చేపట్టనున్న 'నగర భారీ పునర్నిర్మాణ కార్యక్రమం' ప్రణాళికను ఆ సదస్సులో ప్రదర్శించాలని నిర్ణయించుకున్నాడు. ఆ కార్యక్రమం పేరు 'సబర్మతీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్' సబర్మతీ నదీ అహ్మదాబాద్ మధ్యగా పారుతుంది. ఈ ప్రాజెక్టు వల్ల నగరంలో నదీ తీరానికి ఇరుపక్కలా బస్తీల్లో నివాసముంటున్న పదివేలమందిని అక్కడి నుంచి తరిమేస్తారు. నదికిరుపక్కలా పన్నెండు కిలోమీటర్ల మేర విస్తరించిన ఐదు వందల ఎకరాల నివాస ప్రాంతాన్ని ఆ పేదల నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటారు. అక్కడ పార్కులు, విహార స్థలాలు, మార్కెట్లు, కార్యాలయాలు, వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. నిజానికి ఈ నదీ తీర పునర్నిర్మాణమన్నది మోదీ సొంత ఆలోచనకాదు. యాభై ఏళ్ళ క్రితానిది. అప్పట్లో ఇలానే నదికిరుపక్కలా ఉండే లండన్ ప్యారిస్ నగరాల నిర్మాణాలను చూసి స్ఫూర్తిపొందిన ఒక ఫ్రెంచి ఆర్కిటెక్ట్ చేసిన ప్రతిపాదన ఇది. అయితే కొన్ని దశాబ్దాలపాటు ఆ ప్రతిపాదన నిద్రావస్థలోనే ఉంది. 1990లలో ఒకసారి చర్చల్లోకి వచ్చింది. కానీ 2001లో భయంకరమైన భూకంపం వచ్చి గుజరాత్ జన జీవితాన్ని అతలాకుతలం చేయడంతో మళ్ళీ ఈ ప్రతిపాదనను పక్కన పెట్టారు. మతదాడుల తర్వాత దీనిలో మోదీ తనకు పనికొచ్చే ఒక అవకాశాన్ని చూశాడు. దాడుల తర్వాత "మోదీ తనను అభివృద్ధి అనుకూలుడిగా చూపించుకోవడం కోసం ఒక మార్గంగా చేపట్టిన తొలి ప్రాజెక్టుల్లో ఇదొకటి"అని ప్రాజెక్టు నిర్వహణలో భాగస్వామి అయిన ఒక అధికారి చెప్పారు. 'వైబ్రెంట్ గుజరాత్ 2007' సదస్సు నాటికి నదీ తీర పునర్నిర్మాణ ప్రాజెక్టుకున్న విస్తృతి గురించి ఎవరికీ పెద్దగా అంచనా లేదు. ఈ ప్రాజెక్టుకు చిత్ర రూపం ఇమ్మని మోదీ అందులో భాగస్వాములైన అధికారులను కోరారు. " నిర్మాణ రంగ నిపుణులు12 మీటర్ల పొడవు, నాలుగు మీటర్ల ఎత్తు ఉండే ఒక అతి పెద్ద కాన్వాస్ మీద ప్రాజెక్టు రేఖా చిత్రాన్ని గీసి ఇచ్చారు. దాన్ని నిలబెట్టడానికి 20మంది మోసుకురావాల్సి వచ్చింది. మోదీ వచ్చి చూశారు. అది సూక్ష్మ నమూనా కాదు. నిర్మాణ రంగ నిపుణులు నలుపు తెలుపులో గీసిన రేఖా చిత్రం. మధ్యలో నదిని మాత్రం నీలి రంగుతో ప్రస్ఫుటంగా కనిపించేలా చేశారు. ఈ రేఖా చిత్రాన్ని చూసిన ప్రతి ఒక్కరూ సంబరపడ్డారు ఒక్క మోదీ తప్ప. కాసేపు నిలబడి చూసి అసంతృప్తితో సణిగాడు. ఆ తర్వాత 'ఇది తెల్ల చీర కట్టిన వితంతువులా ఉంది, రంగులద్ది కాస్త శోభను తీసుకురండి' అని చెప్పి వెళ్ళాడు.

నిర్మాణ రంగ నిపుణులు "అతను అసలు నిపుణులు గీసే రేఖా చిత్రాల్ని అర్థం చేసుకోగలడా? అవంటే ఎమిటో, ఎలా ఉంటాయో తెలుసా?" అంటూ ఆగ్రహంతో

ఊగిపోయారు.'కానీ అతనే యజమాని, చెప్పింది ఎలానూ చేసి తీరాల్సిందే ఆ పనే చేద్దాం' అని నచ్చజెప్పాను. "ఆ రాత్రి ఆ అతిపెద్ద కాన్వాస్‌ను కిందికి దించి నలభైమంది చిత్రకారులతో పనిచేయించాము. అలా మోదీ కోరుకున్నట్లు 'వితంతువును' అలంకరించి దానికి గుజరాత్ పెళ్ళి కూతురి శోభను తీసుకువచ్చాము" అని వివరించారు ఆ అధికారి. "ఆ మనిషికి తనకేం కావాలో తెలుసు. ఎదురుగా ఉన్న నిపుణుడికి ఆ సూచనలెంత అసంబద్ధంగా అనిపించినా సరే మారు మాట్లాడకుండా పాటించాల్సిందే. అలా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన నిర్మాణ రంగం నిపుణులు, డిజైనర్లు కూడా అతనడిగింది చేసి ఇచ్చేస్తున్నారు." అని ముగించారు ఆ అధికారి.

అహ్మదాబాద్ 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బంజరు భూమిలో మోదీ తలపెట్టిన అత్యంత పెద్ద నిర్మాణ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. ఒక పెద్ద ఆర్థిక రాజధాని ఇంకా చెప్పాలంటే 'భారతదేశపు షాంఘై' అక్కడ పునాదుల నుండి నిర్మాణమవుతోంది. కొత్తగా వెలవబోతోంది. గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్-సిటీ లేదా సంక్షిప్తంగా గిఫ్ట్-సిటీ అని ఈ ప్రాజెక్టుకు నామకరణం చేశారు. ప్రాజెక్టు ప్రణాళిక ప్రకారం అక్కడ 886ఎకరాల స్థలంలో 124 ఆకాశాన్నంటే భవన సముదాయాలను నిర్మిస్తారు. వాటిలో మొత్తం 7,50,00,000 చదరపు అడుగుల కార్యాలయ స్థలం అందుబాటులో ఉంటుంది. ఇవి షాంఘై, టోక్యో, లండన్‌ల ఆర్థిక రాజధానులన్నింటిని కలిపిన దానికంటే ఎక్కువ. ఇప్పటి వరకూ ముంబయి ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఆర్థిక సంస్థలను ఆకర్షించి వాటిని 2017కల్లా గుజరాత్ నుంచి తమ కార్యకలాపాలను నిర్వహించుకునేలా చేయాలన్నది మోదీ లక్ష్యం. ట్రేడింగ్ కార్యకలాపాలు, కాపిటల్ మార్కెట్లు, బ్యాంకుల, ఇన్సూరెన్స్ సంస్థల కార్యకలాపాలు (బ్యాక్‌ఎండ్ ఆపరేషన్స్) సాఫ్ట్‌వేర్ డెవలపర్లు...వీటన్నింటితో భారతదేశంలో 2020 నాటికల్లా కోటీ పదిలక్షల మందికి ఉద్యోగాలు, 42,500కోట్ల డాలర్ల ఆర్థిక ప్రగతి లభిస్తుందని ఒక అంచనా. అందులో అతి పెద్ద భాగాన్ని గుజరాత్‌కి దక్కించుకోవాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. గిఫ్ట్-సిటీకి రేఖా చిత్రాలు గీయడం కోసం (రూపు కట్టడం కోసం) మోదీ 'ది ఈస్ట్ చైనా ఆర్కిటెక్చరల్ డిజైన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్'కు చెందిన ఇంజనీర్ల సేవలు తీసుకున్నారు. ఇప్పటి షాంఘైలో అధిక భాగానికి రేఖా చిత్రాలు గీసింది ఈ సంస్థే. "రేఖా చిత్రాల్లో ప్రతి చిన్న భాగం చైనా నుంచే వస్తుంది. మోదీకి వారిపైన అంతులేని గురి. ఆయన చైనా వెళ్ళినపుడు షాంఘై నగరం ఆయన్ని సమ్మోహితుడిని చేసింది. అచ్చుగుద్దినట్లు దాన్ని ఇక్కడ దించాలనుకుంటున్నాడు. ఆ గాజు గదుల ఎస్టేట్‌కు ప్రతిరూపంగానే ఈ

గిఫ్ట్–సిటీ రూపుదిద్దుకుంటోంది" అని మోదీ ప్రాజెక్టులో పనిచేసిన ఒక నిర్మాణ రంగ నిపుణుడు చెప్పాడు.

గిఫ్ట్–సిటీ ప్రాజెక్టు నిర్మాణం ప్రస్తుతం రెండో దశలో ఉంది. భూమిని చదును చేశారు. మొదటి రెండు శిఖర భవన నిర్మాణాల పని సాగుతోంది. అందులో ఐటి సాఫ్ట్‌వేర్ సంస్థలకు 20,00,000చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని సమకూర్చాలన్నది మోదీ లక్ష్యం. వచ్చే సంవత్సరాంతానికల్లా బెంగుళూరు, హైదరాబాద్‌ల నుంచి ఐటి సంస్థలను ఇక్కడికి రప్పించాలన్నది మోదీ ఉద్దేశం. ఆ తర్వాతి దశ నిర్మాణం పూర్తయ్యేసరికి



124 ఆకాశ హర్మ్యాలాలతో కూడిన గిఫ్ట్ సిటీ నమూనా

ముంబయి నుంచి ఆర్థిక సంస్థలను తీసుకురావాలనుకుంటున్నారు" అని ఒక ప్రాజెక్టు మేనేజరు చెప్పారు. తుది దశ నిర్మాణం మొదలయ్యేసరికి 10లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను ఈ స్థలంలో దించుతారు. భారతదేశ చరిత్రలోనే దీన్ని అతిపెద్ద నగరీకరణ ప్రాజెక్టుగా మలుస్తున్నారు. ఈ తుది దశలోనే మోదీ ఊహల్లోని అతి పెద్ద గాజు గదులు నేల మీద రూపు రేఖలు సంతరించుకునేది.

గిఫ్ట్–సిటీకి కేంద్ర భాగంగా నిలిచే డైమండ్ టవర్ అందులో ఒకటి. ఎనభై అంతస్థులు ఉండే ఈ శిఖర భవనం ఆకృతిలో 'కోసిన వజ్రపు ముక్క' బహు ముఖాలను పోలి ఉంటుంది. అందుకే ఆపేరు. ఇక రెండవది చుట్లు తిరిగిన పాము ఆకృతిలో

వెలిసే నాగా టవర్. "ఒక వైబ్రంట్ గుజరాత్ సదస్సులో ఈ ప్రాజెక్టు రేఖా చిత్రాన్ని చూసి నిర్ఘాంతపోయాను. అదేదో పరలోకంలా అనిపించింది. ఒక చక్రవర్తి 'పో! పోయి నాకొక రాజ్యాన్ని నిర్మించు!' అని అడిగితే ఆ పని చేస్తున్నట్లు అనిపిస్తోంది" ఒక నిర్మాణ రంగ నిపుణుడి మనోభావాలివి.

మోదీ కోసం పనిచేస్తున్న మరో నిపుణుడు ఇంకాస్త నాటకీయంగా తన అవస్థను వర్ణించాడు. "నేను ఆల్బర్ట్ స్పీర్‌నో రాబర్ట్ మోసెస్‌నో నాకే తెలీదు. రాబర్ట్ మోసెస్‌నే అయితే బాగుండు" అని అన్నాడు. రాబర్ట్ మోసెస్ న్యూయార్క్ నగరం ఈ ఆకృతి దాల్చడానికి ప్రధాన కారకుడైన నిర్మాణ రంగ నిపుణుడు. ఆయన చేసిన మార్పు చేర్పులకు ప్రభావితులైన న్యూయార్క్ వాసుల్లో అధికులు ఆయన్నొక శత్రువులా భావిస్తారు. ఇక ఆల్బర్ట్ స్పీర్ హిట్లర్‌కు పనిచేసిన భవన నిర్మాణ రంగ నిపుణుడు.

మోదీ చేపట్టిన నిర్మాణ ప్రాజెక్టుల్లో అత్యధిక భాగం భవిష్యత్‌లో జరగబోయే 'అభివృద్ధి'ని తన ఖాతాలో వేసుకోవడానికి ఉద్దేశించినవే. ఒక గాంధీ నగర్‌లో నిర్మిస్తున్న మహాత్మా మందిర్ మాత్రం అందుకు మినహాయింపు. అది గతాన్ని సొంతం చేసుకోడానికి చేస్తున్న ప్రయత్నమని నాకనిపించింది.



గాంధీనగర్‌లో మహాత్మా మందిర్. గాంధీజీకి ఇది మోదీ నివాళి. కిటికీలు లేని ఈ కాంక్రీట్ నిర్మాణం లోపల పలు సమావేశ మందిరాలు ఉంటాయి.

గాంధీకి నివాళిగా ఆ మందిర్‌ని నిర్మిస్తున్నానని మోదీ చెప్పాడు. లౌకిక జాతీయ వాదానికి నిలువెత్తు రూపంగా ఉన్న గాంధీని దాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన అతివాద హిందుత్వ సిద్ధాంతాన్ని ఆచరించే ఆర్ఎస్ఎస్‌వాది సొంతంచేసుకుని తన ప్రయోజనాలకు వాడుకోవాలనుకోవడం వింతగా అనిపించింది. అంతేకాదు మహాత్మా మందిర్ ఏ మూలా గాంధీ తత్వాన్ని ప్రతిబింబించలేదు. కాంక్రీట్‌తో చేసిన ఛరఖా, గాంధీ విగ్రహం ఉన్నాయనుకోండి. కానీ కిటికీలే లేని అతి పెద్ద బూడిద రంగు కట్టడమది. చూడడానికి ఒక పెద్ద సబ్బు పెట్టెలా ఉంది. లోపల వరుసగా కాన్ఫరెన్స్ హాళ్ళు, శబ్దం చొరబడని ఆడిటోరియంలు ఉన్నాయి. వైబ్రెంట్ గుజరాత్ వంటి సదస్సులు పెట్టుకుని వ్యాపార ఒప్పందాలు చేసుకోవడానికి అనువైన వేదికలుగా పనికొస్తాయవి. ఆ 'మందిర్'కి వెళ్ళిన రెండుసార్లూ నేనక్కడ చూసింది ఫైళ్ళు పట్టుకుని అటూ ఇటూ వడివడిగా తిరుగుతున్న వ్యాపారవేత్తలను మాత్రమే. వారితోపాటుగా కాపలాగాస్తున్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది కూడా కనిపించారనుకోండి.

నేను గాంధీనగర్‌లో ఉండగానే మోదీ తనను కలవడానికి రమ్మన్న తేది వచ్చింది. ఒకరోజు ముందే జగదీశ్ టక్కర్ కి ఫోన్ చేశాను. కొన్ని గంటల తర్వాత ఆయన ఫోన్ చేసి "క్షమించండి మోదీజి మిమ్మల్ని కలవలేనని చెప్పమన్నారు. ఏమనుకోవద్దు వీలు కాదు" అని చెప్పి పెట్టేశాడు. తర్వాత కొన్ని నెలలపాటు ఉత్తరాలు, ఎస్ఎంఎస్‌లు, ఫోన్ చేయడాలు...ఇలా నేను చేయని ప్రయత్నం లేదు. కానీ అటునుంచి స్పందన రాలేదు. కనీసం మోదీ మనసెందుకు మారిందో కూడా తెలియలేదు.

గుజరాత్‌కు చెందిన ఒక సీనియర్ పాత్రికేయుడు మాత్రం తన అనుభవంతో అందుకు కారణం ఏమై ఉండవచ్చో వివరించాడు. "సోన్‌గాద్‌లో ఉన్నపుడు నిజంగా నిన్ను కలవాలన్న ఉద్దేశం కనబరిస్తే కనుక తర్వాత ఇక్కడ నీ కార్యకలాపాలన్నింటి గురించి ఆరా తీసి ఉంటాడు. నువ్వెవరిని కలిశావో, ఎవరెవరి ఇంటర్వ్యూలు తీసుకున్నావో అతనికి సమాచారం చేరి ఉంటుంది" అన్నాడు. 'గోర్ధాన్ జడాఫియా లాంటి వ్యక్తులను ఏమైనా కలిశావా' అని ఆ జర్నలిస్టు ఆడిగాడు. అవునన్నాను. 'ఇంకేం కచ్చితంగా అతనికి కోపం వచ్చిఉంటుంది. ఇంకా దాడుల యాత్రకూడా చేశావా?' అని అడిగాడు. "అంటే దాడుల వల్ల విధ్వంసం అయిన ప్రాంతాలను చూసి రావడమేనా? వాటినయితే చూసి వచ్చాను." అని చెప్పాను.

"నువ్వు మోదీ గురించి రాయదలచుకుంటే నేరుగా అతనిని కలిసి చెప్పింది రాసుకోవాలి. ఇలా గుజరాత్‌లో మకాం వేసి అందర్ని కలవకూడదు. అలా చేస్తే మోదీ దృష్టిలో నీవొక కుహనా లౌకికవాదివి. తనకు వ్యతిరేకంగా నీలో దురభిప్రాయాలున్నాయన్న నిర్ధారణకు వస్తాడు. ఇక నీకెందుకు ఇంటర్వ్యూ ఇస్తాడు?,"అన్నాడా జర్నలిస్టు.

ఏడవ భాగం

2002 మత హింస జరిగినప్పుడు గోర్దాన్ జడాఫియా హోం శాఖలో సహాయ మంత్రిగా ఉన్నారు. మోదీలాగానే ఆయన కూడా 2002 దాడులలో జరిగిన హింసలో భాగస్వామి అయినందుకు ముద్దాయిగా నిలబడ్డాడు. పదిహేనేళ్ళపాటు ఆర్ఎస్ఎస్ నాయకుడిగాఉన్న జడాఫియా ఆ తరువాత 1990లలో బిజెపిలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా అయ్యారు. పార్టీలో మోదీ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా మాట్లాడిన ముగ్గురు ప్రముఖ నాయకులలో జడాఫియా ఒకరు. మిగిలిన ఇద్దరూ హరేన్ పాండ్యా, సంజయ్ జోషిలు. ఈ ముగ్గురు నూరు శాతం ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారే



2007లో మోదీ నుండి విడిపోయిన రాష్ట్ర డిప్యూటీ హోంమంత్రి గోర్ధాన్ జడాఫియా (కుడివైపు)

కావడం విశేషం. హరేన్ పాండ్యా మోదీ ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రిగా పనిచేశారు. ఆయన్ని 2003లో అనుమానాస్పద పరిస్థితుల్లో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఇక సంజయ్ జోషి బిజెపి జాతీయ కార్యదర్శి. ఆయన నగ్నంగా ఉన్న మహిళలతో కలిసి ఉన్న సిడి ఒకటి బిజెపి అగ్రనాయకులకు గుర్తు తెలియని వ్యక్తులు అందజేశారు. దీంతో జోషి పార్టీ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆ సిడి కల్పితమైనదని, ఆ సంఘటన వాస్తవమైనది కాదని తేలింది. ఇక జడాఫియాను 2002 చివరికల్లా మంత్రి వర్గంనుంచి బయటికి నెట్టేశారు. ఆ తరువాత పార్టీ నుంచి కూడా.

"మోదీ అర్థం చేసుకోగల అక్షరం ఒక్కటే. అది 'I'(నేను). నన్ను చంపేస్తానని మోదీ స్వయంగా బెదిరించారు." అని జడాఫియా నాతో చెప్పారు. "అది ఫిబ్రవరి 2005లో జరిగింది. రాష్ట్ర నిఘా విభాగపు మనిషి ఒకరు నిరంతరం అనుసరిస్తుండడం గమనించాను. అతన్ని నిలదీస్తే హోం శాఖా మంత్రి కార్యాలయం నుంచి తనకు నన్ను వెంబడించమన్న ఆదేశాలున్నాయని చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత రాష్ట్ర బిజెపి శాసనసభ్యుల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో 'నరేంద్రభాయ్! నీ సొంత పార్టీ శాసనసభ్యుల మీదే నిఘా కార్యకలాపాలు చేస్తున్నావ్. ఏం పని ఇది? ఎందుకు చేస్తున్నావ్? అని అడిగాను. సీనియర్ మంత్రి వజూబాయ్ వెంటనే మైక్ అందుకుని 'సరే గోర్దాన్ భాయ్, శాంతించు దీని గురించి మేమాలోచిస్తాం. కానీ ఇప్పుడు అడగాల్సిన ప్రశ్న కాదిది.' అన్నారు. ఇది జరుగుతున్నంత సేపు మోదీ నోరెత్తలేదు. కానీ అతని కార్యదర్శి నుంచి 'దయచేసి ఒకసారి ముఖ్యమంత్రిని కలవండి' అన్న సందేశం వచ్చింది.

సమావేశం తరువాత ముఖ్యమంత్రి గదికెళ్ళి ఆయన్ని కలిశాను. ఉపముఖ్యమంత్రి అమిత్‌షా కూడా కూర్చుని ఉన్నారు. 'ఇలాంటి ప్రశ్నలు బహిరంగంగా ఎందుకు అడుగుతున్నావ్?' అని మోదీ నన్ను ప్రశ్నించాడు. 'నేనేం చేయాలి? ఇదేమీ దాచుకోవాల్సిన వ్యక్తిగతమైన వ్యవహారం కాదు కదా' అన్నాను. నా కళ్ళలోకి కఠినంగా చూస్తూ "ఖతం అయిపోతావ్ గోర్దాన్ బాయ్" అన్నాడు.

"ఎలాంటి అంతమది? రాజకీయంగానా? భౌతికంగానా?' అని అడిగాను.

"నాకు వ్యతిరేకంగా ఢిల్లీలో అద్వానీకి, ఓం మాథుర్‌కి ఫిర్యాదు చేశావు' అన్నాడు. "ఔను నాకు వేరే దారేమిఉంది? కానీ నువ్వు చెబుతున్నది నన్ను అంతం చేస్తానని కనుక అయితే ఒక మాట విను. ఆ సమయం వస్తే ఎలానూ చనిపోతాను. నున్న బెదిరించడానికి ప్రయత్నించకు అని చెప్పాను" అంటూ జరిగింది వివరించాడు జడాఫియా. ఇప్పుడు జడాఫియాకి పన్నెండుమంది సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు ఇరవైనాలుగ్గంటలూ వెన్నంటే ఉంటారు. మాజీ హోం శాఖా సహాయ మంత్రి అయిన జడాఫియాకు ప్రభుత్వమే దాడుల తర్వాత రక్షణ కల్పించింది. హరేన్ పాండ్యాకి మాత్రం భద్రతా సిబ్బంది వెంట ఉండేవారు కాదు. "హరేన్ ధైర్యశాలి. తనకేమి కాదని అనుకునేవారు. అదే తప్పయింది" అన్నాడు జడాఫియా.

"హరేన్ పాండ్యా బ్రాహ్మణుడు. ఎత్తుగా అందంగా ఉండేవాడు. ఆర్ఎస్ఎస్ వారసత్వం ఉంది. పైగా మీడియాతో మంచి సంబంధాలున్నాయి. రాష్ట్ర బిజెపిలో మోదీకి అత్యంత బలమైన ప్రత్యర్థి హరేన్. వారిద్దరూ మొదటిసారి 2001లో బహిరంగంగా తలపడ్డారు. మోదీ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎన్నికలలో నిలబడడానికి ఒక సురక్షితమైన నియోజకవర్గం కోసం చూస్తున్నపుడు అతని దృష్టి హరేన్ నియోజవర్గమైన ఎల్లిస్ బ్రిడ్జి మీద పడింది. పాండ్యా మోదీకి లొంగలేదు."నన్నెవరైనా యువకుడి కోసం ఖాళీ చేయమనండి, చేస్తాను. కానీ అతనికోసం మాత్రం చెయ్యను" అని హరేన్ అన్నాడు.

మే 2002లో అంటే దాడులు మొదలైన మూడునెలల తర్వాత పాండ్యా జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్ నేతృత్వంలో అహ్మదాబాద్‌కి వచ్చిన ఒక స్వతంత్ర నిజ నిర్ధారణ కమిషన్ ముందు రహస్యంగా హాజరయి సాక్ష్యం చెప్పాడు. పాండ్యా ఆ కమిటీకి ఏం చెప్పాడో మోదీకి తెలిసుండకపోవచ్చు. కాని మోదీ ప్రధాన కార్యదర్శి పి.కె.మిశ్రా రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగపు సెక్రటరీ జనరల్‌కు పాండ్యా కదలికలపై నిఘా వేయమని ఆదేశాలిచ్చాడని ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన కొన్ని లిఖిత నివేదికలను బట్టి తెలుస్తోంది. మరీ ముఖ్యంగా హరేన్ పాండ్యా నిజ నిర్ధారణ కమిషన్ ముందుకు వెళతారేమో గమనించాలని ఆదేశాలున్నాయి. ఇంటెలిజెన్స్ డైరెక్టర్ ఎప్పటికప్పుడు ఆ ఆదేశాలను రిజిస్టర్‌లో నమోదు చేశారు. అందులో తేదీల వారీగా ఇలా రాసి ఉంది.

జూన్ 7, 2002 : డాక్టర్ పి.కె.మిశ్రా ఈ విషయంతో (నిజనిర్ధారణ కమిషన్‌తో) సంబంధం ఉన్న మంత్రి హరేన్ పాండ్యానేమోనన్న అనుమానం ఉందని చెప్పారు. ఆ తర్వాత ఒక ఫోన్ నెంబర్ (9824030629) ఇచ్చారు. దానికి ఏ నెంబర్ల నుంచి ఫోన్లు వచ్చాయో, దాని నుంచి ఎవరెవరికి ఫోన్లు వెళ్ళాయో తెలుసుకోమన్నారు.

జూన్ 12, 2002 : వి. ఆర్.కృష్ణయ్యర్ విచారణ కమిషన్‌ని కలిశారని అనుమానిస్తున్న మంత్రి హరేన్ పాండ్యానే అని తెలిసిందని పి.కె.మిశ్రాకు సమాచారం అందించాం. ఈ విషయం సున్నితమైనది. పైగా నిబంధనల ప్రకారం మా విధుల పరిధిలోకి రానందున దీనిపై ఎలాంటి సమాచారాన్ని అధికారికంగాను, లిఖితపూర్వకంగాను ఇవ్వలేమని పి.కె.మిశ్రాకు తెలియజేశాం. ఆ టెలిఫోన్ నెంబర్ (9824030629) హరేన్ పాండ్యాదేనని తెలిసింది.

ఆ తర్వాత దీనికి సంబంధించిన వార్తాకథనాలు వచ్చాయి. వాటి ప్రకారం... ఒక మంత్రి వి.ఆర్.కృష్ణయ్యర్ నిజ నిర్ధారణ కమిషన్ ముందు హాజరయ్యారు. గోద్రాలో రైలు బోగీలు తగలబడిన సంఘటన జరిగిన రాత్రి మోదీ ఇంట్లో జరిగిన సమావేశపు వివరాలను ఆ మంత్రి వెల్లడించారు. అవి అప్పుడే తొలిసారిగా వెలుగులోకి వచ్చాయి. ఆ సమావేశంలో మోదీ మరుసటి రోజు గోద్రాకు తగిన న్యాయం జరగబోతోందని, హిందువుల 'ప్రతిఘటన'కు మధ్యలో పోలీసులు అడ్డురాకుండా చూడమని తన ప్రభుత్వంలో పనిచేస్తున్న పోలీసు ఉన్నతాధికారులకు, ఇంటెలిజెన్స్ విభాగపు అధికారులకు ఆదేశాలిచ్చాడు.

ఈ కథనాలు పాండ్యా మీద క్రమశిక్షణ చర్య తీసుకోమని పార్టీలో ఒత్తిడి తెచ్చేందుకు మోదీకి కావలసిన సాక్ష్యాన్ని సమకూర్చిపెట్టాయి. రెండునెలల తర్వాత పాండ్యాతో బలవంతంగా మంత్రి పదవికి రాజీనామా ఇప్పించారు. మోదీ అక్కడితో ఆగలేదు. డిసెంబర్ 2002లో జరిగే రాష్ట్ర ఎన్నికలలో ఎల్లిస్‌బ్రిడ్జి సీటును హరేన్ పాండ్యాకు ఇవ్వడానికి నిరాకరించాడు. గతంలో ఆ సీటునే పాండ్యా ఖాళీ చేయనన్నది. "మోదీ ఎప్పటికీ జరిగింది మర్చిపోడు. ఎవరినీ క్షమించడు. కానీ ఒక రాజకీయ నాయకుడికి అంతటి దీర్ఘకాలిక పగలుండడం మంచిది కాదు" అని ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే నాయకుడొకరు నాతో అన్నారు.

ఆ పగతోనే గత పదిహేనేళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో పోటీ చేసే అవకాశాన్ని పాండ్యాకు మోదీ ఇవ్వలేదు. ఆర్ ఎస్ ఎస్, బిజెపి నాయకత్వాలు ఈ చర్యకు గట్టిగానే అభ్యంతరం తెలిపాయి. కాస్త సర్దుకుపొమ్మని నచ్చచెప్పాయి. కాని మోదీ మెత్తబడలేదు. నవంబర్ చివర్లో ఒకరోజు ఆర్ఎస్ఎస్ నాయకుడు మదన్‌దాస్‌దేవి ఆఖరి ప్రయత్నంగా ఆర్ఎస్ఎస్ అగ్రనేత కె. ఎస్. సుదర్శన్, అద్వానీ, వాజ్‌పేయిల సందేశాన్ని తీసుకుని మోదీ ఇంటికి వెళ్ళాడు." ఇక నుంచైనా వాదించడం ఆపేసెయి. ఎన్నికల ముందు విభజన తీసుకురాకు. పాండ్యాకు అతని సీటు ఇచ్చెయి' ఇదీ ఆ సందేశం సారాంశం. మదన్‌దాస్ దేవి అర్ధరాత్రి వరకూ మోదీతోనే ఉన్నాడు. కాని మోదీ తన పంతం వీడలేదు. "తెల్లవారితే నాగపూర్(ఆర్ఎస్ఎస్ ప్రధాన కేంద్రం), ఢిల్లీల నుంచి ఫోన్లు వస్తాయని మోదీకి తెలుసు. అందుకే రాత్రి మూడు గంటలకే అలసటతో నీరసపడ్డానంటూ గాంధీ సివిల్ హాస్పిటల్‌లో చేరాడు. అతనితో గొడవపడడానికి పాండ్యా నేరుగా ఆసుపత్రికి వెళ్ళాడు. పిరికివాడిలా పడుకోకు, దమ్ముంటే ఇవ్వనని నా ముఖానే చెప్పు'అన్నాడు. మోదీ ఆ మాటల్ని పట్టించుకోనట్లే ఉండిపోయాడు. కాని లొంగలేదు. ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులే చివరకు చేసేదేం లేక మిన్నకుండిపోయారు. రెండు రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి బయటికి వచ్చి ఆ నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని కొత్త వ్యక్తికి కేటాయించాడు"అని పార్టీ నాయకుడు ఒకరు చెప్పారు.

గోద్రా అనంతరం రాష్ట్రంలో అత్యధికులు మతపరంగా సంఘటితం కావడంతో డిసెంబర్ ఎన్నికల్లో మోదీ అధికారంలోకి తిరిగొచ్చాడు. మరోపక్క పాండ్యా నాగపూర్‌కి, ఢిల్లీకి వెళ్ళి అక్కడ ఆర్ఎస్ఎస్, బిజెపి అగ్ర నాయకులందరికీ మోదీ మీద ఫిర్యాదు చేశాడు. తన సొంత ప్రయోజనాలకోసం మోదీ రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్‌ని, బిజెపిని నాశనం చేస్తున్నాడని మొత్తుకున్నాడు. పాండ్యాకి అప్పటికీ పార్టీకి ఉపయోగపడే 'విలువైన వ్యక్తి'గా గుర్తింపుఉంది. అందుకే ఢిల్లీకి వచ్చి జాతీయ స్థాయి బాధ్యతలు తీసుకోమని కోరారు. జాతీయ కార్యవర్గ సభ్యునిగా కానీ పార్టీ అధికార ప్రతినిధిగా కానీ విధులు నిర్వహించమన్నారు. "హరేన్ ఢిల్లీలో ఉండడమనేది భవిష్యత్‌లో దీర్ఘ కాలంలో మోదీకి హాని కలిగిస్తుంది అందుకే దాన్ని కూడా సాగనివ్వకూడదనుకున్నాడు" అని జడాఫియా అన్నారు.

మూడు నెలల తర్వాత 2003 మార్చి నెలలో ఒకరోజు పార్టీ అధ్యక్షుడి నుంచి పాండ్యాకు ఢిల్లీకి మకాం మార్చమని ఫ్యాక్స్ వచ్చింది. ఆ మరుసటి రోజే అహ్మదాబాద్‌లో అతని హత్య జరిగింది. పాకిస్థాన్ ఐఎస్ఐ, లష్కర్ తోయిబా, దావూద్ ఇబ్రహీం గ్రూపుల సంయుక్త దాడిలోనే హరేన్ మరణించాడని సిబిఐ, గుజరాత్ పోలీసులు ప్రకటించారు. పన్నెండుమందిని నిర్బంధంలోకి తీసుకుని ముద్దాయిలుగా గుర్తిస్తూ వారిపై కేసు పెట్టారు. ఎనిమిదేళ్ళ తర్వాత సెప్టెంబర్ 2011న గుజరాత్ హైకోర్టు అందర్నీ నిర్దోషులని తేల్చింది. 'చెత్తకేసు' అంటూ మండిపడింది. దర్యాప్తు మొత్తం అరకొరగాను, సంకుచితంగాను సాగింది. సంబంధిత దర్యాప్తు అధికారులు అసమర్థత కనబరచడం వల్ల ఇంత అన్యాయం జరిగింది. చాలా మంది వేధింపులకు గురయ్యారు. పెద్ద మొత్తంలో ప్రజాధనం, వనరులు వృథా అయ్యాయి. ప్రజలకు ఉపయోగపడాల్సిన న్యాయస్థానపు విలువైన సమయం కూడా వృథా అయింది. ఇందుకు అధికారులు బాధ్యత వహించాలి" అంటూ చీవాట్లు పెట్టారు న్యాయమూర్తి.

హరేన్ పాండ్యా తండ్రి విఠల్‌బాయి తన కొడుకును చంపించింది మోదీనేనని బహిరంగంగానే నిందించారు. తన కొడుకు హత్య కేసులో ముఖ్యమంత్రిని విచారించాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ కూడా వేశారు. సాక్ష్యం లేదని కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

దాడులు జరిగిన తర్వాత ఒక సంవత్సరంపాటు రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగానికి అధిపతిగా ఆర్.బి. శ్రీ కుమార్ విధులు నిర్వహించారు. ఆ కాలంలో హరేన్ పాండ్యా



మోదీ విమర్శకుల్లో ఒకరయిన హరేన్‌పాండ్యా మృతదేహంపై బిజెపి పతాకాన్ని కప్పుతున్న మోదీ. 2003 మార్చిలో ఈయన అంతుచిక్కని రీతిలో హత్యకు గురయ్యాడు.

కదలికలు, కార్యకలాపాల గురించి వివరాలు క్రమం తప్పక ఇస్తూ ఉండమని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనని అడిగారని శ్రీ కుమార్ నాతో చెప్పారు.

"మోదీ హరేన్ పాండ్యాని చంపించాడని నేను అనడం లేదు. అందుకు నా దగ్గర సాక్ష్యం లేదు. కానీ ఒకటైతే నిజం. బిజెపి లోపల మోదీకి వ్యతిరేకంగా ఎవరైతే మాట్లాడుతారో వాళ్ళు రాజకీయంగా సర్వనాశనం అయిపోతారు లేదా ఈ భూమి మీద మిగలకుండా అన్నా పోతారు" అని జడాఫియా అన్నారు.

పాండ్యా హత్య జరిగిన తర్వాత కొద్ది నెలలపాటు ఆ కేసును గుజరాత్ పోలీసుల ఆధ్వర్యంలో ఉండే నేర విభాగం దర్యాప్తు చేసింది. ఆ బాధ్యత తీసుకున్న అధికారి పేరు డి.జి. వంజారా. షోహ్రాబుద్దీన్ అనే చిన్న ముఠా నాయకుడిని, అతని భార్యను ఒక 'తప్పుడు ఎన్‌కౌంటర్"లో చంపిన నేరానికి ప్రస్తుతం జైలులో ఉన్నాడు. ఇంకా ఇలాంటి ఆరు చట్ట వ్యతిరేక హత్య కేసులలో విచారణను ఎదుర్కొంటున్నాడు. పాండ్యా కేసును ఆ తర్వాత సిబిఐకి అప్పగించారు. అప్పుడు కేసులో సహకరించడం కోసం వంజారా సహోద్యోగి అయిన అభయ్ చూడాశమను సిబిఐకి పంపించారు. పాండ్యా హత్య కేసును విచారించిన ఈ ఇద్దరు అవినీతి అధికారులు బలవంతపు వసూళ్ళ రాకెట్‌లో భాగస్వాములే. మోదీకి అత్యంత ఇష్టుడైన అప్పటి హోం మంత్రి అమిత్‌షానే ఈ వసూళ్ళ రాకెట్‌ని నడిపాడన్న ఆరోపణలున్నాయి. వాటితోపాటు అమిత్‌షా మీద నకిలీ ఎన్‌కౌంటర్లతో హత్యకు కుట్రపన్నాడన్న అభియోగం కూడా ఉంది. ఈ కేసులలో ఆరెస్టయిన అమిత్‌షా ప్రస్తుతం బెయిల్ మీద బయట ఉన్నాడు.

నవంబర్ 2011లో గుజరాత్ హైకోర్టు ఒక తప్పుడు ఎన్‌కౌంటర్ కేసులో తీర్పునిచ్చింది. ఇష్రత్ జహాన్ అనే కౌమారప్రాయంలో ఉన్న అమ్మాయి, మరో ముగ్గురు యువకులను 2004లో పోలీసులే కాల్చి చంపారు. ఈ నలుగురు లష్కర్ తోయిబాకి చెందిన టెర్రరిస్టులని, నరేంద్రమోడీని హత్య చెయ్యాలనుకుంటున్నారని పోలీసులు ప్రకటించారు. కానీ తమ పిల్లలు అమాయకులని చనిపోయినవారి కుటుంబ సభ్యులు వాదించారు. పోలీసుల ఆరోపణలను సవాలు చేస్తూ న్యాయస్థానంలో కేసు కూడా వేశారు.

తీర్పు ఇచ్చేనాడు న్యాయస్థానపు గది పోలీసులు, స్థానిక పాత్రికేయులు, రాజకీయ నాయకులూ, న్యాయవాదులతో కిక్కిరిసిపోయింది. ఇద్దరు న్యాయమూర్తులు గదిలోకి ప్రవేశించాక ఒక్కసారిగా మొత్తం నిశ్శబ్దంగా మారింది. జస్టిస్ జయంత్ పటేల్ తీర్పుని వెల్లడించారు. ఎన్‌కౌంటర్ వాస్తవికమైనది కాదని తేలింది. ఇది మా ఇద్దరి ఏకాభిప్రాయంతో ఇస్తున్న తీర్పు. కొత్త కేసును తెరిచి నిందితులను విచారించాలి " అని ఆయన అన్నారు.

పటేల్ ఆ తర్వాత రాష్ట్ర అడ్వకేట్ జనరల్ కమల్ త్రివేది, బాధితుల తరపు న్యాయవాది ముకుల్ సిన్హాలనుద్దేశించి మాట్లాడారు. కేసు విచారణను ఎవరికి అప్పగించాలని కోరుకుంటున్నారో తెలపమని అడిగారు. త్రివేది కేసు గుజరాత్ లోపలే ఉండాలని అభ్యర్థించాడు. "గుజరాత్ పోలీసులకు మరొక్క అవకాశం ఇవ్వాలి. వారిని ఈ కేసు విచారణకు అనుమతించండి" అన్నాడు.

ఆ తర్వాత సిన్హా మాట్లాడుతూ "గుజరాత్ పోలీసులే ఈ కేసులో నిందితులు కాబట్టి కేంద్ర సంస్థలలో ఏదో ఒకటి దర్యాప్తును చేపట్టాలి. గతంలో కేంద్ర సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాజకీయ వ్యతిరేకత ఎదురయింది. అయినా నేను ఎన్ఐఎ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ), సిబిఐలలో ఏదో ఒక దానికి అప్పగించమని సూచిస్తున్నాను" అన్నాడు.

త్రివేది వెంటనే వెక్కిరింతగా ''ముకుల్ సిన్హా రాజకీయ వ్యతిరేకత అంటున్నారు''..అని ఇంకా ఏదో చెప్పబోతుంటే జస్టిస్ పటేల్ మధ్యలోనే అందుకుని "ఏం ఆయన చెప్పేది మేం వినొద్దంటారా?" అన్నారు.

హాల్లో ఉన్నవారంతా ఫక్కున నవ్వారు. 'అలా నవ్వకండి, అలా నవ్వకండి ప్రభుత్వం చట్టాన్ని గానీ, న్యాయస్థానాన్ని గానీ గౌరవించని పరిస్థితి ఉండదు. మరొక్కసారి కేసును తాజాగా పరిశీలించాలని విన్నవించుకుంటున్నాను. అలానే గుజరాత్ పోలీసులకు మరొక్క అవకాశం ఇవ్వాలి"అన్నారు.

త్రివేది అభ్యర్థనను కోర్టు వినిపించుకోలేదు. దర్యాప్తును సిబిఐకి అప్పగించింది. 'టెర్రరిస్టులను' కాల్చామన్న ఆ పోలీసు ఆఫీసర్లు ఇప్పుడు సిబిఐ చేతిలో హత్య చేశారన్న అభియోగంపై విచారణను ఎదుర్కొంటున్నారు. గుజరాత్ ప్రభుత్వానికి వరుసగా వస్తున్న చట్టపరమైన ఇక్కట్లలో ఇది తాజాది. గుజరాత్‌లో 2003-2006 మధ్య జరిగిన ఇరవై 'ఎన్‌కౌంటర్ల'పై (తప్పుడువన్న ఆరోపణలున్నాయి) విచారణ తిరిగి ప్రారంభించాలని, ఆ ప్రక్రియ మూడు నెలలలోపే మొదలుకావాలని సుప్రీం కోర్టు ఈ జనవరిలో తీర్పునిచ్చింది. మరోపక్క మోదీ మంత్రి వర్గంలో పది శాఖలు నిర్వహిస్తున్న అమిత్‌షా మీద నడుస్తున్న కేసు మోదీకి మరో పెద్ద తలనొప్పి కాగలదు. బలవంతపు వసూళ్ళు, తప్పుడు ఎన్‌కౌంటర్ల కేసుల్లో విచారణ మరింత ముందుకు వెళ్ళి వీటికి బాధ్యత కేవలం ఒక డిప్యూటీ హోం మంత్రి స్థాయిలో కాక ఆపై స్థాయిలో కూడా తీసుకోవాలన్న ప్రశ్నలు తలెత్తితే అది మోదీకి మరింత సంకటంగా మారొచ్చు.

ఈ తప్పుడు ఎన్‌కౌంటర్ల బండారం బయటపడడం ఇంకా మొదలవ్వకముందు మోదీ ఒక్కొక్క 'టెర్రరిస్టు'ను చంపినప్పుడల్లా తన అధికారులను ఆ 'ఘనకార్యం' చేసినందుకు గొప్పగా ప్రశంసించేవాడు. 2007 డిసెంబర్‌లో జరిగిన ఒక బహిరంసభలో మోదీ సోహ్రాబుద్దీన్ హత్యను గురించి ఎంతో సంబరంగా చెప్పుకున్నాడు. మోదీ సోహ్రాబుద్దీన్ పేరులో ప్రతి శబ్దాన్ని నెమ్మదిగా దీర్ఘంగా సాగదీస్తూ "సోహ్రారారారా..బు..దీఈఈఈన్" ఇలా పలికాడు. అతని మతమేదో స్పష్టంగా తెలిసేలా. ''కాంగ్రెస్ వాళ్ళు మోదీ సోహ్రాబుద్దీన్‌ను చంపాడు, ఎన్‌కౌంటర్లు చేయిస్తున్నాడంటున్నారు...మీరే చెప్పండి సోహ్రాబుద్దీన్‌ని ఏం చేయాలో" అంటూ మోదీ సభకు హాజరైన వాళ్ళని అడిగాడు. ఆ గుంపు 'చంపాలి, చంపాలి' అంటూ సమాధానిమిచ్చింది.

ఎనిమిదవ భాగం

సెమినార్ పత్రిక 2002 దాడుల తర్వాత సోషియాలజిస్టు, మేధావి అయిన ఆశిష్‌నందీ రాసిన ఒక ప్రముఖ వ్యాసాన్ని ప్రచురించింది. ఆ వ్యాసంలో ఆయన అంతకు పదేళ్ళ క్రితం అంటే మోదీ 'ఒక చిన్న ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉంటూ బిజెపిలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్న' కాలంలో మోదీని ఇంటర్వ్యూ చేసిన నాటి అనుభవాలను గుర్తుకు తెచ్చుకుని వర్ణించాడు. క్లినికల్ సైకాలజిస్టు (మానసిక శాస్త్రవేత్త) కూడా అయిన ఆశిష్ నందీ ఆ సుదీర్ఘమైన ఇంటర్వ్యూ తీసుకున్నప్పుడు మోదీపై ఏర్పడిన అభిప్రాయాలను తన వ్యాసంలో వివరించారు.

ఇక్కడ నా ఎదురుగా ఒక నికార్సయిన ఫాసిస్ట్ (అధికార వాది, నిరంకుశ వైఖరి కలిగిన వాడు) కేసు ఉందనడంలో నాకెలాంటి సందేహం లేదు. ఫాసిస్ట్ అన్న పదాన్ని నేనొక దూషణగా వాడను. కేవలం మానసిక విశ్లేషణ ఆధారంగా వ్యక్తుల స్వభావాలను వర్గీకరించడానికి వాడతాను. ఒక వ్యక్తి భావజాలం, వ్యక్తిత్వ లక్షణాలు, సిద్ధాంతాన్ని అన్వయించుకునే క్రమంలో ఒక వ్యక్తిలో కలిగే ప్రేరణల నమూనా.. వీటన్నిటి బట్టి నిర్ధారించి వర్గీకరిస్తాను. ఆ వర్గీకరణలో ఒక కోవే ఫాసిస్ట్ అన్నది.

మానసిక శాస్త్రవేత్తలు, మానసిక వైద్యులు, మనోవిశ్లేషకులు ఏళ్ళ తరబడి పరిశోధన చేసి, విశ్లేషణ చేసి నిరంకుశ వ్యక్తిత్వ కోవకు కొన్ని ప్రమాణాల్ని స్థిరపరిచారు. ఆ ప్రమాణాలన్నిటి కలబోతలా మోదీ ఉన్నాడు.

తన భావనలను ఇతరులకు ఆపాదించడం(ఆపనిని తన ప్రయోజనాలకు విరివిగా ఉపయోగించుకోవడం); తన లోపలి మోహాలను, ఉద్వేగాలను గుర్తించడానికి భయపడడం, నిరాకరించడం; హింసకు సంబంధించిన ఊహలు బలంగా ఉండడం; భావోద్వేగాలు, అనుభూతులకు జీవితంలో అతితక్కువ చోటు ఇవ్వడం... ఇవన్నీ కలగలసి అతన్నొక స్వీయ మానసిక ధోరణులున్న నిరంకుశ వ్యక్తిత్వం కల వ్యక్తిగా చేశాయి.ఆ ఇంటర్వ్యూ చేసినప్పుడు మోదీ భారతదేశానికి వ్యతిరేకంగా ఒక 'మహా కుట్ర జరుగుతోంద'ని నాకు వివరించాడు. ప్రతి ముస్లింను ఒక దేశద్రోహిగాను, ఉగ్రవాదిగాను చిత్రించే ఆ కుట్ర సిద్ధాంతాన్ని నింపాదిగా, స్థిరమైన గొంతుతో వివరించడం నాకు ఇంకా గుర్తుంది

పై నిర్ధారణలను మోదీ అభిమానులు ఒక జాతి వ్యతిరేక కుహనా లౌకికవాద మేధావి పైత్యంగా కొట్టిపడేయవచ్చు. మోదీ సాధించినవి చూసి అసూయపడుతున్నాడని, కాంగ్రెస్ వారికి అమ్ముడుబోయాడని నిందించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మోదీ వ్యక్తిత్వానికి సంబంధించి ఆశిష్‌నంది విశ్లేషణ ఎంత శాస్త్రీయమైనదైనా సరే దానికిప్పుడు ప్రధాన స్రవంతి అభిప్రాయంలో సూదిమొనంత చోటు కూడా దక్కదు. కనీసం చివరంచుల్లో కూడా తారసపడదు, వినపడదు. ఇది తన పేరు ప్రతిష్టలకు పునరావాసం కల్పించుకోవడంలో మోదీ సాధించిన విజయంగానే చెప్పుకోవచ్చు. ముందే చెప్పుకున్నట్లు అత్యంత నైపుణ్యం కలిగిన ప్రజాసంబంధాల యంత్రాంగం పకడ్బందీగా చేసి పెట్టిన ప్రచారోద్యమ ఫలితంగానే మోదీలోని 'నరహంతకుడు' మాయమై 'వికాస పురుషుడు' వెలిశాడు. అయితే ఆ ప్రచారోద్యమానికి పునాదిగా మోదీలోని కొన్ని గుణాలను, లక్షణాలను అతను 'సాధించినవాటిని' వాడుకోవడంవల్ల కూడా అది వాస్తవికమైనదిగా కనిపిస్తుందేమో. పాలనా వ్యవహారాల్లో తాననుకున్నది సాధించే కార్యశీలత ఆకట్టుకుంటూ ఉండవచ్చు. డబ్బు కంటే అధికారం వైపే మొగ్గినట్లు కనిపిస్తాడు. కాబట్టి మిగిలిన రాజకీయ నాయుకుల్లో అత్యధికులు 'బలహీనులుగా' 'అసమర్థులుగా' 'అవినీతి పరులుగా' కనిపిస్తున్న తరుణంలో ఈ లక్షణాలు ఓటర్లను ఆకట్టుకుని ఉండవచ్చు. 2001లో ముఖ్యమంత్రి అయిన తరువాత రెండు వరుస అసెంబ్లీ ఎన్నికలు (మూడవది కూడా)ె గెలిచాడు. మోదీని ఆరాధించేవారున్నట్లే ద్వేషించేవారూ తక్కువేమీ లేరు. తనని ఆరాధించేవారిలోలానే వ్యతిరేకించేవారిలోనూ తీవ్రమైన భావోద్వేగాలను రేకెత్తిస్తాడతను. నిజానికి అతని అనుకూలురకు, వ్యతిరేకులకు అతని వ్యక్తిత్వం పట్ల స్థూలంగా ఒకే రకమైన అభిప్రాయాలుంటాయి. మోదీ పూర్తిగా అధికారాన్ని చేతిలోకి తీసుకుంటాడని ఇద్దరూ నమ్ముతారు. (అది సమర్థతకు సంకేతంగా అనుకూలురు భావిస్తే, నియంతృత్వ పోకడ అని వ్యతిరేకులు బలంగా నమ్ముతారు.) వ్యవస్థలను, విధానాలను, నిబంధనలను అన్నింటినీ పక్కన పెట్టి తాను అనుకున్నది చేస్తాడని అనుకుంటారు. (అనుకూలురు పని జరిగేలా అనుకుంటే వ్యతిరేకులు 'ఇష్టం వచ్చినట్లు'గా వ్యవహరిస్తాడని అనుకుంటారు.) మోదీలో కూడా తన గురించి అలాంటి భావనలే (అనుకూలురికున్న) ఉంటాయనటంలో ఎలాంటి సందేహం అక్కరలేదు. మోదీకి, అరుణ్‌జైట్లీకి సన్నిహితుడైన ఒక నాయకుడు నాతో ఇలా చెప్పాడు. "మోదీ జైట్లీని ఎప్పుడూ చట్టాన్ని అతిగా గౌరవిస్తాడని, దానికి మితిమీరిన విలువిస్తాడని విమర్శిస్తుంటాడు 'నువ్వెప్పుడూ చూసినా రాజ్యాంగం గురించి మాత్రమే మాట్లాడుతుంటావు' అని తరచూ జైట్లీతో అంటూ ఉంటాడట". అయితే ఆ చట్టమే ఈ మధ్య మోదీకి పెద్ద సమస్య అయ్యేలా ఉంది. అతని ప్రత్యర్థులు ప్రభుత్వం లోపలి అవినీతి కేసులను విచారించడానికి లోకాయుక్తను నియమించాలని కోరుతూ వరుసగా పిటిషన్లు వేస్తున్నారు. ఎనిమిదేళ్ళుగా మోదీ కావాలనే ఆ స్థానాన్ని భర్తీ చేయడం లేదు. కంపెనీలను రాష్ట్రానికి రాబట్టడం కోసం మోదీ వాళ్ళకిచ్చిన మితిమీరిన రాయితీలు, పన్ను మినహాయింపులను లోకాయుక్త పరిశీలించాలని ప్రతిపక్షం కోరుకుంటోంది. ఇప్పటి



ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా మొదలయి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎదిగిన మోదీ, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్‌తో 2009లో

వరకూ ఆ వివరాలను మోదీ ప్రభుత్వం ప్రజలముందుంచలేదు. కార్పొరేట్ అధినేతలతో తనకున్న అనుబంధం చాలాకాలంగా రాజకీయ ఎదుగుదలలో మోదీకి ఒక బలమైన అండనిచ్చే శక్తిగా నిలిచింది. అయితే ఈ వ్యాపార అనుకూల విధానం తనకు ఎన్నికల్లో నష్టం తెచ్చిపెట్టే అంశంగా మారకూడదని కోరుకుంటున్నాడు. నిజానికి మోదీకి ఎవరికీ తెలియని భయం ఒకటి ఉందట. "వ్యాపార సంస్థల సిఇఒలకు, బిజినెస్ పత్రికలకు అత్యంత ప్రీతిపాత్రుడైన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులానే తాను కూడా ఓడిపోతానేమోనని లోలోపల భయపడతాడని" ఆ పార్టీలో మోదీకి సన్నిహితంగా ఉండే నాయకుడొకరు నాతో చెప్పారు. "మోదీ కేవలం గెలవడం గురించి ఆలోచిస్తాడు. తనను తాను ఓటమిలో ఊహించుకోలేడు. ఈ వైఖరి సమస్యలను తెచ్చిపెట్టవచ్చు. భవిష్యత్‌లో అతను ఏదో ఒక కొసకు చేరతాడు. అయితే ప్రధాని కావచ్చు లేదా జైలులో ఉండవచ్చు. ఈ రెండింట్లో ఏదో ఒకటి తప్పదు"అని గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి ఒకరు నాతో వాఖ్యానించారు. నేను గుజరాత్ నుంచి వచ్చేయడానికి కాస్త ముందు ఒక ఆర్ఎస్ఎస్ నాయకుడు ఒకింత నిస్పృహతో ఇలా తన బాధను నాతో పంచుకున్నారు. 'శివలింగం మీద తేలు కూర్చుని ఉంది. చేత్తో తీసేయలేం, చెప్పుతోనూ కొట్టలేం.'

కారవాన్ మేగజైన్ సౌజన్యంతో....

గుజరాత్‌లో విస్తృతంగా పర్యటించి అనేకమంది నాయకులను, అధికారులను మోదీ రాజకీయ సహచరులను, కుటుంబ సభ్యులను, చిన్ననాటి మిత్రులను కలుసుకుని సమాచారం సేకరించి ఒక సీనియర్ జర్నలిస్ట్ రాసిన కథనం ఇది. రెండేళ్ళ క్రితమే కారవాన్ మేగజైన్‌లో ప్రచురితమయింది. ఎనిమిదేళ్ళ వయస్సులో ఆర్ఎస్ఎస్ 'బాల స్వయం సేవక్' గా మారినప్పటి నుంచి ఇటీవలి వరకు మోదీ రాజకీయ జీవితాన్ని, అతని వ్యక్తిత్వాన్ని పట్టిచ్చే కథనం ఇది. చదివి మీరే ఒక నిర్ధారణకు రండి.

ISBN 978-93-84162-22-1

9 789384 162221

ప్రజాశక్తి బుక్‌హౌస్